శ్రీమతే రామానుజాయ నమః

# కణ్ణినుణ్ శిఱుత్తాంబు

## తనియన్ వ్యాఖ్యానవివరణము.

## శ్రీమన్నాథమునులు సాయించిన తనియనులు.

**1. అవిదితవిషయాన్తర శ్శఠారే రుపనిషదాముపగానమాత్రభోగః।**
**అపిచ గుణవశాత్తదేకశేషీ మధురకవిర్హృదయే మమావిరస్తు॥**

ప్రతిపదార్థము: **అవిదితవిషయాన్తరః:-** (నమ్మాళ్వారు తప్ప) వేఱొకవిషయమును తెలుసుకొననివారును, **శఠారేః:-** నమ్మాళ్వారులయొక్క (దివ్యసూక్తులను) **ఉపనిషదాం:-** దివ్యప్రబన్ధములను, **ఉపగానమాత్రభోగః:-** గానము చేయుట ఒక్కటియే గొప్ప అనుభవప్రీతిగ తలంచువారును, **గుణవశాదపిచ:-** గుణము కారణముగను, **తదేకశేషీ:-** ఆ నమ్మాళ్వారుఒక్కరినే తమకు శేషిగ స్వీకరించువారైన **మధురకవిః:-** మధురకవియాళ్వారు **మమహృదయే:-** నా మనసునందు **ఆవిరస్తు:-** ఆవిర్భవించగలవారు- ఆవిర్భవించుగాక.

**అవతారిక:-** ఈ తనియనులో "వేఱొన్ఱుమ్ నానఱియేన్" అని ఆళ్వారును తప్ప ఇతరవిషయములను తెలుసుకొననివారై "శఠకోపులు" అను తిరునామముగల నమ్మాళ్వారుల భగవదనుభవమునందు నడచునట్టి (నివసించునట్టి) తిరువాయ్ మొళిని పాడుటయే మాధుర్యముగ తలంచువారై, దానితోనాగక నమ్మాళ్వారు తమయందు చూపిన వాత్సల్యగుణమునకు వశపడి వారినే తమదాస్యమును స్వీకరించు శేషి(స్వామి) యను నిశ్చయమును కలిగిన మధురకవులు నామనసునందు సర్వదా స్థిరముగనుండతగినవారు అని శ్రీమన్నాధమునులు అనుచున్నారు.

**వ్యాఖ్యానము:-** **అవిదితవిషయాన్తరః** - ఆవారును తప్ప ఇతరవిషయములను సమూలముగ తెలుసుకొననివారు. ఇతరవిషయము ఇట్టిది అని తెలియనివారు అని భావము. "శిన్దై మఱ్ఱొన్ఱిన్ తిఱత్తదల్ల" ఇతరములైన తలంపులు కలుగని (తి.వా.మొ 7-10-10), "ఎన్ అముదనై క్కణ్డ కణ్గళ్ మఱ్ఱొన్ఱినై క్కాణావే"- నా అమృతమును చూచిన కన్నులు ఇతరములను చూడవు- (అ.నా.పి-10),

స్నేహో మే పరమో రాజన్ త్వయి నిత్యం ప్రతిష్ఠతః।
భక్తిశ్చ నియతా వీర! భావో నాన్యత్ర గచ్ఛతి॥ (రా. ఉ. 40-15)

"స్వామీ! నాకు మీ సన్నిధియందు ప్రీతి నిత్యముగను, స్థిరముగను ప్రతిష్ఠింపబడినది. ఓ వీరుడా! మీ విషయమందు భక్తియు నిత్యమైయున్నది. నామనస్సు శ్రీవైకుంఠనాథునియందుకూడ పోవుటలేదు." అని సర్వేశ్వరుని విషయమందు క్రమముగ నమ్మావారును, తిరుప్పాణావారును, శిరియతిరువడియు (ఆంజనేయుడును) అనుసంధించినారు. వారు వదలిన విషయములుగ అనుసంధించబడిన ఇతరవిషయములతోబాటు వారు స్వీకరించిన ఆయా పెరుమాళ్ళను కూడ వదలుకొనినారని వీరి

విషయమందు చెప్పబడుచున్నది.ఎంబెరుమానుడు ఒకరే అయినను, ఇచట విషయాంతరములు అనబడు శబ్దముచే- నిత్యులు ముక్తులు గానము చేయు సామగానమును విను స్థానమైన పరమపదమునకు నాధుడైనవానిని, అసురులు, రాక్షసులచే బాధింపబడు దేవతల మొఱను వినుటకు వచ్చి వేంచేసియున్న పాలకడలి మొదలగు వ్యూహమును, అచటినుండి గంతువేసి అవతరించిన స్థానమైన రామకృష్ణాది విభవావతారములను, చేతనులందరిని పెంచి, ఉద్ధరించుటకు అనువుగ వేంచేసిన అర్చావతారములు మొదలగు వాటిని మనసునందు తలంచినవారుగ భావము. వీరికి తగిన (స్వరూపమునకు తగిన) స్థానమునందు ప్రతిష్ఠింపబడినవారు ఆవారే అగుటచే పైచెప్పబడిన వాటన్నింటిని ఇతరవిషయములుగ భావించి వాటిని తెలుసుకొనుటకు ఏమాత్రము ఇష్టపడనివారై యుంటిరి.

మాతాపితాయువతయస్తనయా విభూతిః సర్వం యదేవనియమేన మదన్వయానాం।
ఆద్యస్య నః కులపతేర్వకుళాభిరామం శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా।। (స్తో.ర.5)

"నా వంశస్థులకు ఎల్లప్పుడు తల్లియు, తండ్రియు, స్త్రీలును, సంతానమును, ఐశ్వర్యమును, ఇతరములన్నియును ఏ ఆళ్వారుల శ్రీపాదములో, మాకు ఆదిభూతులును, కులపతియును అయినవారి పొగడపూలచే అలంకరింపబడినవియును, శ్రీవైష్ణవసంపదను కలిగినవియును అగు అట్టి శ్రీపాదద్వంద్వమును శిరసా నమస్కరించుచున్నాను." అని ఆళవందారు తల్లి, తండ్రి మొదలగు సంసారసంబంధముగల అన్ని విషయములును నమ్మాళ్వారులే అని నిశ్చయించి ఇతరవిషయములను తెలియనివారైనట్లుగ వీరుగూడ, "అన్నైయాయ్ అత్తనాయ్ ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్ చడగోపన్ ఎన్నమ్బిరయే - తల్లియై, తండ్రియై, నన్ను పాలించు స్వభావులైన శఠకోపులు నా పూర్ణులే" (కణ్ణి. 4) అని అన్నియు ఆళ్వారులే అని అనుసంధించుచున్నారుగదా! నమ్మాళ్వారు "ఉణ్ణుమ్ శోఱు, పఱుగు నీర్, తిన్నుమ్ వెత్ర్రిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్- తినెడి యన్నము, త్రాగు నీరును, భోగ్యముగ వేసుకొను తాంబూలమును అన్నియును కృష్ణుడే" (తి.వా.మొ-6-7-1) అని అన్నియును ఎంబెరుమానుడే అనియుండునట్లు, వీరును తమకు అన్నియును ఆళ్వారే అని తలంచినవారు.

"కోయిల్ గొళ్ తైవమెల్లామ్ తొழ వైగున్దమ్ కోయిల్ కొణ్డ కుడక్కూత్తవమ్మాన్ కోయిల్ కొణ్డాన్ అదనోడుమ్ ఎన్నెఞ్జగమ్ - నివసించు దైవమునందరును నమస్కరించు వైకుంఠమును నివాసముగ చేసికొనిన కుంభనృత్యమును చేయు స్వామి, దానితోబాటు నామనసును, ఆత్మను నివాసముగ చేసికొనినాడు" (తి.వా.మొ 8-6-5) అనియును, "మొయ్త్తే తిరైమోదు తణ్ పాఱ్కడలుళాల, వైత్తేయ్ శుడర్ పామ్బణై నమ్బరనై వైత్తేన్ మదియాల్ - నిజముగ కెరటములచే మోదబడు చల్లని పాలసముద్రమునందు వేంచేసియుండు, వర్థిల్లుచున్నతేజస్సును, శేషశయ్యనధిరోహించిన మనపరమాత్మను మనసుచేత యుంచితిని" (తి.వా.మొ 8-7-10) అనియును, "అవన్ కడన్దుమ్ ఎన్నెఞ్జగలాన్ - ఆతడు పరుండియే నామనసును వదలలేదు" (తిరు. 35) అనియు, "ఉరుప్పిణి నఙ్గై అణి నెడుమ్ తోళ్ పుణర్న్దాన్- రూపుదాల్చిన వాంఛ, స్త్రీ సౌందర్యము, దీర్ఘమైన భుజములను కలసినాడు" ( ) అనియును, "ఎప్పోదుమ్ ఎన్నెఞ్జమ్ తుదిప్ప వుళ్ళేయిరుక్కిన్ఱ పిరాన్ - ఎల్లప్పుడు నా మనసును స్తుతించుటకు లోననే వేంచేసిన స్వామి" (తి.వా.మొ7-10-6) అనియును, "కణ్ గళ్ శివన్దు- కన్నులు ఎఱుపురంగును పొంది" (తి.వా.మొ.

8-8) "ఒరువన్ అడియేనుళ్ళాన్ - అద్వితీయుడైన దాసుడు ఉండినాడు" (తి.వా.మొ.8-8-1) అనియును, "తిరుప్పేర్ నగరాన్ తిరుమాలిరుఞ్జోలై పొరుప్పేయుఱైగిన్ఱ పిరాన్ ఇన్ఱు వన్దు ఇరుప్పేన్ ఎన్ఱు ఎన్ నెఞ్జు నిఱైయ పుగున్దాన్ - తిరుప్పేరైనగరనిర్వాహకుడును, తిరుమాలిరుంజోలై కొండపై అవతరించిన ఉపకారకుడు ఈనాడు వచ్చి, యుందును అని నా మనము నిండునట్లు ప్రవేశించినాడు" (తి.వా.మొ.10-8-6) అనియు,

"విణ్ మీదిరుప్పాయ్, మలైమేల్ నిఱ్పాయ్, కడల్ శేర్పాయ్, మణ్ మీదుళ్ళల్ వాయ్, ఇవత్తుళ్ ఎఙ్గుమ్ మఱైన్దుఱైవాయ్ ఎణ్ మీదియన్ఱ పుఱవణ్డత్తాయ్, ఎనదావి ఉళ్ మీదాడి - ఆకాశమమీదనుంటివి, కొండపై వేంచేసినావు, సముద్రమును చేరినావు, భూమిపై తిరుగాడు చున్నావు, వీటన్నిటియందును అంతటను కనపడకుండ నివసించుచున్నావు, లెక్కమించిన బహిరండములైన వాడివి, నాయాత్మయందు నర్తనము చేయుచున్నావు." (తి.వా.మొ.6-9-5)అనియును, "తేవర్ కోలత్తొడుమానాన్ - దేవవిగ్రహపూర్తిని గలవాడాయెను" (తి.వా.మొ.5-1-9) అను దైవవిగ్రహరూపిగా తనయందు ఎంబెరుమానుని సమస్తనివాసస్థానములుండును అని సాయించుటచే ఎంబెరుమానుని శ్రీపాదములను చేజార్చుకొనుటకు అశక్యముకాగ "తేవుమఱియేన్ - ఇతరములైన దైవములను తెలియనివాడను"(కణ్ణి.2) అని అనినను, "తేవపిరానుడై క్కరియకోలత్తిరువురుక్కాణ్బన్ - దేవతలకు ఉపకారకుడైన నీలమణివిగ్రహమంగళ స్వరూపుని చూచితిని"- (కణ్ణి. 3) అనుచున్నారు.

"అవిదితవిషయాన్తర శ్శతారేః" అనుటచే శఠారియైన నమ్మాళ్వారు తప్ప ఇతరదైవములను తాను తెలుసుకొనడు అని చిల్లరదేవతలను త్రోసివేసినారు. వీరి దృష్టి విలక్షణమైన దైవమయి నీలవర్ణుడైన మాస్వామి కృష్ణుడుగాయున్న సర్వోత్కృష్టుడైన సర్వేశ్వరునిగూడపక్కకు తప్పించినారని చెప్పుట ఇచట కానదగును. "కట్టుణ్ణప్పణ్ణియ పెరుమాయన్ ఎన్నప్పనిల్ నణ్ణి - కట్టబడునట్లుగ చేసిన అత్యాశ్చర్యచేష్టతములు గల నాస్వామిని చేరి" అని ఈవిషయమును వీరే సాయించినారు గద! "ఉన్నిత్తు మఱ్ఱొరు తెయ్ వమ్ తొళ్ళాళ్ అవనైయల్లాల్- నీవు తప్ప మరియొక దైవమును నమస్కరించను, ఆయనను తప్ప" (తి.వా.మొ.4-6-10), " ఎమ్బెరుమామాయనైయల్లదు ఒరుమాదైవమ్ మత్తుడైయమోయామే - మాయొక్క గొప్పమహాశ్చర్యచేష్టితములు చేసినవానిని తప్ప వేరొకగొప్ప దైవము మరియొకటిగలవారమా!" (తి.వాశిరియమ్ 7) అని వారు ఇతరదైవములను త్రోసిపుచ్చిరి. "తేవు మఱ్ఱఱియేన్- ఇతరమయిన దేవతను తెలియను" (కణ్ణి-2) అని వీరు ఈ ప్రబంధమందు ఆ పెరుమాళ్ళనుగూడ త్రోసిపుచ్చిరి. వీరియొక్క మాటనుండియే ఎంబెరుమానుని ఆశ్రయించిన నమ్మావారుల కంటె వారిని ఆశ్రయించిన మధురకవియావారు మిక్కిలి శ్రేష్ఠులని ప్రకాశకమగుచున్నది.

**శఠారేరుపనిషదాముపగానమాత్రభోగః:-** "నాట్టారోడు ఇయల్వొన్దు నారణనై నణ్ణినమే - లోకులతో సంబంధమును వదలుకొని నారాయణుని చేరితిమే!" (తి.వా.మొ 10-6-2) అనునట్లుగా సంసారజీవనమును వదలి అందు చిక్కుపడునట్లు చేయు శఠమును (జ్ఞానము లేకపోవుటను) త్రోసివేయుటచే "శఠకోపః" అనెడి పేరుకలిగిన ఆవారుల "మొళ్ళిపట్టోడుమ్ కవియముదమ్ - భాషపై పట్టుగల కవితామృతము", "యాళ్ళినిశై వేతమ్ - వీణాగానరూపములోనున్న వేదము" (తి.వా.మొ. తనియన్), "పణ్ణార్ పాడల్- స్వరపుష్టిగల

పాటలు" (తి.వా.మొ 10-7-5) అని కీర్తింపబడు ఉపనిషత్సారమైన పాటలను రుచితో అనుభవించినవారై "పావినిన్నిశై ప్పాడి త్తిరివనే - పాటలను ఇంపైన సంగీతముతోపాడి తిరిగితిని" (కణ్ణి.2), "నావినాల్ నవిత్తు ఇన్బమెయ్ దినేన్, మేవినేన్ అవన్ పొన్నడి మెయ్మ్మైయే" అనియున్న స్థితిని చెప్పుచున్నది.

"అవిదితవిషయాన్తరః శఠారేః" అని ప్రారంభించుటచే నమ్మాళ్వారివిషయమందు మధురకవి యాళ్వారులకు స్వరూపప్రయుక్తదాస్యము ఉన్నదని (స్వభావమువలన ఏర్పడిన దాస్యము) చెప్పుట అయినది. 'అపిచ గుణవశాత్తదేకశేషీ' అను మూడవపాదముచే నమ్మాళ్వారివిషయమందు మధురకవి యాళ్వారులకు గుణకృతదాస్యముకూడ (నమ్మాళ్వారి గుణములయందు అభినివేశముచేత కలిగిన దాస్యము) ఉన్నదని చెప్పబడినది. **అపిచ:-** ఇదివరలో చెప్పబడిన సహజమైన దాస్యము తమతో కూడ - ఈ రెండు దాస్యగుణములును కలసియుండుట అరుదైనది అని చూపించబడుచున్నది. **"గుణవశాత్తదేకశేషీ":-** తమగుణములచే నమ్మాళ్వారు మధురకవియాళ్వారును స్వీకరించుటచే. **"తదేకశేషీ"** వారొక్కరే శేషిగా స్వీకరింపబడినారు అని అనుచున్నారు. సహజమైన శేషిత్వము ఒకప్రక్కను, గుణముచే దాస్యము చేయువారిగయుండుట వేరొకప్రక్కను యుండుట అను స్థితిని ఇది తప్పించినది. "గుణవశాత్" అను పంచమీవిభక్తి తృతీయావిభక్త్యర్థమందు వచ్చినది-గుణములచేతను- అని. ఈవిషయమును "ఆదలిన్అన్నైయాయ్ అత్తనాయ్ ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్ చడగోపన్ ఎన్ నమ్బియై - అనియును, "పయనన్టాగిలుమ్, పాఙ్గల్లరాగిలుమ్, శెయల్ నన్టాగ తిరుత్తి ప్పణికొళ్వాన్ కుయిల్ నిన్టార్ పొళ్ళిల్ శూళ్ కురుగూర్ నమ్బి" అని మధురకవియాళ్వారు వాత్సల్యము మొదలైన గుణములపూర్తిచే ఆళ్వారు తమదాస్యమును స్వీకరించుటచే తాము వారికి గుణముచేత దాస్యము చేసినవారుగ వారొక్కరే తమకు శేషిగను స్వీకరించినవారుగనుండుటను చెప్పినారుగద!
**మధురకవిః:-** ఈవిధముగయున్న మధురకవులు. "అణ్ణిక్కుమ్ అముదూరుమ్ ఎన్నావుక్కే - అతిమధురమైన అమృతము నానాలుకకొక్కదానికే యూరును" అనునట్లుగ వాఙ్మాధుర్యము గలవారు. **మమ హృదయే:-** (మధురకవుల)చరమపర్వనిష్ఠను కోరుకొను నామనమునందు **ఆవిరస్తు:-** నమ్మాళ్వారితో కలసియుండి వారియొక్క దివ్యప్రబంధములను వికసింపజేయు స్థితిలో ఆవిర్భవింపతగినవారుగ యుండదగినవారు అని ఈతనియన్ సాయించిన శ్రీమన్నాథమునులు అనుచున్నారు. దీనివలన శ్రీవైష్ణవులకు అనుకూలురైన ఆచార్యనిష్ఠులు కోరుకొనదగినవారు అని అర్థము చెప్పబడుచున్నది.

**2. వేఱొన్ఱుమ్ నానఱియేన్ వేదమ్ తమి శెయ్ ద మాఱన్ చడగోపన్ వణ్ కురుగూర్ -ఏఱెఙ్గళ్ వావామెన్టేత్తుమ్ మదురకవియార్ ఎమ్మై ఆళ్వార్ అవరేయరణ్**

ప్రతిపదార్థము: **వేఱొన్ఱుమ్ నానఱియేన్ :-** (నమ్మాళ్వారులు తప్ప) వేరొకవస్తువును నేను తెలుసుకొనను. **వేదమ్ తమిళ్ శెయ్ ద:-** వేదార్థములను ద్రావిడభాషయైన తమిళమందు సాయించిన, **మాఱన్:-** మాఱన్ అను పేరు గలవారును, **వణ్ కురుగూర్ ఏఱు:-** సుందరమైన తిరుక్కురుగూరు నగరమునకు నిర్వాహకులును అయిన **చడగోపన్:-** నమ్మాళ్వారులు, **ఎఙ్గళ్ వాళ్వు ఆమ్ ఎన్టు:-**మా ప్రాణములను కాపాడినవారు అని, **ఏత్తుమ్:-** స్తోత్రము చేయునట్లు కృపచేసిన, **మదురకవియార్:-** మధురకవియాళ్వారులు, **ఎమ్మై ఆళ్వార్:-** మమ్ములను నిర్వహించువారు, **అవరే:-** ఆమధురకవులే, **అరణ్:-** (ప్రపన్నకులమునకు) రక్షకము అయియున్నవారు.

**అవతారిక:-** నమ్మాళ్వారులు తప్ప వేరు దైవమును తెలియని మధురకవులే మనకు స్వామియు, రక్షకులును అయినారని అనుచున్నారు నాథమునులు.

**వ్యాఖ్యానము:-** "వేఱొన్నుమ్ నానఱియేన్ వేదమ్ తమిళ్ శెయ్ ద మాఱన్ చడగోపన్ వణ్ కురుగూర్ ఏఱు ఎజ్గళ్ వాళ్వామ్ ఎన్దేత్తుమ్ మదురకవియార్ ఎమ్మై యాళ్వార్" అనునది ఎట్టి హద్దులులేని మధురకవియావారులశ్రీసూక్తులననుసరించి చెప్పినవారు, దానికి మించినవారే రక్షకము అను ప్రశంసచేత దీనికి తగిన మధురకవియాళ్వారే మనకు స్వామియు రక్షణమును అయియున్నారు అను అనుచున్నారు.

'తేవు మఱ్ఱఱియేన్ - ఇతరదేవతను నేను తెలుసుకొనను'అని మధురకవులు సాయించిన "వేదమ్ తమిళ్ శెయ్ ద మాఱన్ చడగోపన్ అవరే యరణ్ - వేదమును తమిళభాషలో ప్రవచించిన మాఱన్ అను శఠకోపులు, వారే రక్షకము" అనుచున్నారు, కారిమాఱులు, ఉపకారకులు, 'చడగోపన్ ఎన్నమ్బి - శఠకోపులు నాపూర్ణులు'(శ్రేష్ఠతములైన వ్యక్తి) అని మధురకవియాళ్వారు సాయించినదానినే 'మాఱన్ శడగోపన్ -మాఱపుత్రులు శఠకోపులు' అనుచున్నారు వీరు(శ్రీమన్నాథమునులు) "పెరియవణ్ కురుగూర్ నగర్ నమ్బిక్కు ఆళురియనాయ్ అడియేన్ పెఱ్ఱ నన్మై - గొప్పది, శ్రేష్ఠమైనదియైన కురుగూరునగర నిర్వాహకునకు దాస్యము చేయతగినవాడను, దాసుడుగా నున్నవాడనుఅయిన నేను పొందిన లాభము" అని వారు సాయించిన దానినే వీరు "వణ్ కురుగూర్ ఏఱు ఎజ్గళ్ వాళ్వు ఆమ్ - శ్రేష్ఠమైనకురుగూరు ఔచ్ఛ్రితయే మాకు జీవనమగును" అనుచున్నారు వీరు.

"ఎఱ్ఱుమైయుమ్ ఎమ్బిరాన్ నిఱ్క తన్ పుగళ్ ఏత్తవరుళినాన్ - ఎనిమిది దిక్కులయందును మన ఉపకారకుడు స్థిరముగ తనకీర్తిని స్తుతించునట్లు కటాక్షించినాడు." (కణ్ణి. 7) అని వారు సాయించినదానినే "ఏఱు ఎజ్గళ్ వాళ్వామ్ ఎన్దేత్తుమ్ మదురకవియార్ - ఔన్నత్యము మా జీవనమగును అని స్తుతించు మధురకవులు" అనుచున్నారు వీరు. "ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్- నన్ను పాలించుట సహజమైన స్వభావముగ గలవాడు." (కణ్ణి-4) అని వారు సాయించినదానినే వీరు "ఎమ్మై ఆళ్వార్ - మమ్ములను పాలించువారు" అనుచున్నారు వీరు. మధురకవియాళ్వారును పాలించుచున్నవారు నమ్మాళ్వారు. నాథమునిమొదలగు మనందరను పాలించుచున్నవారు మధురకవియాళ్వారు. **అవరే అరణ్:-** (వారే రక్షకము) రక్షించువారు. "శరణ్" అను పాఠాన్తరము అయినను రక్షకులు అనియే అర్థము. మధురకవియాళ్వారుకు అంతయు నమ్మాళ్వారే యైనటుల మనకు అన్నివిధములుగను అన్నియును మధురకవులే అనుచున్నారు శ్రీమన్నాథమునులు.

***పిళ్ళైలోకంజీయర్ కటాక్షించినతనియన్ వ్యాఖ్యాన వివరణము సమాప్తము.***

# కణ్ణినుణ్ శిఱుత్తామ్బు

## వ్యాఖ్యానవివరణము.

"వాయ్త్త తిరుమన్తిరత్తిన్ మత్తిమమామ్ పదమ్ - లభించినతిరుమంత్రమందలి మధ్యమపదము" అయిన నమశ్శబ్దార్థమును ప్రకాశింపజేయు ఈదివ్యప్రబంధమునకు నంజీయరువారు, నంబిళ్ళైగారు, పెరియవాచ్చాన్ పిళ్ళైగారు, అగియమణవాళపెరుమాళ్ నాయనారులు అను నలుగురు మహాచార్యులు

అమృతముకంటె మధురమైన వ్యాఖ్యానములను కటాక్షించినారు. వాటియందు పెరియవాచ్చాన్ పిళ్ళైగారి వ్యాఖ్యానమును ముఖ్యముగా తీసుకొని ఇతరవ్యాఖ్యానములలోని అపూర్వమైన అర్థములను చేర్చి ఈ వివరణము రచింపబడుచున్నది.

## ప్రవేశవివరణము.

ఈ కణ్ణినుణ్ శిఱుత్తాम్బు అను ప్రబంధమును కటాక్షించిన మధురకవియాళ్వారులు ఋషులకంటెను, ఇతర ఆళ్వారులకంటెను అతి విశిష్టత కలవారు. ఋషులు అనగా -

త్రైగుణ్యవిషయా వేదాః నిస్త్రైగుణ్యో భవార్జున।
నిర్ద్వంద్వో నిత్యసత్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్।। (భ.గీ 2-45)

[అర్జునా! మూడు గుణములలోను ఒక్కొక్కదానిని అధికముగయున్న పురుషులకొఱకు ఏర్పడినది వేదము. నీవు ఒక్కొక్కదానితోను కలసిన మూడుగుణములు నశించినవాడవై సత్త్వగుణమునే వృద్ధి చేసుకొనుము. సుఖదుఃఖములను సాంసారికస్వభావములను పోగొట్టకొనబడినవాడవై ఎల్లపుడు సత్త్వమందే స్థిరముగ నుండినవాడవై, లేనటువంటి ఇతరార్థములను పొందుట, ఉన్నవాటిని రక్షించుకొనుట అను రెండింటిని లేనివాడవై (అంతరార్థమైన) ఆగమస్వరూపమందే అభినివేశమును గలిగినవానిగ అగుము] వారివారి గుణములకు తగినట్లుగ ఐశ్వర్యము, కైవల్యము, భగవత్ప్రాప్తి మొదలగు అన్ని పురుషార్థములను, వాటిని పొందుటకు తగిన సాధనములను విధించిన వేదమును ప్రకాశింపజేసినవారు ఋషులు.

అనగా వేదమును వివరించు ఇతిహాసపురాణములను రచించుటద్వారా సంసారిజీవులవద్దగల మూడుగుణముల ఉచ్చనీచస్థితులకు అనుగుణముగ వారు కోరునట్టి ఐశ్వర్యము మొదలగు అల్పపురుషార్థములను అంతకు మించిన పురుషార్థమైన మోక్షమును జనులకు ఉపదేశించుచు వచ్చిరి.

ప్రాజాపత్యం గృహస్థానాం బ్రాహ్మం సన్యాసినాం స్మృతం।
యోగినామమృతం స్థానం స్వాత్మసంతోషకారిణామ్।।
ఏకాన్తినః సదా బ్రహ్మధ్యాయినో యోగినో హియే।
తేషాం తత్పరమం స్థానం యద్వై పశ్యన్తి సూరయః।। (వి.పు. 1-6-87,88)

[గృహస్థధర్మమును అనుష్ఠించువారికి ప్రజాపతిలోకములను, తురీయధర్మమును అనుష్ఠించువారికి బ్రహ్మలోకమును, తనఆత్మానందమును చూచు కైవల్యనిష్ఠునికి నాశములేని కైవల్యస్థానమును, ఎల్లప్పుడును బ్రహ్మనే ధ్యానము చేయు ఏకాంతులగు యోగులకు నిత్యసూరులు ఎల్లప్పుడును అనుభవించు ఉత్తమమైన పరమపదమను స్థానమును పొందదగినవిగయున్నవి.] అనునట్లుగ అనేకవిధములైన ఐశ్వర్యములను కోరుకొనువారికి వాటికి కారణమైన వర్ణాశ్రమధర్మములను ఉపదేశించిరి. ఆత్మానుభవరూపమైన కైవల్యమోక్షమును కోరుకొనువారికి తమ ఆత్మను పొందుటయు, దానికి కావలసిన సాధనములను ఉపదేశించినారు. సత్త్వగుణము ఎల్లప్పుడును మిక్కిలిగయున్నవారికి భగవత్ప్రాప్తియు, దానికి సాధనములను ఉపదేశించిరి. పరాశరమహర్షుల ఈప్రమాణమునే ఇతరమహర్షుల యుపదేశములకు ప్రమాణముగ చూపబడినది.

ఈఋషులకంటె ఆళ్వారులకు మిక్కిలి విలక్షణత గలదు. అది యెట్లనగ, వేదముయొక్క ప్రత్యక్షభావమై శ్రేష్ఠమైనపురుషార్థముగ చెప్పబడు భగవత్ప్రాప్తియందే కాలూనివారై ఇతరులకు ఉపదేశించునపుడు శాస్త్రములయందు గ్రహింపదగినదిగ చెప్పబడు ఐశ్వర్యములను, కైవల్యములను

కాదనగలవాటిని ఉపదేశించువారు ఆళ్వారులు. ఇదియే ఋషులకంటె వారికి గల గొప్పదైన విశిష్టత. ఇతర ఆళ్వారులకంటె మధురకవిఆళ్వారులకు ఎక్కువ విశిష్టత గలదు. ఎట్లనిన ఆవారులు ఉపదేశించిన శ్రేష్ఠమైన పురుషార్థమైన భగవత్ప్రాప్తి, దాని చివరిహద్దైన భాగవతులకు దాస్యముచేయువరకును వ్యాపించినది వీరి విషయమున. దానినే వీరు ఉపదేశించినారు.

వీరికి ఇట్టి ఔన్నత్యమెట్లు వచ్చెననిన, నమ్మాళ్వారు "పొయ్ నిన్ఱ జ్ఞానమ్" (తి.వి.-1) అని వారి మొదటి ప్రబంధమునుండి, రెండవది, మూడవది అయిన తిరువాశిరియం, పెరియతిరువందాదులను పూర్తిచేసి, ఆఖరిప్రబంధమైన తిరువాయ్ మొళ్ళి చివర "అవావఱ్ఱు వీడుపెఱ్ఱ కురుగూర్ చ్చడగోపన్ - ఆశ తగ్గి మోక్షమును పొందిన కురుకాపురినిర్వాహకులైన శఠకోపులు" (తి.వా.మొ.10-10-11) అనునంతవరకును భగవద్విషయమునే సామాన్యముగ అనుభవించినారు. అయినను, "పయిలుమ్ శుడరొళి - వృద్ధిచెందుచున్న కాంతితేజస్సు" (తి.వా.మొ.3-7), "నెడుమాఱ్కడిమై - దీర్ఘవ్యామోహశీలికి దాస్యము"(తి.వా.మొ.8-10) మొదలగు స్థలములయందు వారు పరమపురుషార్థముగ చివరిహద్దులోనిదిగ అభిమానించిన భగవద్దాసులకు దాస్యము చేయుటయే వీరు నేరుగ ఆశ్రయించి నమ్మాళ్వారే తమకు పరమప్రాపకము మొదలైన అన్నియును అనుచున్నారు ఈదివ్యప్రబంధములో. ఆచార్యుడు కోరుకొని స్వీకరించిన పురుషార్థమే సత్త్వగుణప్రధానులైన వారందరిచేతను స్వీకరింపబడదగినది అని అర్థము మహాభారతసారమైన శ్రీవిష్ణుసహస్రనామ అధ్యాయములో చెప్పబడెను.

అనగా శరతల్పమందు శయనించిన భీష్ములవద్ద తెలుసుకొనవలసిన అన్ని అర్థములను ఏఒక్కదానిని వదలకుండ వినిన ధర్మజుడు "వీరు తమకు శరణ్యముగ స్వీకరించిన తత్త్వహితపురుషార్థములే మనకును శరణ్యములు" అని తలంచి, "కోధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః- అన్ని ధర్మములలోను ఏధర్మము మిక్కిలి శ్రేష్ఠమని మీరు భావించుచున్నారు?" అని పరమధర్మము ఏది యని ప్రశ్నించగ

"ఏష మే సర్వధర్మాణాం ధర్మోధికతమో మతః।

యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చేన్నరస్సదా।।

[మనుష్యుడు భక్తితో పుండరీకాక్షుని స్తుతులతో ఎపుడును అర్చించుటయే ధర్మములన్నిటియందును ఉత్తమమైన ధర్మమని నాభావము] అని భీష్ములవారు తాను కోరుకొనిన అర్థమును ఉపదేసించినారుగదా! మనరామానుజదర్శనమందు స్త్రీలు, పామరులుగూడ రామానుజులు కోరుకొనిన పురషార్థమునే- ప్రపత్తినే- స్వీకరించినారు. ఎంబెరుమానారుల శిష్యురాలైన త్రిపురాదేవి యనెడి రాజపత్నివద్దకు వచ్చి 'మీరు ఎంబెరుమానుడే ఉపాయముగను, ఉపేయముగను ఆశ్రయించతగినవాడు అని నిశ్చయముతోనుండుట బలీయములైన శ్రుతిస్మృతులయందు అట్లు చెప్పియుండుటచేతనేగదా!' అని కొంతమంది ప్రశ్నించగ, దానికి ఆమె 'అటులగాదు, ఇళ్ళల్లో తొలినాటి అన్నభాండము అనగా చలిదివణ్ణము నుంచు కుండనుంచు ఈశాన్యదిక్కుకు అధిపతియైన శివుని రామానుజులవారు ఆశ్రయించియున్నచో, ఆదైవమునే మేముగూడ ఆశ్రయించియుందుము. అటులగాక శ్రీమన్నారాయణునే వారు ఆశ్రయించుటచే మేముగూడ ఆశ్రీమన్నారాయణునే వారు ఆశ్రయించుటచే మేముగూడ అట్టి శ్రీమన్నారాయణునే ఆశ్రయించినాము" అనిచెప్పిన ఐతిహ్యముఇచట అనుసంధించుటకు తగియున్నది. అదేన్యాయప్రకారము, శ్రీమధురకవి యాళ్వారుకూడ నమ్మాళ్వారు తాము శరణుపొందిన దాసులకు దాసుడగుటయే తమకు శ్రేష్ఠమైనలాభముగ నిశ్చయించుకొనినారు ఈదివ్యప్రబంధమునందు. దాసులకు దాసులగుటయనెడి ఈశ్రేష్ఠమైన పురుషార్థము

శ్రీరామాయణపురుషులయందు శ్రీశత్రుఘ్నాళ్వానులచే అనుష్ఠింపబడినది. అది యెట్లనిన,

"సతు మేధావినౌ దృష్ట్వా వేదేషు పరినిష్ఠితౌ। వేదోపబృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః।। -ఆవాల్మీకి భగవానుడు మేధావులును, వేదమునందు నిష్ణాతులైనవారినిచూచి, వేదమును వివరించుటకు వారిని చేరినారు" (రా.బా.కాం. 4-6) అనినట్లుగ వేదార్థములను ప్రకాశింపజేయుటకు ఏర్పడిన ఇతిహాస శ్రేష్ఠమైనది శ్రీరామాయణము. అట్టి ఇతిహాసశ్రేష్ఠమునందు ప్రధానపురుషులయిన రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురును ధర్మమును స్థిముగ నిల్పుటకు అవతరించినవారు అగుటచే క్రమముగ నాలుగు అర్థములను అనుష్ఠించి చూపినారు.

"మర్యాదానాం చ లోకస్య కర్తా, కారయితాచ సః। - లోకపు మర్యాదలు-నడవడికట్టుబాట్లు-నియమించువాడును, పాటించువాడును, పాటింపచేయువాడును రాముడే" (రా.సుం.కా.35-11) అను ప్రకారము పెద్దవాడు చెప్పినది చిన్నవాడు వినవలెను అను ధర్మము సామాన్యముగ నశించియుండుటచే శ్రీరామప్రభువు తండ్రిగారిమాట వినుట, పెద్దలమాట వినుట, తనతోటివారి చెప్పినమాటను వినుట మొదలగువాటినన్నిటిని స్వీకరించవలసిన ధర్మములుగ తాను అనుష్ఠించి చూపినారు.

సజగామ వనం వీరః ప్రతిజ్ఞామనుపాలయన్।
పితుర్వచననిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్।। (రా.బా.కాం.1-24)

[వీరుడైన ఆరాముడు ప్రతిజ్ఞను పరిపాలించి తండ్రిగారియాజ్ఞచేతను, కైకేయికి ప్రియమగుటచేతను, వనమునకు వెళ్ళెను] అని చెప్పినప్రకారము తల్లితండ్రులమాటను వినినారు.

అగస్త్యవచనాచ్చైవ జగ్రాహైంద్రం శరాసనం।
ఖడ్గంచ పరమప్రీతస్తూణీచాక్షయసాయకౌ।। (రా.బా.కాం. 1-42)

[అగస్త్యులవారిమాటప్రకారము రామప్రభువు ఇంద్రుని ధనుస్సును, ఖడ్గమును, తరగనిబాణునుగల రెండు తూణీరములను తీసుకొనెను] ఈప్రకారము మహర్షియైన అగస్త్యులవారి మాటను పాటించెను.

తతః సుగ్రీవవచనాత్ హత్వా వాలినమాహవే।
సుగ్రీవమేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్।। (రా.బా.కాం.1-70)

[ఆతరువాత సుగ్రీవుడు చెప్పినమాటను అంగీకరించి వాలిని యుద్ధమందు సంహరించి సుగ్రీవునే వానిరాజ్యమునందు స్థిరముగ నిల్పినాడు.]అని స్నేహితునిమాటను పాటించుట చూపినాడు.

అందుచేత శ్రీరాముని అవతారము సామాన్యధర్మములను అనుష్ఠించుటకు ఏర్పడినది.

"సహజముగ శేషియైన ఎంబెరుమానునిగురించి వానికి దాస్యమునుచేయు చేతనుడు కైంకర్యమును చేసి సత్తను పొంది తాను సత్తగలవాడుగ అగుటకు తగును" అను విశేషధర్మమును అనుష్ఠించినవారు ఇళైయపెరుమాళయిన లక్ష్మణుడు.

కురుష్వ మామనుచరం వైధర్మ్యం నేహ విద్యతే।
కృతార్థోహం భవిష్యామి తవచార్థః ప్రకల్పతే।। (రా.అ.కాం.31-24)

[నన్ను కైంకర్యపరునిగ చేసికొనుము. దీనియందు ధర్మవిరుద్ధమేమియును లేదు. (దీనివలన) నేనుగూడ ధన్యుడనగుదును, మీయొక్క కార్యమును జరుగును.]

భవాంస్తుసహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే।
అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చతే।। (రా.అ.కాం.31-25)
[మీరు వైదేహితోకూడ కొండలు, లోయలయందు ఆనందించుడు. దాసుడు మీరు మేలుకొని యున్నపుడును, నిద్రించుచున్నప్పుడును మీకు అన్నివిధములైన కైంకర్యములను చేయుదును.]

సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః।
సీతామువాచాతిశయా రాఘవంచ మహావ్రతమ్।। (రా.అ.కాం.31-2)
[రఘువంశమునకు అతిశయము కలిగించువాడును, మిక్కిలికీర్తిగలవాడును అగు ఆలక్ష్మణుడు అన్నగారి శ్రీపాదములను బాగుగా పట్టుకొని సీతను(ఆశ్రితసంరక్షణమయిన) మహావ్రతముతోనున్న రాఘవుని చూచి చెప్పినాడు]

అను శ్రీరామాయణవాక్యములు ఈవిషయమునకు ప్రమాణము.

రాజ్యంచ తవ రక్షేయమహం వేలేవ సాగరం।
ప్రతిజానామి తే వీర మాభూవం వీరలోకభాక్।। (రా.అ.కాం.23-27)
[వీరుడా! సముద్రమునకు చెలియలికట్టవలెయున్న నేను మీయొక్క రాజ్యమును రక్షించుదును. అట్లుగానిచో (ఆవిధముగ చేయలేకపోయినచో) మీ రాజ్యమునందు జీవింపసమర్థుడనుగాను. వీరులైన దశరథులు పోయినలోకమునకు పోవుదును అని ప్రతిజ్ఞ చేయుచున్నాను] అనిన ప్రకారము తాను కోరిన రామకైంకర్యమును నిర్బంధించి చేసిన లక్ష్మణునివలెగాక "శేషి ప్రీతుడగునట్లు వాని ఇష్టప్రకారము దాస్యము చేయుట అనెడి పారతంత్ర్యమే శేషభూతునకు స్వీకరింపదగినది" అను అర్థమును అనుష్ఠించినవాడు శ్రీభరతాళ్వాన్. రాముని విడచి బ్రతకలేని తనస్థితిని లెక్కచేయక శేషియైన రాముని మనస్సును గ్రహించి

తతః శిరసి కృత్వా తు పాదుకే భరతస్తథా।
ఆరురోహ రథం హృష్టః శత్రుఘ్నేన సమన్వితః।। (రా.అ.కాం.113-1)
[తదుపరి శత్రుఘ్నునితోకూడ భరతుడు తన శిరస్సుపై రామపాదుకలను ఉంచుకొని చాల సంతోషించినవాడై అపుడే రథమును అధిరోహించినాడు.] అని సంతోషముతో రాముని విడచి ఊరికి తిరిగి వెళ్ళినాడుగదా భరతాళ్వాను!

ఇక భరతాళ్వానుయొక్కస్థితిని చక్కగ వర్ణించు "రాజ్యంచ" అను శ్లోకమును వివరముగ చూతము.

**"రాజ్యంచ తవ రక్షేయం"** - మీ రాజ్యమునుగూడ నేను రక్షించుదును.

"తం మత్తమాతంగవిలాసగామీ గచ్ఛన్తమవ్యగ్రమనా మహాత్మా।
స లక్ష్మణో రాఘవమిష్టచేష్టో రరక్ష ధర్మేణ బలేనచైవ।। (రా.కి.కాం.1-128)
[మదించిన ఏనుగుయొక్క గమనమువంటి నడక గలవాడును, (రామప్రభువు కాక వేరొకరియందు) చిక్కని మనము గలవాడును, మహాపురుషుడును రామకైంకర్యమునే (ప్రీతియైనదిగ) మధురమైనదిగ

స్వీకరించువాడైన లక్ష్మణుడు, తనకంటె ముందుగ నడచు రామప్రభువును ధర్మముచేతను, బలముచేతను రక్షించెను.] అని ప్రారంభించి లక్ష్మణునివలె మిమ్ములను మాత్రము కాపాడుటతో ఆగక మీయొక్క రాజ్యమును రక్షించగలను. 'నాకు దాస్యము చేయు నీవు నన్ను రక్షించుట సాధ్యమా!' అను ప్రశ్న ఉదయించగ 'నేను మీకు దాస్యము చేయువాడినైనను, నా భక్తికి కట్టుబడిన మీరు నన్ను అత్క్రమింప సాధ్యము కాదుగదా!' అనినాడు. **అహం వేలేవ సాగరం :-** (నేను సముద్రమునకు చెలియలికట్టవలె) సముద్రమునకు చెలియలికట్ట ఒకహద్దును సూచించునదైనను, సముద్రము దానిని దాటలేదుగదా! అటులనే మీరును పెద్దవారు అను కారణముచే మిమ్ములను రక్షించుట అను కార్యమును మీకు తప్పించుట సాధ్యము కాదు. **ప్రతిజానామి:-** మీవెనుక వెళ్ళుచున్నాను. నేను వెనుక వచ్చునట్లు ప్రతిజ్ఞ చేయుచున్నాను. **తే వీర:-** నీకొఱకు ఓ వీరుడా! ఒక పిరికివాని ముందర ప్రతిజ్ఞ చేయుచున్నాను దాసుడు ప్రతిజ్ఞచేసినచో దానిని భంగము చేయలేని వీరులైన మీ సమక్షమున ప్రతిజ్ఞ చేయుచున్నాను. **మా భూవం:-** అట్లు చేయలేనినాడు మీ రాజ్యమును వడచి బయటకు పోవుదును. ఈ ప్రతిజ్ఞను నెరవేర్చలేకపోయినచో మీకంటె ముందుగ జీవించుటకు అర్హతలేనివాడనుమాత్రమేగాక మీరాజ్యములో నుండుటకు అర్హతలేనివాడనగుదును. **వీరలోకభాక్:-** వీరలోకములోనుండువానివలె. వీరుడైన దశరథచక్రవర్తి ప్రవేశించిన లోకమునకు పోవుదును. మీకు పట్టాభిషేకముచేసి ఆనందానుభవమును పొందగోరి అట్లు పొందలేకపోయిన చక్రవర్తి ప్రవేశించిన స్వర్గమందు ప్రవేశింపతగుదును. భరతావాను కోరికప్రకారము ఇది పెద్ద అనర్థము. [అందుచేతనే "వీరలోకభాక్ మాభూవం" - వీరులు ప్రవేశించు వీరస్వర్గమును నేను పోగొట్టుకొనుదును అని అర్థమును చెప్పుట తప్పింపబడినది.] ఈశ్లోకమునందు చూపినవిధముగ లక్ష్మణస్వామివలె నిర్బంధించి దాస్యము చేయుటలో పట్టుబట్టక, శేషి ఆనందించు దాస్యము చేయుట అనెడి పారతంత్ర్యమును అనుష్ఠించినాడు శ్రీభరతాళ్వాను. ముందే చెప్పిన ప్రకారము రాముని వదలియుండలేని తనస్థితిని గణింపక(లెక్కజేయక) శేషియైన రామునికోరికను గమనించి సంతోషముతో ఊరికి తిరిగి వెళ్ళినవాడాయెను గదా శ్రీభరతాళ్వాను!

ఇట్లున్న భరతావానుతప్ప ఇతరలను తెలుసుకొననివారగుటచే ఎంబెరుమానునకు దాస్యము చేయుటలోని చివరిపర్వములోయున్న వారి దాసులకు దాస్యము చేయుటను అనుష్ఠించినారు శ్రీశత్రుఘ్నాళ్వాను.

గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః।
శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నో నీతః ప్రీతిపురస్కృతః।। (రా.అ.కాం.1-1)

[పాపములు లేనివాడును, నిత్యశత్రువునైన ఇంద్రియములను జయించినవాడును, ప్రీతిచేత ముందుకు నెట్టబడినవాడును అయిన శత్రుఘ్నుడు మేనమామగారియింటికి వెళ్ళుచున్న భరతునిచే తీసుకొనిపోబడినాడు] అని శ్రీరామాయణశ్లోకము ఈభాగవతదాస్యమును చూపుటచే అట్టి భాగవతదాస్యస్వరూపము వివరింపబడుచున్నది.

**గచ్ఛతా:-** (మేనమామగారింటికి) వెళ్ళుచున్న భరతునిచే. వెళ్ళుచున్న అని వర్తమాన కాలమునకు, తనకుగా వేఱొక ప్రత్యేకప్రయోజనములేనప్పటికిని, శత్రుఘ్నాళ్వాను భరతుని వెనుక వెళ్ళునపుడు అయోధ్యలోనుండు తల్లిదండ్రులవద్దగాని, అన్నగారైన శ్రీరామునివద్దనుండిగాని అనుమతి పొందకనే భరతాళ్వానును వదలిజీవించలేనివాడగుటచే, ఆతడు వెళ్ళుచున్నపుడు ఆతనినీడవలె ఈతడుగూడ

ఆతనివెనుక వెళ్ళెను అని భావము. **మాతులకులం:-** మేనమామగారింటికి. భరతుని మేనమామ అయిన యుధాజిత్తు తనమేనల్లుడైన భరతునే పిలచెను. అందుచే అచటికి వెళ్ళవలసిన నిర్బంధము భరతునికే. శత్రుఘ్నావాను భరతుని విడచిజీవించలేనివాడగుటచే అది కారణముగా ఈతడుగూడ వెళ్ళెను అని భావము. **భరతేన:-** భరతునిచే - రాజ్యమును మోయువానిచే. దశరథచక్రవర్తి మరణించగ పెరుమాళ్ళు రాజ్యమును వదలి అడవికి వెళ్ళగ, ఇళైయపెరుమాళైన లక్ష్మణుడుగూడ రామునివెంట వారికి దాస్యము చేయవలెనని వెళ్ళగ, శత్రుఘ్నావాను కూడ భరతుని తప్ప ఇతరములు తనకవసరములేదని తలంచు స్థితిలో రాజ్యభారమును వహింపవలసివచ్చుననుకారణముచే పుట్టినపుడే వీరికి 'భరతుడు' అని వసిష్ఠమహర్షి నామకరణము చేసినారు. 'భరత ఇతి రాజ్యస్య భరణాత్'- రాజ్యమును భరించి యుండుటచే భరతుడు అనబడుచున్నాడు- (శాకుంతలమ్) అని భరతశబ్దమునకు అర్థమును శతానీకుడు చెప్పినారుగదా! **తదా: -** అపుడే. ఇరువురును రాజపుత్రులగుటచేతను,

పుష్యేజాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః।
సార్పే జాతౌచ సౌమిత్రీ కులీరేభ్యుదితేరవౌ।। (రా.బా.కాం. 20-13)

[స్పష్టమైన జ్ఞానముగల భరతుడు మీనలగ్నములో పుష్యమీనక్షత్రమందు జన్మించినాడు. సుమిత్రయొక్క పుత్రులైన లక్ష్మణశత్రుఘ్నులు కటకలగ్నములో ఆశ్లేషానక్షత్రమందు జన్మించిరి] అనిన ప్రకారము వారి జన్మనక్షత్రములు వేరువేరగుటచే, వారివారి జన్మనక్షత్రములకు తగినట్లుగ వేరువేరు దినములందు ముహూర్తములందు బయలుదేరవలసియున్నను, భరతుడు బయలుదేరిన ఆముహూర్తము నందే శత్రుఘ్నుడుగూడ బయలుదేరెను అని ఉద్దేశము. 'గచ్ఛతా' అను పదమునందే ఏకకాలమునందు బయలుదేరిన విషయము స్పష్టముగదా! 'తదా' అని మరియొకసారి ఎందుకు చెప్పవలసివచ్చినది? అనినచో అచట తనకు అనెడిది ఏఒకటియును లేకపోవుట అనెడి మమకారరాహిత్యమును చెప్పుట అయినది. అందుచేతనే పునరుక్తి(చెప్పినదే చెప్పుట)దోషము లేదు. దాస్యవృత్తికి అహంకారమమకారములు రెండే ఆటంకములుగదా!

**అనఘః:-** పాపము లేనివాడు. 'అహమ్' అనెడిది తాను కోరుకొనినదానిని పొందుటకు ఆటంకమైయుండు పాపమును చెప్పును. ఇచట పాపము అనబడునదు రామభక్తియే అగహును. అతివిశిష్టమైన రామభక్తిని పాపము అనదగునా? అనినచో లోకములో పాపము అని చెప్పబడు క్రూరమైన చేష్టకంటె పుణ్యము అని చెప్పబడు మంచికార్యము గొప్పదే అయినను,

అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం, చంద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య।
ధూత్వా శరీరమకృతంకృతాత్మా బ్రహ్మలోకమపి సంభవామీత్యపి సంభవామీతి।। (ఛాం.8-13-1)

[అశ్వము వెంట్రుకలను దులిపివేసుకొనినట్లు పాపములను వదల్చుకొని రాహుముఖమునుండి వెలువడిన చంద్రునివలె శరీరమును వదలి నిత్యమైన భగవల్లోకమును పొందినవాడయి ఉండగోరుదును.] అను ఉపనిషద్వాక్యమందు ముక్తిపొందునపుడు వదల్చుకొనిన పుణ్యపాపములు రెండింటిని చేర్చియే పాపము అని చెప్పిన విధముగ ఇచట శత్రుఘ్నుడు కోరుకొనిన భరతకైంకర్యమునకు ఆటంకమగుటచే రామభక్తిని పాపమనియే చెప్పెనుగదా!

సృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తస్సుహృజ్జనే।
రామే ప్రమాదం మాకార్షీః పుత్ర! భ్రాతరి గచ్ఛతి।। (రా.అ.కాం.40-5)

[కుమారా! నీవు వనమునందు వసించుటకే సృష్టింపబడినావు. నీకు సుహృత్తయిన రామునివద్ద మిక్కిలిప్రేమ గలవాడివైయున్నావు. నీ అన్నగారైన రాముడు నడచుచు పోవుచున్నపుడు (ఆనడకలోని సౌందర్యముననుభవించుచు) వాని రక్షణయందు అప్రమత్తుడవైయుండుమా!] అని సుమిత్ర రాముని సౌందర్యముననుభవించుట, రాముని రక్షణకైంకర్యమునకు ఆటంకముగ చెప్పలేదా!

అటులనే రామభక్తిని భరతకైంకర్యమునకు ఆటంకమగుటచే పాపము అని చెప్పుటలో దోషము లేదు. **శత్రుఘ్నః:-** శత్రువులను సంహరించువాడు. రాముడు మొదలైన నలుగురు దశరథకుమారులు అవతరించినపుడు వారివారి (విగ్రహములను) శరీరములను చూచి నామకరణముచేయుటకు కులగురువైన శ్రీవసిష్ఠభగవానుడు మొదటి పిల్లవానిని జూచువారందరును వాని సౌందర్యముచేత సంతోషముపొందగలుగుదురని వానిపేరు రాముడనియు, చిన్నవానికి కైంకర్యమే ప్రత్యేకతగా తోచుటచే కైంకర్యలక్ష్మి గలవాడని లక్ష్మణుడు(లక్ష్మిసంపన్నః) అనియు, నాలుగవపిల్లవానిని చూచినంతమాత్రముచే శత్రువులు నశించునట్లుండుటచే 'శత్రుఘ్నుడు' (ఎదుటవారిని నశింపజేయు వాడు) అనియు పేరులు పెట్టిరి. **నిత్యశత్రుఘ్నః:-** నిత్యశత్రువులను కూడ నశింపజేయువాడు. బాహ్యశత్రువులను మాత్రమేగాక శరీరమందలి అంతశ్శత్రువులైన ఇంద్రియములను కూడ జయించినట్టివాడు అని భావము. ఆఇంద్రియజయము ఎంతవరకు వీనియందు కలదు అనినచో, 'రూపౌదార్యగుణైః పుంసాం దృష్టిచిత్తాపహారిణమ్' - విగ్రహసౌందర్యము, నడక, గుణములు మొదలైనవాటిచే పురుషులనేత్రములను మనస్సును రాముడు అపహరించును- అని పురుషులను సహితము స్త్రీలవలె మోహింపచేయునట్టి రామునిసౌందర్యమునకు వశపడు ఇంద్రియములను తన అధీనములోనుంచుకొనినవాడు అనునట్లుగ ఇంద్రియములను జయించినాడు.

జగ్రాహ భరతో రశ్మీన్ శత్రుఘ్న శ్ఛత్రమాదధే।
లక్ష్మణో వ్యజనం తస్యమూర్ధ్ని సంపర్యవీజయత్।। (రా.యు.కాం.131-28)

[రామప్రభువుయొక్క రథమునకు పూన్చిన గుఱ్ఱముల కళ్ళెములను భరతుడు పట్టుకొనెను. శత్రుఘ్నుడు రామునకు గొడుగు పట్టెను. ఆరామప్రభువుయొక్క శిరస్సును లక్ష్మణుడు విసనకర్రతో వీచుచుండెను.] అని పట్టాభిషేకసమయమందు శత్రుఘ్నుడు రామునికి ఛత్రకైంకర్యమును చేయుట అనినచో ఆవిధముగ రామకైంకర్యము చేయునపుడు 'తాను కోరినది'అను భావనతోగాని లేక రామసౌందర్యమునకు వశపడిగాని చేయక, 'భరతునికి ఇష్టమైనది' అనెడి భావనతోనే శత్రుఘ్నుడు రామకైంకర్యమును చేసినాడు అనియే భావము. నీతః:- తీసుకుపోబడినాడు. రాజులు బైటకు వెళ్ళునపుడు చురకత్తివంటిఆయుధమును తమతో తీసుకొనిపోవునట్లు భరతునిచేత తీసుకుపోబడినాడు అని అర్థము. రెండు ద్రవ్యములు ఒకదానితోనొకటి చేర్చినపుడు వాటిని ఒకదానినుండుమరియొకటి విడదీయుటకుగూడ అవకాశముండును. కాని ఒకద్రవ్యము దాని జాతి, గుణములతో చేర్చియుండినపుడు జాతి,గుణములను ఆద్రవ్యమునుండి వేరుగా విడదీయుటకు వీలుగాదు. అదేవిధముగ భరతుడును, శత్రుఘ్నుడును రెండు వేరువేరు ద్రవ్యములైనను, భరతుని జాతి, గుణములవలె శత్రుఘ్నుడు వానిని విడచి వేరుజేయుటకు వీలుగానంతగ భరతుని చేత తీసుకొనిపోబడెను అని ఇచ్చట భావము. **ప్రీతిపురస్కృతః:- ప్రేమతో ముందుకు నెట్టబడినవాడు.** అన్నగారైన భరతుని కైంకర్యము చేయుట మన కర్తవ్యము అని అదియొక విధిగ భావించి శత్రుఘ్నుడు వెళ్ళలేదు.

భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే।
అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చతే।। (రా.అ.కాం.31-25)

[మీరు వైదేహితోగూడ కొండలయందు, లోయలయందును తిరుగాడుచుండుడు. దాసుడనగు నేను మీరు

లేచియున్నప్పుడును, పరుండియున్నప్పుడునుకూడ మీకు అన్నిసేవలను చేయుదును.] అని రామునితో అడవికి కలసిపోయిన లక్ష్మణునివలె, 'పోవుస్థలమందు భరతునకు అన్ని కైంకర్యములను, సేవలను చేయుదును' అనెడి మనోరథముతో ప్రేమతో ముందుకు నెట్టబడిపోయినాడు అని ఇచ్చట అర్థము. అయోధ్యలోనుండునపుడు భరతునకు కైంకర్యము చేయుటకు ఎంతోమంది సేవకులు ఉండుటచేత శత్రుఘ్నునకు భరతకైంకర్యమునందు ఒకభాగమే లభించును. అట్లు కాకుండ అన్ని కైంకర్యములను చేయగలను అని భావించివెళ్ళెను అనియే ఇచ్చట తీసుకొనవలెను.

తీసుకొనబడి వెళ్ళినాడు అనుటచే, దాస్యము చేయునపుడు తనకై వేరే ఒకఆనందములేక భరతుని ఆనందమే తన ఆనందముగ భావించి, అచేతనవస్తువువలె వెళ్ళినాడు అని అర్థము ఇచ్చట చెప్పబడినది. "ప్రీతిపురస్కృతః" అనుటచేత స్వరూపానుగుణముగ భరతకైంకర్యము చేయుటలో తనకు అని ప్రత్యేకముగ ఒక ఆనందము లేకపోయినను, జ్ఞానము కలవాడుగుటచే భరతుని ఆనందము చూచుటచే కలిగెడియానందమే ఈతనికి యుండును అని చూపబడెను. "పడియాయ్ కిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే" (పెరు.తిరు. 4-9) అని కులశేఖరావారు తిరువేంగడముడైయానుకు కైంకర్యముచేయుసమయమునందు "పడియాయ్ కిడన్దు - ద్వారబంధములోని కింద గడపగా పండుకొని" అని తనకుఅని ఒక ఆనందము కాకుండ అచిత్తువలె నుండవలెననియు, "ఉన్ పవళవాయ్ కాణ్బేనే - నీయొక్క పగడమువంటి ఎఱ్ఱని నోటినే చూచుచుందును" అని తిరువేంగడముడైయాను సంతోషమునే చూచిపొందు ఆనందమే తనకు ఉన్నది అని చూపించినారుగద! "**అనఘః:-** పాపములు లేనివాడు. ఈపదమునకు రామభక్తి అనియెడి పాపము లేనివాడు అనియు, 'నిత్యశత్రుఘ్నః' అను పదమునకు రాముని సౌందర్యమునకు వశపడిపోనంతవరకు ఇంద్రియములను జయించినవాడు అనియును అర్థము తీసుకొనబడినది. అటులకాకుండ 'అనఘః' అనుపదమునకు భరతుడు రామునికంటె పరిశుద్ధుడగుటచే 'నిత్యశత్రుఘ్నః' అను పదమునకు భరతుడు రామునికంటె ప్రీతి కలిగించువాడయియుండుటచేతను, రాముని ఆశ్రయించక భరతునే ఆశ్రయించినాడని అర్థము తీసుకొనవచ్చును.

కదాన్వహం సమేష్యామి భరతేన మహాత్మనా।
శత్రుఘ్నేనచ వీరేణ త్వయాచ రఘునందన।। (రా.అ.కాం.16-40)

[రఘుకులకుమారా! మహాత్ముడైన భరతునితోడను, వీరుడైన శత్రుఘ్నునితోడను, నీతోడను నేను అని గదా జీవించియుండగలను] అనిశ్రీరామునికి శత్రుఘ్నునిపైనను ప్రీతియున్నట్లు వీనికిగూడ ఆయనపై ప్రీతియుండుటను తప్పించవీలులేనట్లుగ ఇచ్చట ఈ రెండు పదములచేతను, చెప్పవలెనా అనినచో, రామప్రభువుపై శత్రుఘ్నాళ్వానుకు ప్రేమ ఎట్లున్నది అనినచో, తను అంటూ ప్రత్యేకంగా తెలియకుండునట్లు భరతాళ్వాను తప్ప మరియొకరివిషయమందు - అనగా తనయందుగూడ - అభిరుచిలేనివాడిగ ఉండెను అనియే చెప్పవలెను. అందుచేతనే, ఈ రెండు పదములను అర్థము గలిగినవే అని ఎంబెరుమానారులు సాయించినారు. భరతాళ్వాను ఆనందించిన విషయము అనియెడి కారణముచేతనే రామునిపై శత్రుఘ్నునకు ప్రీతిగలదు అనియే తప్ప, తనంతటతానుగ శత్రుఘ్నుడు రామునిపై ప్రీతిని కలిగియున్నాడు అనిగాదు అని ఇచ్చటి భావము.

మధురకవియాళ్వారి స్థితికూడ ఇట్టిదే యగును. రామునిపై ప్రీతిలేకపోవుటకు, భరతాళ్వానుయందు గల ప్రీతియే కారణము అని నిశ్చయించినచో రామభక్తిని పాపము అనియు, రామునియందు వశపడకుండునట్లు శత్రుఘ్నుడు తన ఇంద్రియములను జయించినాడని చెప్పుటలో

అతిశయమేమియును లేదు. అందుచే ఈవిధముగ శత్రుఘ్నాళ్వాను భరతునివిషయమున వశపడుటవలెనే నమ్మాళ్వారివిషయమున శ్రీమధురకవియాళ్వారుగూడ వశపడినారు అని తెలుసుకొనవలెను.

మధురకవియాళ్వారు "తేవు మఱ్ఱఱియేన్" అని ఎంబెరుమానుని విషయములోకూడ తమకు ప్రీతిలేదు అని చెప్పునంతగ నమ్మాళ్వారివిషయములో ప్రీతి కలుగుటకు కారణము బలమైయున్నది. ఎంబెరుమానుని దాసుడు అని ఒకేకారణముచే నమ్మాళ్వారు మధురకవులను కటాక్షించినారు. వేరెవ్వరివలనను తెలుసుకొనలేని జ్ఞానమును ఇచ్చి భగవద్విషయమందు ఉన్మత్తకుడిగా చేసినారు. భగవద్భక్తులవిషయమందు ప్రీతి కలుగునట్లు చేసినారు.

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరం।
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తిచ రమంతిచ।। (భ.గీ.10-9)

[నాయందేయుండి, నాపైనే మనసునిల్పినవారయి నాయందే తమప్రాణములను యుంచినవారయి నాగుణములనే ఒకరితోనొకరు చెప్పకొనుచున్నవారై నన్నే ఎప్పుడును తలంచుచు సంతోషించుచున్నారు, ఆనందించుచున్నారు] అని చెప్పబడినట్లు ఎంబెరుమానుని భక్తులగుణములను అనుసంధించకుండా ఉండలేకపోవుస్థితిలో అట్లే అనుసంధానమును చేసికొనుచు జీవితమును వెళ్ళబుచ్చుచుందురు.

తే హ నాకం మహిమానం సచంతే యత్ర పూర్వే స్సాధ్యా స్సంతి దేవాః। (పు.సూ.)

[ఎచ్చట ఒక విశేషమైన పరమపదమందు సాధ్యులు అనబడు దేవతలు ఉన్నారో, అట్టి పరమపదమును వారు మహిమగలవారై పొందుచున్నారు.] అనునట్లుగ పరమపదమును పొందిన పిదప భగవద్భాగవతానుభవమునకు తోడుగ ఉండునట్లు ఉన్నారు. ఇట్లు అనేకవిధములుగ ఉపకారము చేయగలవారగుటచే అన్ని స్థితులలోను, అన్ని స్థలములయందును ఎంబెరుమానునితోయుండువారైన నమ్మాళ్వారులే వారి యుద్దేశ్యము అని నమ్మి తమకు ఉపకారులైన ఆళ్వారులే తమకు అన్నియు అని వారినే ఈ దివ్యప్రబంధములో ఆశ్రయించుచున్నారు.

## నఙ్జీయరువారివ్యాఖ్యానమందు అవతారికలోని విశేషములు.

చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు అను మూడు తత్త్వములతో పురుషార్థములు ఉత్తమము, మధ్యమము, అధమము అని మూడు విధములు. వాటియందు తక్కువదైనను, ప్రత్యేకస్థితిలేనిదైనను, అచిత్తుయొక్క అనుభవమైన ఐశ్వర్యము అధమపురుషార్థము. జన్మ, మరణము మొదలైన వికారములు లేనిదియు, మిక్కిలి సుఖరూపమై యున్నప్పటికిని, ఎంబెరుమానుని కల్యాణగుణములు లేకపోవుటచే (తెరివరియ అళవిల్లై చిత్తిన్బమ్ -తి.వా.మొ.4-9-10) అనిచెప్పబడు చిత్తుయొక్క అనుభవమైన ఆత్మానుభవము మధ్యమపురుషార్థము. ఈశ్వరుని అనుభవము ఉత్తమపురుషార్థమయినను, అందనను, శ్రీ వైకుంఠనాథునియెడ ప్రీతిలేక కృష్ణావతారములోనే ప్రీతియుండి దానియందును చెరుకుగడ తినువారు దాని వేరును, చిగురును వదలి మధ్యనున్న గడనే స్వీకరించువిధముగ కంసుని చెరలో అవతరించిన మొదటిభాగమును, కంసవధతరువాత వచ్చు భాగమును వదలి మధ్యభాగమైన వెన్న దొంగిలింతను చూచి, యశోదాపిరాట్టి చేతులలో కట్టబడి ఆమెకు భయపడి, నలుచునియున్న స్థితిలోయున్న కృష్ణుడే ఉపాయము, ఉపేయము, విరోధినిరసనము చేయువాడును, ఇంకను, ధారకపోషకభోగ్యములును అని, వాటితోనే ఆగక ఆయన సౌందర్యము, గుణము మొదలైనవాటియందు అభినివేశము గలిగిన శ్రీవైష్ణవులే ఈ ఆత్మకు స్వాములుగను, పరమపురుషార్థముగను యున్నవారు అని నమ్మాళ్వారులు 'పయిలుమ్ శుడరొళి

-(తి.వా.మొ. 3-7), నెడుమాఱ్కడిమై (తి.వా.మొ.8-10) మొదలైన సందర్భములలో నిర్ణయించినారు.

భరతాళ్వానుకు గల రామభక్తిని దాటి, శ్రీశత్రుఘ్నాళ్వాను భరతునిపై ప్రీతితోయున్న విధముగనే శ్రీ మధురకవియాళ్వారు ఎంబెరుమానుని విషయమందును, శ్రీవైష్ణవులయందును, ఆవారుకుగల అభినివేశమునంతటిని ఆళ్వారుల శ్రీపాదములయందే అయి, దానినే కోరి, దానినే చెప్పి, అనుభవించినారు ఈ కణ్ణినుణ్ శిఱుత్తామ్బు గ్రంథంలో.

## అగియమణవాళపెరుమాళ్ నాయనార్ వారి వ్యాఖ్యానమునందులి అవతారికలోని విశేషములు.

ఎంబెరుమానునివిషయములో అభినివేశము గలిగి, వాని గొప్పతనమునుతెలియని సంసారులు గూడ తెలుసుకొనుటకు వీలుగ ఆయాపురాణములలో ఉపదేశించిన పరాశరులు మొదలగు ఋషులకు సంసారిజీవులకంటెను విశిష్టత గలదు. అయినను, ఋషులు

తదస్యత్రివిధస్యాపి దుఃఖజాతస్యవై మమ। గర్భజన్మజరాద్యేషు స్థానేషు ప్రభవిష్యతః।।

నిరస్తాతిశయాహ్లాదసుఖభావైకలక్షణా। భేషజం భగవత్ప్రాప్తిరేకాంతాత్యంతికీ మతా।।

(వి.పు.6-5-58,59)

[గర్భము, జననము, ముసలితనము మొదలగు అవస్థలయందు తిరుగడు నాయొక్క మూడువిధములైన (ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక) దుఃఖసమూహమునకు తనకంటె గొప్పది మరియొకటి లేని ఆనందరూపమైన సుఖమైయున్నదియే లక్షణముగగలదియును, దుఃఖము దరిచేరనిదియును, అనంతమైనదియును, అగు భగవత్ప్రాప్తియే మందుగా తలచబడుచున్నది] అని ఎంబెరుమానుని పొందుటయే పరమపురుషార్థముగను,

తస్మాత్ తత్ప్రాప్తయే యత్నః కర్తవ్యః పండితైర్నరః।

తత్ప్రాప్తిహేతుః జ్ఞానంచకర్మచోక్తం మహామునే।। (వి.పు. 6-5-60)

[మహామునివరా! ఇదివరకు చెప్పిన కారణముచేతనే ఆభగవానుని పొందు జ్ఞానులైన మనుజులచే ప్రయత్నము చేయబడవలెను. ఆయనను పొందుటకు జ్ఞానము, కర్మము ఉపాయములుగా చెప్పబడుచున్నవి] అని భగవానుని పొందుటకు ఉపాసనమును సాధనముగ ఉపదేశించగ లభించునది ప్రేమ అనియు, ఇతరపురుషార్థములను కలసిన చక్కెరగడ్డగను ఉపదేశించినారు.

అట్టి ఋషులకంటె ఎంబెరుమానుని కటాక్షముచేత అజ్ఞానగంధరహితమైన జ్ఞానమును కటాక్షముగ పొందిన ఆళ్వారులకు గలవిశిష్టత :-

1. ఎంబెరుమానునిపొందుట అను పరమపురుషార్థమునే తమప్రబంధములలో ప్రథమకర్తవ్యముగా అన్ని సందర్భములలోను ఉపదేశించినారు.

2. దానికి సాధనముగూడ ఆయనశ్రీపాదములే అని ఉపదేశించినారు. నమ్మాళ్వారు ఆవిధముగ ఉపదేశించుటతో ఆగక "వழுవిలా వడిమై శెయ్య వేణ్డుమ్ నామ్ - విచ్ఛేదములేకుండ కైంకర్యము మేము చేయవలెను" (తి.వా.మొ.3-3-1), "అడిక్కీழமర్న్దు పుగున్దేనే - శ్రీపాదములక్రింద అమరిచేరియుంటిని" (తి.వా.మొ. 6-10-10) అని తాము వాటిని అనుష్ఠించుచు పొయినారు. ఇతర ఆళ్వారులకంటెను వీరికి గల ప్రత్యేకత అదియే.

ఈవిధముగ సర్వేశ్వరుడే పురుషార్థము, సాధనముగూడ అయినాడు అని యుపదేశించి, అనుష్ఠించిన నమ్మాళ్వారులకంటె ఆయాళ్వారే పురుషార్థమనియు, వారిని పొందుటకు వారి శ్రీపాదములే సాధనమనియు ఉన్న శ్రీమధురకవియాళ్వారులు మిక్కిలి విశిష్టత గలవారు. ఆళ్వారు, ప్రథమపర్వమయిన భగవద్విషయమందు ఉన్నవారు. వారు శ్రీమదష్టాక్షరియొక్క సూక్ష్మరూపమైన ప్రణవమందుగల ఏవకారార్థమైన ఉకారములోనున్నవారు. వీరు, దాని వివరణమైన నమశ్శబ్దార్థమందున్నవారు. భగవన్నిష్ఠులైన ఆళ్వారులకంటెను, ఆచార్యనిష్ఠ యయిన పెరియాళ్వారులపుత్రిక అయిన ఆణ్డాళ్ ను అనుసరించినవారు వీరు. శ్రీరామాయణపురుషులయందు భరతుడే అన్నియు అని తలంచిన శత్రుఘ్నాళ్వానును, మనపూర్వాచార్యులలో నాథమునులే అన్నియు అని స్వీకరించిన ఆళవందారువలెను ఉన్నవారు వీరు. ఎంబెరుమానుని గుణములు ఆళ్వారులమాటలచే విశదీకరింపబడినట్లు ఆళ్వారులగుణములు కూడ వీరిమాటలచే విశదీకరింపబడినవి. వేదమువలె అనంతమయియుండక వేయిపాశురములలో ఇమిడిన తిరువాయ్ మొళ్ళివలె కాక పదేపది పాశురములలో పరమసారమును చెప్పునది వీరి దివ్యప్రబంధము. వీరి ప్రబంధము తిరువాయ్ మొళ్ళియొక్క సారము.

మాతృదేవోభవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథి దేవో భవ। (తై.శిక్షా. 11-2) [అఖిలజగన్మాతయైన పిరాట్టిమారులను, నాశములేని తండ్రియైనఅచ్యుతునియును, (తెలియనివాటిని తెలియపరచిన ఆచార్యునియును, ఇష్టులైన పెద్దలయిన వైష్ణవులను దైవముగ స్వీకరించుము] అని చెప్పు ఉపనిషద్వాక్యప్రకారము ప్రీతియైన, తల్లియైన పెరియపిరాట్టిమారులను, హితుడైన తండ్రి ఎంబెరుమానునునియు ఆశ్రయించినవారు ఆవారులు. ఆముగ్గురి గొప్పతనమును తెలియజేయు ఆచార్యుని ఆశ్రయించినవారు వీరు. సర్వేశ్వరుని ఆరాధించుట తెలివిగల జ్ఞానులు చేయునది యగుటచే సర్వేశ్వరుని విషయముగ నమ్మావారు నాలుగు ప్రబంధములను సాయించినారు. ఆచార్యుని ఆరాధించుట సుఖమైనదగుటచే (తేలికైనదగుటచే) ఈప్రబంధమందు వీరు పదే పాశురములను అనుగ్రహించినారు.

*****కణ్ణినుణ్ శిఱుత్తామ్బు అవతారిక సమాప్తము.*****

**కణ్ణినుణ్ శిఱుత్తామ్బు - మొదటి పాశురము.**

**1.** **కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్ కట్టుణ్ణ**
**ప్పణ్ణియపెరుమాయన్ ఎన్నప్పనిల్**
**నణ్ణి త్తెన్ కురుగూర్ నమ్బిఎన్ఱక్కాల్**
**అణ్ణిక్కుమ్ అముదూఱుమ్ ఎన్నావుక్కే.**

ప్రతిపదార్థము:- కణ్ణి-- (శరీరమందు నొక్కునట్లు అనేక) ముడులుగలదై, నుణ్-- (శరీరమందు నొక్కు పడునట్లు) సన్నని, శిఱు-- (పొడవుగాకాక) చిన్నదిగాయున్న, తామ్బినాల్-- త్రాటిచేత, కట్టుణ్ణప్పణ్ణియ-- యశోదాపిరాట్టి తనను కట్టునటుల చేసినట్టి, పెరుమాయన్-- గొప్ప ఆశ్చర్యకరమైన శక్తిగలవాడైన, ఎన్ అప్పనిల్-- నాకు స్వామియైన సర్వేశ్వరుని విడచి, నణ్ణి--(ఆళ్వారులను) చేరి-ఆశ్రయించి, తెన్ కురుగూర్ నమ్బి ఎన్ఱక్కాల్-- దక్షిణదిశయందున్న (ఆళ్వార్ తిరునగరి యనబడు) కురుగూరికి నిర్వాహకులైన ఆళ్వారు అని (వారి తిరునామమును) చెప్పినచో, అణ్ణిక్కుమ్-- మిక్కిలి ప్రీతికరమయినట్టియు, ఎన్ నావుక్కే-- నాయొక్కని నాలుకకే, అముదు ఊఱుమ్-- అమృతము ఊరును.

**అవతారిక:-** మొదటిపాశురములో ఆళ్వారులయొక్క సాటిలేని ప్రత్యేకత చెప్పబడుచున్నది. పొందవలసిన ప్రాప్యముయొక్క చివరిపర్వమైన ఆళ్వారును ఆశ్రయించిన వీరు ప్రాప్యముయొక్క ప్రథమస్థానమైన భగవద్విషయమును ఈపాశురమందు పాడుటకు కారణమేమి అనినచో భగవద్విషయముకంటెను నమ్మాళ్వారుల ప్రత్యేకత తోచుటకును, మనకు విశేషమైన భగవద్విషయమును వాడినట్లయినచో ఆళ్వారులముఖము వికసించుటచేతను, ఈ పాశురమందు మొదటగా భగవంతుని విషయమును చెప్పుచున్నారు. అందుగూడ 'ఉరలినోడు ఇణైన్దిరుస్దు ఏజ్గియ ఎళివు ఎత్తిరమ్! - రోకలితో చేర్చబడి వెక్కుచున్న సౌలభ్యము, ఏమాశ్చర్యము!' (తి.వా.మొ.1-3-1) అనియును, 'పిఱస్ద వాఱుమ్, వళర్స్ద వాఱుమ్ - జన్మించినవిధము, పెరిగిన విధము' (తి.వా.మొ.5-10-1) అనియును, 'నెయ్యుణ్ వార్తైయుళ్ అన్నై కోల్ కొళ్ళ నీ ఉన్ తామరై క్కణ్గళ్ నీర్ మల్గ పైయవే నిలైయుమ్ - నేతిని తిని నాడనిన మాటవచ్చినపుడు తల్లియైన యశోద కఱ్ఱనెత్తగ, నీనేత్రపద్మములలో నీరు కారునట్లు భయపడిన స్థితిని' (తి.వా.మొ.5-10-3) అనియును ఆళ్వారులు అభినివేశముతో నున్న కృష్ణావతారమునందు యశోదచే కట్టబడిన సన్నివేశమును చెప్పుచున్నారు.

**వ్యాఖ్యానము:-** (**కణ్ణినుణ్ శిఱుత్తాంబినాల్**) ముడులు గలదియు, సన్ననిదియు, **చిన్నది** (పొట్టిది)యును అయిన త్రాటిచేత. ఆళ్వారులకు చాలఇష్టమైన కృష్ణుని కట్టిన ఒక త్రాటివిశేషములన్నింటిని వెదకి కనుగొనినట్లు వీరికి ఆళ్వారుల విషయమందు అభినివేశము కలిగినది. కృష్ణుడు తాడుచేతకట్టబడుటను తలంచుకొని ఆళ్వారులు ఆరుమాసములు స్పృహకోల్పోయియుండుటచే ఆసన్నివేశమును చెప్పుచున్నారు. ఎంబెరుమానునివిషయములో ఇతరచేష్టలలో వీరికి అంతగా అభినివేశము కలుగలేదు. ఆళ్వారులనే తమకు ప్రాప్య, ప్రాపకములుగ స్వీకరించినవారగుటచే వారు స్పృహతప్పిన సంఘటననే చెప్పుచున్నారు. **కణ్ణిత్తాంబు**- ముడులుగల తాటితో కట్టినపుడు శరీరమునందు నొక్కుకొనుటను చూచి ఇట్టి ముడులుగల త్రాటితో కట్టబడి బాధపడుచున్నాడే అనుకారణముచే ఆళ్వారులు స్పృహ తప్పినారుగద! **కణ్ణి**- ముడి. **నుణ్ తాంబు:-** శరీరమందు అచ్చుపడునట్లుగ సన్ననిది అయియుండుట. ఇది కూడ ఆళ్వారులు స్పృహతప్పుటకు కారణము. **శిఱుత్తాంబు:-** కృష్ణునికట్టినపిదప రోటితో చేర్చి కట్టుటకు పొడవు సరిపోకపోవుటచే లాగి కట్టవలసి వచ్చుటచే శ్రీకృష్ణుని శరీరము నొప్పిపెట్టునే అనిగదా ఆళ్వారులు మూర్ఛిల్లినారు! **కట్టుణ్ణప్పణ్ణియ:-** రోలు అచేతనము. దానిని చిన్నదిగ చేయుట కుదరదు. యశోదాపిరాట్టి చేతిలోయున్న తాడు చిన్నదగుటచే దానిని పొడవైనదానినిగ చేయుట కుదరదు. ఇక వీనిని చేతిపట్టునుండి వదలి పొడవైన త్రాటిని వెదకితెచ్చుటకు వెళ్ళినచో మరి వాడు పట్టుకు దొరకడు. 'కాఱ్ఱాల్ కడియనాయ్ ఓడి అగమ్ పుక్కు - గాలికంటెను వేగముగ పరుగుపెట్టిపోయి, ఇంటిలో ప్రవేశించు' (పెరి.తి. 2-10-1) అనునట్లుగ కృష్ణుడు పారిపోవును. ఇక ఏమి చేయుట? అని యశోద తల్లడిల్లుటను చూచి, ఆమెయందు జాలిగలిగి తన శరీరమును చిన్నదిగ చేసి- కడుపును అక్కళించి- ఆమె తనను కట్టుటకు వీలుగా చేసిన సౌలభ్యమందు ఆళ్వారులు అభినివేశమునందుట సహజమే గద! **కట్టుణ్ణప్పణ్ణియ:-**

అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే।
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే॥ (వి.పు. 1-2-1)

[అచేతనమువలె కాక వికారము చెందనివాడుగను ముక్తాత్మలవలెకాక నిత్యశుద్ధుడుగను,

నిత్యసూరులవలెగాక తనకంటె పైన మరియొకరులేనట్టి సాటిలేనివాడును, ఎల్లప్పుడును ఒకే విధముగ యుండు దివ్యమంగళవిగ్రహమును కలిగినవాడును, సర్వవ్యాపిగ అన్నింటిని జయించినవాడుగను ఉన్న భగవానునకు (నమస్కారము)] అని శ్రీవిష్ణుపురాణములో పరాశరమహర్షి అనుసంధించినట్లుగ ఎల్లవేళలయందును ఒకేవిధముగనుండు తిరుమేనిని సూక్ష్మముగ చేసి (అక్కళించుకొని) యశోద తనను కట్టునట్లుగ చేసినవాడుగద! ఈ విధముగ కృష్ణుడు తన దివ్యదేహమును చిన్నదిగచేసికొని ఆయన తనను కట్టుటకు అవకాశమివ్వకపోయిన, ఈ చిన్నత్రాడిచేత వానిని కట్టుటకు వీలుకాలేదే అని ఆమె వీనిని వదలివేయును. అపుడు వీనికి యశోదచే కట్టబడినవాడు అను (సౌలభ్య) గుణము లేకపోవును. ఈసౌలభ్యగుణమును ప్రకాశింపజేయుటకుగదా ఈయన అవతరించినాడు! అందుచేతనే తనశరీరమును చిన్నదిగచేసి కట్టుటకు అవకాశమునిచ్చినాడు. 'కణ్ణియార్ కుఱుం కయిఱ్ఱాల్ కట్ట వెట్టెణ్ణిరున్దాన్- ముడులుతో నిండినదియు, చిన్నదియును అయిన త్రాటిచే కట్టబడినాడని యుండినాడు' (పె.తి.5-6-7) అనియును, 'కణ్ణిక్కుఱుమ్ కయిఱ్ఱాల్ కట్టున్డాన్- ముడులుగల పొట్టిత్రాటితో కట్టబడినాడు' (పె.తి.11-5-5) అనియును ఇతర ఆవారులు ఈడుపడుట ఇట్టి చేష్టలవల్లనే గదా!

దామ్నా చైవ ఉదరే బధ్వా ప్రత్యబధ్నాత్ ఉలూఖలే।
కృష్ణమక్లిష్టకర్మాణమాహ చేదమమర్షితా।।
యది శక్నోషి గచ్ఛ త్వమతిచంచలచేష్టిత।
ఇత్యుక్త్వా థ నిజం కర్మసా చకార కుటుమ్బినీ।। (వి.పు.5-6-15,16)

[ఒకతాడుని తీసుకొని ఒక కొసతో కృష్ణుని ఉదరమందును, ఇంకొక కొసతో రోటిని కట్టినది యశోద. ఈవిధముగ కట్టివేసి, చంచలమైన చేష్టితములుచేయువాడా, ఇక నీకు చేతనైతే వెళ్ళు, అని కుటుంబీకురాలైన యామె తన ఇంటిపనిని చేసుకొనెను.] అనువిధముగ తల్లికట్టిన కట్టును తనచే విప్పుకొనుటకు వీలులేదు అనియుండుటయే గొప్పతనముగ తలంచినవాడుగదా ఈయన!

ప్రధానక్షేత్రజ్ఞపతిర్గుణేశః। సంసారమోక్షస్థితి బంధహేతుః।। (శ్వే. 6-16)

[ప్రకృతికిని జీవునికిని స్వామియై, గుణములు పరిపూర్ణముగ గలవాడును, సంసారము విడుటుతకును, నిలచియుండుటకును, సంసారముచే బంధింపబడుటకును, కారణమైనవాడు పరమాత్మయే] అని చెప్పిన విధముగ సంసారిజీవులను సంసారబంధముచే కట్టుటకును, దానినుండి విడిపించుటకును కారణమైనవాడు ఈయనేగదా! అటువంటివాడు ఇపుడు ఒక స్త్రీకట్టిన కట్టును విడిపించుకొనుటకు అవకాశము లేనివాడుగ ఉన్నాడు. లోకములన్నింటిని నియమనము చేయు చక్రవర్తి తనపట్టమహిషికి లొంగియేయుండి, ఆమెచేతిలోని పూలమాలచే కట్టబడి దానిని తనంతటతాను విడిపించుకొనకనే యుండునట్లు తల్లిగయున్న యశోద కట్టిన కట్టునుండి విడిపించుకొనలేనిది ఈయన స్థితి. జీవులకు కర్మకారణముగ వచ్చు సంసారబంధమును తాను తప్పించుటయే తప్ప తనకటాక్షముచే తల్లి కట్టిన కట్టునుండి, విడిపించుకొనుటకు ఈయనచేత వీలుగాదుగదా!

ప్రబంధప్రారంభమునందు వీరు సంతోషించిన ఆళ్వారు "ఉయర్ నలముడైయవన్" - ఉన్నతమైన ఆనందము గలవాడు- (తి.వా.మొ.1-1-1) అని ఎంబెరుమానుని గుణములయందు అభినివేశము కలిగినట్లుగాక, కృష్ణుని కట్టిన త్రాటిని వర్ణించుటకు కారణమేమి? అనినచో, ఆళ్వారులు ఎంబెరుమానునివలన 'మదినలమ్' (జ్ఞానముచే కటాక్షింపబడినవారగుటచే "ఉయర్వఱ ఉయర్ నలమ్

ఉడైయవన్" (తి.వా.మొ.1-1-1) అని ఆయన గుణమును వర్ణించినారు. వీరు తిన్నగా ఆళ్వారునే ఆశ్రయించుటచే తాము కోరిన ఆళ్వారుకు ఎంబెరుమానునికంటెను ఉన్న గొప్పతనమును తెలియజేయుటకు ఆయన తిరుమేనిని కట్టిన ఒక త్రాటిని వర్ణించినారు. ఆళ్వారుకు ఉద్దేశ్యమైన ఆయనను, వీరు అసారము అని వదలివేసినారు.

కృష్ణావతారములో ఎంబెరుమానుని వశపరచుకొనుట, గొల్లపల్లెయందున్న స్త్రీలను దొంగతనముగా చూచినాడు, వెన్నను దొంగిలించినాడు, గొల్లపల్లెలో ఎన్నో అల్లరిపనులు చేసినాడు అని వీని చేష్టితములను చెప్పి దండనచేయించినను, అది ఆయనకు భోగ్యముగనే యున్నది. ఈ విషయమును "వీడు సామాన్యుడని ఇవ్వగలిగిన అవకాశములన్నింటిని ఈయుడు అనియున్నాడు" అని పెరియవాచ్చాన్ పిళ్ళై సాయించినారు. ఈసందర్భమునందు అరుంబదవ్యాఖ్యానములోనున్న ఒక ఐతిహ్యాము ఇచట చెప్పుకొనతగినది. పూర్వకాలమందు చోళదేశమందు చోళ్ళియరులుఅను ఒక పేరుపొందిన పూర్వశిఖశ్రీవైష్ణవులే తమకుటుంబములతో నివసించుచుయుండిరి. దివ్యదేశములు వారినిర్వాహకత్వములోనే యుండెను. తరువాతికాలమందు వడమలు మొదలైన అపరశిఖశ్రీవైష్ణవులు తమతమకుటుంబములతో నివసించుటతో కొవెలల నిర్వాహకత్వమునందు అధికారములేకపోవుటచే సామాన్యులుగా పిలువబడుచుండు వారు కొవెలనిర్వాహకత్వమును ఆక్రమించుటకు ప్రారంభించినారు. అప్పుడు పూర్వకాలమునుండి తెజ్గళైదేవాలయములుగనుండువాటి హక్కుదారీలను వడగలైవారు ఆక్రమింపప్రారంబిచినపుడు, తెజ్గళై, వడగళై కొట్లాటలు ఏర్పడినట్లుగ సామాన్యులైన అపరశిఖ(తెజ్గళై)శ్రీవైష్ణవులు ఆక్రమింపప్రారంభింపగ ఆకాలమందు అచ్చటచ్చట చోళ్ళియరులు, సామాన్యుల కొట్లాటలు ప్రారంభమైనవి. అళగర్ తిరుమలయందు అటుల సామాన్యులు ఆక్రమించప్రారంభించగ కోవిలనిర్వాహకులైన చోళ్ళియరులు అందరూ సామాన్యులను చూచినవెంటనే కొట్టవలెనని అని నిశ్చయించియుండగ వారున్నస్థలమునకు చోళ్ళియరులలో ఒకరు రాగా, వానిని ఎవరో తెలుసుకొనకుండగనే మిగత చోళ్ళియరులు కొట్టగ, ఆతడు నేను చోళ్ళియరులలోనివాడను, నన్నెందుకు కొట్టుచున్నారు అని ప్రశ్నించగ, విగతవారు నిన్ను సామాన్యునిగ తలచి కొట్టినాము అని బదులు చెప్పిరి. దానికి ఆ చోళ్ళియను, ఆవిధముగ సామాన్యుడని తలంచినను, కొట్టవలసినదే, మరి రెండు దెబ్బలు వేయుడు అని దెబ్బలు తినినందుకు తనకు కలిగిన బాధనుకూడ లెక్కచేయక కొట్లాటను మనసునందుంచుకొని చెప్పెను. అటులనే, అల్లరిపనులు చేసి గొల్లపల్లెలో దెబ్బలు తినుట కొరుకొని కృష్ణుడు అచట అవతరించినాడు గనుక, అల్లరిచేయకపోయినపుడుగూడ అల్లరిచేసినట్లుగ చెప్పి కొట్టినను, అట్టి దండనము తనకు భోగ్యముగనే తలంచెనని భావము. కృష్ణుడు అల్లరి పనులు చేసి వాటియందు నిష్ణాతుడైయుండెనని దీనినుండి తెలియుచున్నది. ఆయన అల్లరి చేసినాడని తనను కట్టి కొట్టుట మొదలు పెట్టగనే, 'తొళ్ళుగైయుమ్, ఇవైకణ్ణ యశోదై తొల్లైయిన్ పత్తు ఇఱుది కణ్డాళే - పరమపదమందు అందరును తనను ప్రార్థించ, ఇచట తనుప్రార్థించుట మొదలైనవాటిని చేయుటను ప్రత్యక్షముగ తనకంటితో చూచి అనుభవించిన యశోద మహదానందపుటెల్లలను చూచినది' (పెరు.తి-7-8) అనినట్లుగ యశోదను ప్రార్థించినాడు. వేఱొకమార్గములేక తనకార్యము నెరవేర్చుకొనుటకు అంజలియే సాధనమని ఇతరచేతనుల అనుష్ఠానమునుండి తెలిసికొనినవాడుగదా ఈయన! ఈవిధముగ ఈయన విలపించుట, ప్రార్థించుటను చెప్పుటయినది. **అతిచంచల చేష్టిత:-** క్షణక్షణము మారుచున్న చంచలమైన చేష్టలు చేయువాడా! తురుతురుమని ఎన్నో అల్లరిపనులు చేసి నందగోకులమందు బాగుగ అల్లరి పనులు చేసినవాడివిగదా నీవు!

**ఇత్యుక్త్వా:-** అని చెప్పి. రోటికి కట్టి చేతతోనేగాక ఈమాటచెప్పి వచనములచేగూడ స్వామి తప్పిపోవుటకు వీలుగాకుండ యశోద (భక్తుడు) బంధించినది. **అథ నిజం కర్మ సా చకార:-** తరువాత పశువులను పాలు పితుకుట, పెరుగు చిలుకుట మొదలగు తనపనులను చేయనారంభించినది **కుటుమ్బినీ:-** వీనివలె నియమించవలసిన అనేకులుగల ఒక కుటుంబమునకు పెద్దగదా ఈమె.

ఇన్నిభావములుగల ఈ విష్ణుపురాణశ్లోకమును తలంచుకొని "కట్టుణ్ణప్పణ్ణియ" అనినారు మధురకవులు.

**పెరుమాయన్:-** సాటిలేని ఆశ్చర్యకరమైన చేష్టితములు గలవాడు. "మాయా"శబ్దము ఆశ్చర్యమును చెప్పు మాటయని భాష్యకారులచే నిరూపించబడినదిగద! ఈవిధముగ సాటిలేని ఆశ్చర్యచేష్టితములు గలవాడు ఇచ్చట పెరుమాయన్ అని చెప్పబడుచున్నాడు. ఈ పదముచేత 'అన్ని కోరికలు నెరవేరిన పరమాత్మకు గూడ ఒకటి తక్కువయి, ఆకొరతను తీర్చుకొనుటకు లోకములోనున్న దొంగలవలె దొంగతనమనెడి పనులలో ప్రవేశించి అన్నింటిని కొల్లగొట్టి, ఆదొంగతనమును పూర్తిచేయుట కుదరక చేతులు దాచపెట్టబడి, కట్టబడి, దెబ్బలు తిని,

'నెయ్యుణ్ వార్తైయుళ్ అన్నై కోల్ కొళ్ళ నీ ఉన్ తామరై క్కణ్ణళ్ నీర్ మల్గ పైయవే నిలైయుమ్ - నేతిని తినినాడనిన మాటవచ్చినపుడు తల్లియైన యశోద కఱ్ఱనెత్తగ, నీనేత్రపద్మములలో నీరు కారునట్లు భయపడిన స్థితిని' (తి.వా.మొ.5-10-3) అని నమ్మాళ్వారులు సాయించినవిధముగ కృష్ణుడు కడుపును అక్కళించిన సన్నివేశమును తలంచినారు వీరు. **ఎన్నప్పనిల్ నణ్ణి:-** కృష్ణుని విడచి, ఆవారులవద్దకు చేరి. సంసారులు శబ్దస్పర్శరూపరసగంధములనబడు ప్రాకృతవిషయములను వదలి, ఎంబెరుమానుని చేరుట ఎంత శ్రమకరమైనదో అంత శ్రమకరమైనది పురుషార్థములలోని ప్రారంభదశయైన ఎంబెరుమానుని విడచి, దాని చివరిహద్దయిన వాని దాసులకు దాసులగుట. శబ్దాదులైన ప్రాకృతవిషయములు అల్పమయి, అస్థిరమయియుండుటను ప్రత్యక్షముగ చూచినచో వాటిని వదలుటకు ఆటంకము తొలగును. భగవద్విషయమును వదలుటకు ఆవిషయమందు అట్టి దోషములు లేకపోవుటచే దానిని విడచి, భాగవతకైంకర్యమును చేయుట చాలకష్టసాధ్యముగద!

**తెన్ కురుగూర్ నమ్బి:-** 'నల్గి ఎన్నై విడాన్ నంబినంబి- ఆదరించి నన్ను తనవానినిగా చేసుకొని, విడువడు పూర్ణుడైన శ్రియఃపతి' (తి.వా.మొ.1-10-8) అని ఆళ్వారులచే ఆశ్రయింపబడిన నంబి-పరిపూర్ణులైన-ఎంబెరుమాను కంటెను వీరాశ్రయించిన ఆవారు ఎక్కువపూర్తి గలిగినవారు అని చూపుచున్నారు. ఎటులననగా, ఆఎంబెరుమానుని ఆశ్రయించినచో అది ఎల్లయిన ఆళ్వారువరకును వచ్చిననే అది పూర్తి కలిగినదగును. అట్టిఆళ్వారునే ఆశ్రయించినచో (అదియే చివరి హద్దగుటచే) దానిని దాటి పోవలసిన అవసరమే లేదుగద! ఇదియే నమ్మాళ్వారులు ఆశ్రయించిన పూర్ణులకంటె కురుగూర్ నిర్వాహకులైన నమ్మాళ్వారుకుగల విశిష్టతను చూపుచున్నది. "మన ఆచార్యులను తిరుక్కచ్చినంబి, మణక్కాల్ నంబి, పెరియనంబి, తిరుక్కోట్టియూర్ నంబి, తిరుమలై నంబి అని అందరకును నంబి అను పదముచేత విశిష్టతను కలిగించినారు శ్రీమధురకవియాళ్వారేగదా!" అని నంజీయరువారు సాయించినారు. **ఎన్హక్కాల్:-** అని నోరార చెప్పుటచేతనే. ఎంబెరుమానుని విషయమందు ప్రీతిగల మనసు, వాక్కు, శరీరము అనబడు త్రికరణములచేతను, అభినివేశము కలిగియుండుట అవసరమైయుండును. నమ్మాళ్వారివిషయమందు నోటితో ఒక్కమాట చెప్పిన చాలును. నంబి అని చెప్పబడిన పూర్తిచేత కలిగిన గొప్పతనము మాత్రమే గాదు, భగవద్విషయము కంటెను, సుఖమగుటచేత కలిగిన గొప్పతనముగూడ ఉండును అని భావము.

**అణ్ణిక్కుమ్:-** మధురమగును. ఎంబెరుమానుని త్రికరణముగ అనుభవించుటచే నమ్మాళ్వారుకు కలుగు ఆనందము అంతయు, వారివిషయమందు ఒక్కమాటను చెప్పుటచేతనే నాకు లభించుచున్నది. **అముదూఱుమ్:-** అమృతము ఊరును. ఊరును అని భవిష్యత్కాలమును ఉపయోగించుటచే అమృతము విచ్ఛేదము లేకుండ యూరుచుండును అని చూపుచున్నది.

సఖల్వేవం వర్తయన్ యావదాయుషం బ్రహ్మలోకమభిసంపద్యతే।

నచ పునరావర్తతే। నచపునరావర్తతే।। (ఛాం.ఉ.1-15-1)

[ఆముముక్షువైనవాడు తన ఆయుర్దాయము ముగియునంతవరకు ఈవిధముగ సుఖముగయండుచు వర్ధిల్లును. ఆతరువాత, బ్రహ్మలోకమును పొందును. తిరిగివచ్చుట యనునది మరిలేదు.] అని చెప్పినవిధముగ నమ్మాళ్వారుకు ఎంబెరుమానుని కటాక్షముచే మోక్షము లభించునపుడు నిత్యమైన ఆనందము లభించును. నాకు వారి కటాక్షముచే ఇచటనుండినస్థితికిని ఆచటనుండు స్థితికిని భేదములేక అప్పటికప్పుడే, నా (ఎంత అనుభవించినను) తృప్తితీరని అమృతము ఇచటనే లభించినది అనుచున్నారు. **ఎన్ నావుక్కే:-** నానాలుకకే ఈ యానందము లభించును. 'ఇటువంటి ఆనందము మాకు లేదే' అని సంసారుల అభిప్రాయముగ తలంచి ప్రథమపర్వమైన ఎంబెరుమానుని విషయమందే అభినివేశము లేకయుండు మీకు, దాని చరమపర్వమైన ఆళ్వారివిషయమందు అభినివేశముగలిగిన నేను పొందు మహదానందము, దొరకునా? అనుచున్నారు. **ఎన్నావుక్కే: -** అనాదికాలముగ శబ్దాదివిషయములను అనుభవించుచున్న నా నాలుకకు ఇప్పుడు ఆళ్వారులను అనుభవించుట ఈవిధముగ లభించుచున్నదియని భావముగ ఇచటయర్థమును తీసుకొనవలెను.

## మొదటిపాశురమునకు ఇతరవ్యాఖ్యానములయందలి విశేషములు.

### నంజీయరువారి వ్యాఖ్యానము.

**కణ్ణినుణ్ శిఱుత్తాంబు:-** ఆడబిడ్డయైన యశోద కట్టిన త్రాడగుటచే, అనేక ముడులుగలదై శ్రీకృష్ణుని శరీరమును నొక్కునదై గట్టిగా పట్టుకొనునదియైయుండుటచేతను, పుష్పముకంటెను సుకుమారమైన చేతులుగల వీనిచేత అది విప్పుటకు వీలుగాకపోవుటచేతను, ఆయనశరీరము బాధపడుచున్నదే అని భయపడుచున్నారు. **కట్టుణ్ణప్పణ్ణియ:-** రాజైనవాడు తనశత్రువులను జయించి, శిక్షించును. అట్టివాడుగూడ తనప్రియురాలైన భార్యచేతికి లొంగియేయుండుట ఆతనిమగతనముతోగూడిన రసికత్వమును చూపునట్లుగ, ఈయనగూడ తనశత్రువును కట్టివేయుట ఆయన పరత్వమును చూపుచు అదే సమయమందు ఆయనదాసులకు(భక్తులకు) లొంగిపోవుట ఆయన సౌలభ్యగుణమును చూపుచున్నది. **పెరుమాయన్:-** నమ్మాళ్వారు ఎంబెరుమానునివిషయమందు ఎంత ఆశ్చర్యమని ఆయన సౌలభ్య గుణములో మునిగిపోయినట్లు వీరుగూడ అందే అభినివేశమును కలిగియుండుచున్నారు. ఆయనయొక్క ఆశ్చర్యకరచేష్టితములు ఎట్టివనగా:-

1. అప్రాకృతదివ్యదేహమును ప్రాకృతదేహమువలె చేయుట,
2. ఆకలియేలేని ఆయనకు ఆకలిబాధను కలిగించుట,
3. వెన్నను తినుటయందు కోరిక గలుగుట,
4. దానిని ఇచ్చువారు లేనపుడు దొంగతనమును చేయుట,
5. అట్టి దొంగతనమునుగూడ పూర్తిచేయలేక దొంగతనముగ ప్రకటితమగుట,
6. తనచేత కట్టబడవలసినవారిచేతనే తను కట్టుబడుట.

7. ఇక్కట్టును అనుసంధించు ఇతరులకు వారిసంసారబంధమునుండి విడిపించదగిన వాడు, అట్టి ఇక్కట్టునుండి తాను విడిపించుకొనలేకపోవుట.

ఇటువంటి చేష్టలను చూచి, ఇదియేమి ఆశ్చర్యము అనుచున్నారు. వీరియొక్క పరత్వమును చూడవచ్చునుగాని, సౌలభ్యపుఅడుగుహద్దును చూడవీలుకాదు.

**ఎన్నప్పనిల్:-** ఆళ్వారే వీరికి ఉద్దేశ్యులైయుండగ ఎంబెరుమానుని నా తండ్రీ అని చెప్పడం సబబేనా అంటే, ఆళ్వారుగురించి చెప్పేటప్పుడు ఎంబెరుమానునిగూర్చికూడా చెప్పకోవలసివచ్చునుగదా! ఉద్దేశ్యమైన ఒకస్థలమునకు పోవుచున్నప్పుడు ఆదారిలో చల్లగ నీటివసతి కలిగియున్న విశ్రాంతిస్థానము చక్కనిది యున్నను, దానిని కొంతసమయము ఉపయోగించుకొని గమ్యము చేరుటకు తిరిగి ప్రయాణము చేయుదుముగాని, ఆవిశ్రాంతిస్థానము చాలబాగున్నదని అచటనే యుండిపోముగదా! **నణ్ణి:-** ఈ బోనువంటి గోతిని దాటినచోగద ఆళ్వారును పొందుట అంటున్నారు. ఎంబెరుమానుని బోనుతో పోల్చదగునా అంటే, ఆయనను పొందుటకు శబ్దాదివిషయములు ఎట్లు ఆటంకములగుచున్నవో, అటులనే ఆళ్వారులను ఆశ్రయించిన వీరికి ఎంబెరుమానుడు ఆటంకమే అని ఇచట భావము. శబ్దాదివిషయములు అల్పములు, అస్థిరములు అయియుండుట మొదలైన దోషములు గలదవి అయియుండుటచే వదలివేయవలెను. భగవంతుని విషయము హేయప్రత్యనీకమగుటచే విడచుట చాలకష్టము. ఇదియే పెద్ద ఆటంకముగ మధురకవులకు భాసించుచున్నది. **తెన్ కురుగూర్ నంబి:-** ఎంబెరుమానుని ప్రాప్యత ప్రథమపర్వమగుటచే దానికి అపూర్ణత చెప్పి, ఆళ్వారే చరమపర్వముగ యుండుటచే వారినే పూర్ణులుగ చెప్పుచున్నారు. **అణ్ణిక్కుమ్ అముదూఱుమ్:-** రుచికరమైన వస్తువులు నాలుకపైనుంచిన అవి కరిగిపోయిన వెంటనే, ఆరుచిగూడ పోవును. ఇచట అటులగాక, ఒకసారి ఆళ్వారినిగూర్చి నాలుకతో ఉచ్చరించినచో, అన్ని కాలములందును, అమృతము ఊరుట విచ్ఛేదము లేకుండ జరుగుచునేయుండును.

## అగియమణవాళప్పెరుమాళ్ నాయనార్ వారి వ్యాఖ్యానమందున్న విశేషములు.

**కణ్ణినుణ్ శిఱుత్తాంబినాల్:-** మంచితాళ్ళు దూడలను, పశువులను కట్టుటకు ఉపయోగపడియుండునట్లు దేనికిని ఉపయోగింపవీలులేక, చాలచోట్లు తెగిపోయి, ఒకటిగా చేయుటకు ఎన్నో ముక్కలను ముడులువేసి ఒకటిగా తయారుచేయబడిన త్రాటితో కృష్ణుని యశోద కట్టినది. స్వాపదేశము:- వేఱొకరిని కట్టినట్లుగా ఈతనిని కట్టవీలుగాదు. సంగము, కామము, అనురాగము మొదలైనవిగల అనన్యభక్తి అనబడు త్రాటిచేతనే ఈతనిని కట్టుటకు వీలగును అని భావము. ఇట్లే వీనిని కట్టిన రోలుగూడ 'పొత్త ఉరలై కవిళ్త్తు - కట్టిన రోటిని తిరగవేసి', 'అదన్ మేలేఱి - దానిపైనెక్కి' (పెరియా.తిరు.1-10-7) అన్నట్లుగా క్రిందిభాగము పాడయిపోయిన రోలు, వేరొకదానికి దేనికిని పనికిరానిదై వీనిని కట్టుటకే పనికివచ్చినదైయుండును. **కట్టుణ్ణప్పణ్ణియ:-** ఇతరములైనదానికి దేనికిని ఉపయోగింపవీలుగాకుండు మెత్తనిదైయున్నప్పటికిని, వక్షస్థలమందున్న ఆమెను, ఆయనను చేర్చి ఒకేరోటికి కట్టగా రోటికిని తనకును రోటికిని తనకును భేదము తెలియకుండ పరుండినాడు. కాని వీనికి జ్ఞానముండుటచే, దుఃఖముతో నిండిపోయి, భయమయి, ఏడ్చుటకు ఆరంభించినాడు. ఈసౌలభ్యతనుజూచియే నమ్మాళ్వారులు స్పృహను కోల్పోయినారు. అట్టి ఆవారులవిషయములో వీరు (మధురకవులు) మునిగిపోయినారు. అభినివేశమును కలిగి తలమునకలైనారు. **కణ్ణి, నుణ్, శిఱుత్తాంబు** అను మూడు విశేషణములను స్వాపదేశమందు జ్ఞానము, భక్తి, వైరాగ్యము

మొదలైన మూడింటిని చూపుతున్నవి. అందుచేతనే, వాటిని శ్లాఘించుటవలె ఈత్రాటిని ప్రశంసించుచున్నారు. రుచి, సంగము, భక్తి, పరభక్తి, పరజ్ఞానము, పరమభక్తి అని భక్తి అనేకస్థితులను కలిగియుండునట్లే ఈసన్నని తాడుగూడ అనేక ముడులను కలిగియున్నది. ఆయన భక్తిచేత కట్టబడువాడగుటచే, ఈత్రాటిచే కట్టబడినాడు. స్వయంప్రయోజనభక్తియైనది ఎంబెరుమానుడే ప్రాప్యము, ప్రాపకము అనుజ్ఞానముచేత కలుగుచున్నది. అందుచేతనే, అది సూక్ష్మబుద్ధి అయినది. 'నుణ్ తామ్బు'అనెడి పదము స్వాపదేశమున ఈసూక్ష్మబుద్ధిని తెలియచేయుచున్నది.

భక్తియున్నను, ఆయన తానే తనను అమర్చుకొని ఇచ్చుటచే చేతనునిచే ఆయనను పొందుట సాధ్యమగును. ఈవిషయము

నాయమాత్మా ప్రవచనేన లభ్యో, నమేధయా, నచ బహునా శ్రుతేన।

యమేవైష వృణుతే, తేనలభ్యః తస్యైషా ఆత్మా వివృణుతే స్వామ్।।(కఠో.1-2-23)

[ఈ పరమాత్మ భక్తిలేని శ్రవణముచేతను, మననముచేతను, ధ్యానముచేతను, పొందుటకు వీలుకానివాడు. ఎవనిని తనవద్దకు చేర్చుకొనవలెనని సంకల్పించునో అట్టివానికే ఈపరమాత్మ తన దివ్యస్వరూపమును ప్రకటింపజేయును] అను ఉపనిషద్వాక్యములో చెప్పబడుచున్నది. **'కట్టుణ్ణప్పణ్ణియ'** అని ఆఅర్థమును ఇచట చెప్పుచున్నారు. "ఎట్టినోడు ఇరండెనుమ్ కయిఱ్ఱినాలే మనందనై క్కట్టి" (తిరుచ్చన్ద 83) అను పాశురములో ఎనిమిదియు, రెండును పదియై భక్తిని చెప్పుచున్నది అని పెరియవాచ్చాన్ పిళ్ళై తమ తిరుచ్చన్దవిరుత్తవ్యాఖ్యానమందు కటాక్షించినారు. ఎనిమిదియనగా తిరువష్టాక్షరియును, రెండుయనగా ద్వయముగను గ్రహించి ఈరెంటియందు ఒకమంత్రముచేత వీనిని వశీకరింప వీలగును అనెడి అర్థమును ఇచట అழగియమణవాళప్పెరుమాళ్ నాయనార్ చూపుచున్నారు. **పెరుమాయన్:-** "తొడువేశెయ్ దు ఇళవాయ్ చ్చియర్ కణ్ణినుళ్ విడవేశెయ్ దు విழிక్కుమ్ పిరానైయే - కపటచేష్టితములను చేసి గొల్లయువతులతో కనుసంజ్ఞలలో వ్యవహారములు చేసి కటాక్షించు ఉపకారకుని" (తి.వా.మొ.1-7-5) అని చెప్పినట్లుగా స్త్రీలందరును సమూహముగా వచ్చుటకు వెన్నమొదలగువాటిని దొంగిలించుట అనెడి సాధనమును ఈతడనుష్ఠించగ, దానిని చూచుటకు వయసులోనున్న స్త్రీలందరును రాగా, వారిని తనచూపులతో వశముచేసికొనినట్టి ఆశ్చర్యమును చూపి, 'పెరుమాయన్' అన్నారు. "తొழுగైయుమ్ - పూజించునట్టి"(పెరు.తిరు.8-8) అని కోపము తెచ్చుకొనిన తనను దాసులు - కైంకర్యపరులు - వశపరచుకొనుటకు అంజలియే సాధనము అని తెలియజేయువాడు యశోదకోపమును సహించుటకు ఆఅంజలినే ఉపయోగించినాడు అని ఆశ్చర్యమును చూపుచున్నది. "తొழైయిన్ పత్తు ఇఱుది కణ్డాళే - పరమపదమందు అందరును తనను ప్రార్థించ, ఇచట తనుప్రార్థించుట మొదలైనవాటిని చేయుటను ప్రత్యక్షముగ తనకంటితో చూచి అనుభవించిన యశోద మహదానందపుటెల్లలను చూచినది' (పెరు.తి-7-8) అనినట్లుగ నిత్యలకును, ముక్తులకును లభించని ఆనందమును యశోదకు ఇచ్చినట్టి ఆశ్చర్యచేష్టితమును చెప్పుటయని భావము. నిత్యులు, ముక్తులు స్వామియొక్క జ్ఞానము, శక్తి మొదలగు గొప్ప కల్యాణగుణములను చూచి యనుభవించినారు. యశోద ఈయన తనకు లొంగిపోవుట, భయముతోకూడిన చూపులతో చూచుట, తన అందమైన చిన్నినోటిని వంపుజేయుట, తనను పూజించుట వంటి సౌలభ్యమును చూపు చేష్టలను అన్నింటిని చూచినదగుటచేత ఈమనె చూచినదే పరమపదపుటంచైన ఆనందమగునుగదా!

**ఎన్నప్పనిల్:-** నా తండ్రియైన కృష్ణుని వదలి, ఆవారునే ఆశ్రయించి. ఎంబెరుమానుని విశిష్టత ఎట్టిదనగా,

శబ్దాదివిషయములందు అభినివేశమును పోగొట్టి, పెరుమాళ్లవిషయమందు ప్రీతిగా మార్చును. ఆవారులవిశిష్టత మాత్రము ఎంబెరుమానుని విషయమందుగల ప్రీతినిమరపించి, దానినే వారియందు ప్రీతిగా మార్చును. అందువలన, ఆవారుల విశిష్టతయే ప్రశంసనీయమైనదని భావము. **తెన్ కురుగూర్ నమ్బి యెన్టక్కాల్ అణ్ణిక్కుమ్:-** కురుంగుడినంబికంటె కురుగూరునంబికిగల విశేషతను ప్రకాశింపచేయబడుచున్నది. ఆయనకు పూర్తి జ్ఞానశక్త్యాది గుణములవలననే. వీరికి పూర్తి జ్ఞానభక్త్యాదులవలనను. ప్రపంచమును తనదిగా చేసికొనుగుణములు వానికి గలవు. ఎంబెరుమానునే తనకుగా మార్చుకొనునట్టి గుణములు వీరికి గలవు. **అణ్ణిక్కుమ్ అముదూఱుమ్ ఎన్నావుక్కే:-** మొదటిపదము 'తలంచినమనసు మాధుర్యమునునుభవించినదై' అని చెప్పుచున్నది. చెప్పిన నాలుకయు, అట్టిమాధుర్యమును అనుభవించినదే అని చెప్పుచున్నది రెండవపదము. **ఎన్టక్కాల్ అముదూఱుమ్:-** చెప్పుట ఒకతూరి. ప్రీతినందుట అన్నిసమయములందును. ఇక భగవానుని తలంచుటకు మనసే లేదు, చెప్పుటకు నాలుకయే లేదు. **ఎన్నావుక్కే:- మీయందరివలెనే** భగవానుని విషయమున రసానుభవముపొందిన ఆళ్వారుల విషయమందు రసానుభూతిని పొందినది నానాలుక! ప్రారంభమునుండియు, ఆళ్వారులవిషయమందు ప్రీతితో పండిపోయిన నాలుకగదా! **ఎన్నావుక్కే: -** ఆళ్వారులవిషయమందు ఉన్మత్తకమైన నానాలుకకు, ఇతరేంద్రియములకును, వాటితోబాటు నాకును, ఇతరవిషయములందు ఆసక్తి లేదు. వారు భగవంతుని విషయమందు "ఎన్ నెఞ్జినాల్ నోక్కి కాణీర్ - నా మనసు దృష్టితో చూడండి." (తి.వా.మొ.5-5-2) అనినారు. అటులనే వీరు ఆళ్వారులవిషయమందు 'ఎన్నావుక్కే' అనినారు.

మొదటి పాశురవ్యాఖ్యానము పూర్తి అయినది.

2. **నావినాల్ నవిఱ్ఱు ఇన్పమెయ్ దినాన్**
**మేవినేన్ అవన్ పొన్నడి మెయ్ మ్మైయే**
**తేవు మఱ్ఱఱియేన్ కురుగూర్ నమ్బి**
**పావినిన్ ఇన్నిశై పాడిత్తిరివనే।।**

**ప్రతిపదార్థము:- నావినాల్ నవిఱ్ఱు:-** నోటితో కురుగూరునంబియొక్క తిరునామమును చెప్పి, **ఇన్పమ్ ఎయ్ దినేన్:-** గొప్ప ఆనందమును పొందితిని. **అవన్ పొన్నడి:-** ఆళ్వారుల స్పృహణీయమైన శ్రీపాదములను, **మెయ్ మ్మైయే మేవినేన్:-** ఈజన్మమందు, వచ్చెడిజన్మలయందును, ఉద్దేశ్యముగ స్వీకరించుచున్నాను **తేవు మఱియేన్:-** (ప్రాప్యము, ప్రాపకము అయియుండు) ఇతరమైన దైవమును మరియొకదానిని తెలుసుకొనను. **కురుగూర్ నంబి పావిన్ ఇన్నిశై:-** ఆళ్వారులపాటలలోని చక్కని సంగీతమును **పాడిత్తిరివనే:-** ప్రీతితోపాడి, అదియే ధారకముగ జీవింతును.

**అవతారిక:-**మొదటి పాశురమందు ఆళ్వారులనినచో తమకు ప్రీతి అని చెప్పినారు. ఈపాశురమందు వారియొక్క పాశురములను పాడుటయే తమజీవనమంతటికిని ప్రాణాధారముగ ఉండుటను చెప్పుచున్నారు. **వ్యాఖ్యానము:- నావినాల్ నవిత్తు ఇన్పమ్ ఎయ్ దినేన్:-** నోటితో కురుగూర్ నంబియొక్క తిరునామమును చెప్పి, మహదానందమును పొందితిని. "తెన్ కురుగూర్ నంబి ఎన్టక్కాల్ అణ్ణిక్కుమ్" అని వెనుకటి పాశురములో చెప్పినదానినే, భక్తి ఎక్కువగుటచే మరల చెప్పుచున్నారు. 'నావినాల్ నవిత్తు' అనుచున్నారు.

మనస్సుపెట్టి చెప్పకుండ కేవలము నాలుకతో(నోటితో) చెప్పినంతమాత్రముచే మహదానందము లభించుటచే తిరిగితిరిగి చెప్పుటను మానలేకపోవుచున్నారు. ఎంబెరుమానుని గురించి తెలియజేసి ఉపకారముచేయు ఆచార్యుని స్తుతించుటకే ఏర్పాటైన నాలుకతో అట్టి ఫలమును పొందితిని అనియును అర్థము ఇచట గ్రాహ్యము.

ప్రత్యక్షే గురవః స్తుత్యాః పరోక్షే మిత్రబాంధవాః।

కార్యాన్తే దాసభృత్యాశ్చ నకదాచన పుత్రకాః।।

[ఆచార్యులు ప్రత్యక్షముగ స్తుతింపతగినవారు. స్నేహితులును, బాంధవులును పరోక్షముగ స్తుతించదగినవారు. వారువారుచేయవలసిన కార్యము ముగిసినపిదప మనకు దాసులును, పనివారును ప్రశంసింపదగినవారు.మనసంతానము ఒకసారిగూడ మనచే స్తుతింపబడగూడదు] అని చెప్పినప్రకారము, ఆచార్యుని ప్రత్యక్షముగ స్తుతించవలెను అనునది మనవిధిగదా! ఎంబెరుమానుడు నాలుకను సృష్టించుట ఆచార్యుని స్తుతించుటకే. ఆఫలమును పొందినవాడను నేనొక్కడనే అనుచున్నారు. **ఇన్బమ్ ఎయ్ దినేన్:- "వీవిల్ ఇన్బమ్ మిగ ఎల్లై నిగళ్థ్న్ దనన్ మేవియే-** ఆశ్రయించి, అంతములేని ఆనందపుచివరిహద్దును చేరియున్నాను" (తి.వా.మొ.4-5-3) అని ఆళ్వారు ఎంబెరుమానుని చేరి, పొందిన మహదానందమును నేను ఆళ్వారిని పొందినంతలోనే పొందితిని అనియనుచున్నారు. "శిన్దైయాలుమ్, శెయ్ గైయాలుమ్ తేవపిరానైయే తన్దై,తాయెన్ఱడైన్ద వణ్ కురుగూర్ చడగోపన్ - మనస్సుచేతను, వాక్కుచేతను, క్రియచేతను దేవతలకు ఉపకారకునియే తల్లి, తండ్రి అని స్వీకరించిన  సుందరమైన కురుగూరునిర్వాహకులైన శఠకోపులు" (తి.వా.మొ.6-5-11) అని త్రికరణములచేతను ఎంబెరుమానుని చేరి ఆళ్వారుపొందిన మహానందమును మాటఒక్కదానిచేతనే ఆళ్వారుగురించి చెప్పుటద్వారా పొందితిని అని అంటున్నారు. నాలుకతో ఎన్నో పాపములను చేయుటచేత ఆపాపములను అనుభవించుటకు ప్రారంభించి, నరకమందు పుట్టుటయు, నశించుటయుఅనుభవించవలసియుండగ, సామాన్యముగ పాపములను చేసియుండు అట్టి నాలుకతోనే, అంతములేని ఆనందమును పొందుటను చూచి ఆశ్చర్యమును కలిగించునదిగా చెప్పుచున్నది అనిగూడ గ్రహించవలెను. **మేవినేన్ అవన్ పొన్నడి:-** బంగారువలె ఆశించదగిన స్పృహణీయమైన ఆవారుల శ్రీపాదములను ఉద్దేశ్యముగ భావించి వాటిని ఆదరించుచున్నారు.

తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్।

క్షిపామి అజస్రమశుభానాసురీష్వేవయోనిషు।। (భ.గీ.16-19)

[నన్ను ద్వేషించువారును, క్రూరులును, పాపులును అగు ఈ నరాధములను జన్మజరామరణాదులతో పరిభ్రమించు సంసారములో అదియును, అసురయోనులందే ఎల్లప్పుడును త్రోసివేతును] అని చెప్పినట్లుగ స్వాభావికమైన బంధువైన ఎంబెరుమానుడుకూడ నన్ను విడచుదశలో నన్ను స్వీకరించిన ఆవారి అతివిశిష్టమైన శ్రీపాదములతోచేరికను పొందితిని. ఎంబెరుమానుని (పొందుటకు) ఉపకరించు వాడు అని ఆవారుని ఆశ్రయించివారైనను, పురుషార్థముగా ఎంబెరుమానునే ప్రార్థించుదురుగదా అనినచో, **మెయ్ మ్మైయే మేవినేన్:-** ఎంబెరుమానుని ఉపకారకుడుగా ప్రార్థించి, ఆవారిని ఆశ్రయించి ఎంబెరుమానుడు లభించగనే వానినే ఉద్దేశ్యముగ గ్రహించుటకాక, ఈజన్మయందును, తరువాతి జన్మలు- ఈ రెంటి.ందును కూడ ఆవారులశ్రీపాదద్వంద్వమును ఉద్దేశ్యముగ గ్రహించి సత్తగలవానినిగ అయినాను. ఇచ్చటనుండురోజులలో ఎంబెరుమానుని ఆశ్రయించియు, వారిదాసులనాశ్రయించియు, తెలియని విషయములను తెలియజేయుటచే ఉపకరించువారనియు, పరమపదమందు ఎంబెరుమానుని పొందుటకు

పురుషకారముగను, అవతారికలో చూపిన ప్రమాణైన 'తేహనాకం మహిమాన స్సచన్తే స్సాధ్యాస్సన్తి దేవాః' అనెడి పురుషసూక్తవాక్యప్రకారము, పరమపదమందు పొందదగిన ప్రాప్యముగ ఆవారినే ఆశ్రయించితిని.

తస్మై నమో మధుజిదంఘ్రిసరోజతత్త్వ జ్ఞానానురాగమహిమాతిశయాంతసీమ్నే।

నాథాయనాథమునయేత్ర పరత్రచాపి నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్।। (స్తో.ర.2)

[ఈలోకమందును, పైలోకమందును, ఎల్లకాలములందును, ఏశ్రీమన్నాధమునులశ్రీపాదములు నాకు ఉపాయమైనస్థలమో, మధువనురాక్షసుని నిరసించిన ఎంబెరుమానుని శ్రీపాదకమలములను ఆశ్రయించిన తత్త్వజ్ఞానము గలదియు, అనురాగముకలదియు, గొప్పమహిమయొక్కఅంతమే హద్దుగాగలవారును, నాకు నాధులుగాయుండినట్టి ఆనాధమునులకు నమస్కారము] అని ఆళవందారు నాధమునులనే పరమపదమునందుకూడ తమకు ప్రాప్యముగ ఆశ్రయించుటకు కారణము శ్రీమధురకవులే అయినారు. **తేవుమఱ్ఱఱియేన్:-** ప్రాప్యము, ప్రాపకము అయినమరియొక దైవముండునని నేను అనుకొనలేను. "అవన్ పొన్నడి మెయ్ మ్మైయే మేవినేన్" అనునప్పుడు ఆళ్వారే ప్రాప్యము, ప్రాపకము అను అర్థమును అన్వయించుటచే చెప్పినారు. ఇచ్చట 'తేవుమఱ్ఱఱియేన్' అని వేరు ప్రాప్యప్రాపకములు లేకపోవుటచే తమనిశ్చయమును ప్రకాశింపజేయుటకు వ్యతిరేకప్రయోగమును చేసినారు. 'మఱ్ఱు అఱియేన్' అనుటచేత ఇతరవిషయములవలె ఎంబెరుమానునిగూడనేను ప్రాప్యప్రాపకములుగ గ్రహించలేదు అని తప్పించినారుగదా! భగవంతుని విషయములో చివరిపర్వమైన ఆళ్వారులశ్రీపాదములవరకు అభినివేశము పొందినవారగుటచే ఈవిధముగ చెప్పుచున్నారు. "శాస్త్రములు ఎంబెరుమానుని ప్రాప్యప్రాపకములుగ చెప్పినవి. ఆచార్యుల ఉపదేశములును అటులనే యున్నవి. అట్లుండగ, వీరు ఈవిధముగ భగవంతుని విషయమును అట్లు తప్పించుటయా?" అనినచో "ఎంబెరుమానుడే ప్రాప్యము, ప్రాపకము" అనియు, విశేషార్థమును కటాక్షించినవారైన ఆళ్వారుల శ్రీపాదములయందే అభినివేశముచేత చెప్పుచుండుటచే ఏమియును దోషము లేదు. **కురుగూర్ నమ్బి:-** కురుంగుడి నంబి పరిపూర్ణత కంటెను కురుగూరునంబి పూర్తి విశేషమైనదియగుటచే వీరిని ఆశ్రయించి, వారినిగూడ ఆశ్రయించవలసిన అవసరము లేదు అని భావము. తిరువాయ్ మొళ్లి అని పేరుపెట్టి చెప్పిన "కురుగూర్ నంబిపా" అనుటచే ఆళ్వారులు తనవాక్కుద్వారా కటాక్షించినది అను విశేషముచేతనే తిరువాయ్ మొళ్లినిగూడ వీరు ఆదరించినారు అని ప్రకాశమగుచున్నది. తిరువాయ్ మొళ్లిలోగూడ "కురుగూర్ చడగోపన్ శొల్" (తి.వా.మొ.1-1-11) అనియే ఆళ్వారులు కటాక్షించినారు. ఆప్రకారమే వీరుగూడ తిరువాయ్ మొళ్లిని ఆదరించినారు. "ఎన్ మున్ శొల్లుమ్ - నాకంటె ముందుగ చెప్పినవాడు" (తి.వా.మొ.7-9-2), "తన్నై త్తానేత్తుదిత్తు - తనని తానే స్తుతించుకొని" (తి.వా.మొ. 10-7-2) అని తిరువాయ్ మొళ్లి ని ఎంబెరుమానుడే చెప్పినదిగా తోచునపుడు 'కురుగూర్ నంబిపా" అని దానిని చెప్పుట కొంత అస్వారస్యమునుండుటచే, అర్థమును మరియొకవిధముగ చెప్పబడినది. అనగా కురుగూర్ నంబియైన ఆళ్వారులగురించి చెప్పినట్టి కణ్ణినుణ్ శిఱుత్తామ్బునే కురుగూర్ నంబిపాటయని చెప్పునదిగా గ్రహించుటయైనది. **పావిన్ ఇన్నిశై:-** పాటతోపాటు కలసియున్న మధురమైన సంగీతము. **పాడిత్తిరివనే:-** మీతోపాటు జీవించువిధము ఎట్లు నడచుచున్నది? అను ప్రశ్నవేయగా "కురుగూర్ నంబి పాటలలోని మధురమైన సంగీతమును సంతోషముతో చెప్పి, దానివలననే ప్రాణములను ధరించియుండి తిరుగుచున్నాను" అన్నారు. "ఉణ్డు, తిరివన్ - తిని తిరుగుట" వలెనే 'పాడిత్తిరివన్' అంటున్నారు. తిరివనే అను ఏకవచనముచేత 'నమన్ తమర్ తలైగళ్ మీదే నావలిట్టు ఉదరుగిన్టోమ్ - యముడును, వాని దూతల, తలలపై పాదములను మోపి తిరుగుచున్నాము' (తిరుమాలై-1) అనునట్లు ఇదియే జీవించుపద్ధతిగా

వీరికియున్నది. నాయొక్క సంచారమును అడ్డువారెవరైన ఉందురా అని ప్రశ్నించినట్లు అర్థమును ఇచట తీసుకొనవలెను. పూర్వపాపఫలమును అనుభవింపజేయు యముడు నాయొక్క ఈజీవనవిధానమును అడ్డుకొనుటకు వీలగునా? ఈపూర్వపాపములకును కారణమైన ఇతరవిషయములే దీనిని ఆటంకపరచుట సాధ్యమా? అని భావము.

**కణ్ణినుణ్ శిరుత్తామ్బు రెండవపాశురమునకు పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానము ముగిసెను.**

**నంజీయరువారి వ్యాఖ్యానవిశేషములు.**

**అవతారిక:-** ఎంబెరుమానుని ప్రత్యేకవిశిష్టతను పరమపదమునకు పోయి అప్రాకృతశరీరమును పొంది తెలుసుకొనవలసినదియే. ఆళ్వారులవిశిష్టత వారిశ్రీసూక్తులను ఇచ్చటనే అనుభవించవీలుగాయున్నది.

**వ్యాఖ్యానము:- ఇన్బమ్ ఎయ్ దినేన్:-** రసముయొక్క చివరిహద్దును పొందినాను. "శుళ్ళిపట్టోడుమ్ శుడర్ శోదివెళ్ళత్తు - సుడులుపట్టి ప్రవహించు తేజోమయమైన ప్రకాశముయొక్క వెల్లువ" (తి.వా.మొ.8-10-5) అని చెప్పబడిన భగవదనుభవము అరకొరగా కాదుకద వీరు పొందిన ఆవారును అనుభవించుట అను రసానుభవము. **మేవినేన్ అవన్ పొన్నడి:-** "కోలమామెన శెన్నిక్కు ఉన్కమలమన్నకురైకళ్ళల్ - నాశిరస్సుకు తామరలవలె మనోహరములైన ధ్వనించుచున్న నీ పాదములు అలంకారములగును" (తి.వా.మొ. 4-3-6) అనియును, 'తళిర్ పురైయుమ్ తిరువడి ఎన్ తలైమేలవే - చిగురువంటి లేతశ్రీపాదము నాతలమీదుగ'(తిరునెడు.1) అనుచున్న ఆళ్వారులు ఎంబెరుమానుని శ్రీపాదములతో చేరికను అనుభవించుచున్నారు. అట్టి అనుభవమంతయు, వీరికి నమ్మాళ్వారుల శ్రీపాదములే అయినవి. **మెయ్ మ్మైయే:-** "ఇమైయోర్ తలైవా మెయ్ నిన్రు కేట్టరుళాయ్ - నిత్యసూరినిర్వాహకుడా, యధార్థమైన విన్నపమును నిలచి విని కృపజేయుము' (తి.వి.1) అనినారు ఆళ్వారు. "కురుగూర్ నమ్బి పొన్నడి మేవినేన్ మెయ్ మ్మైయే" అనినారు వీరు. **తేవు మఱ్ఱఱియేన్:-** భగవద్విషయము వద్దు అనుచున్నాను అనిగాదు, వ్యుత్పత్తి లేకపోవుటచే అది ఫలానది అని తెలియలేకున్నాను అని అనుచున్నానని అర్థము. 'భావోనాన్యత్ర గచ్ఛతి' (రా. ఉత్త.కాం. 40-15) అని హనుమ రామప్రభువుగాక నామనసు మరియొకదానియందు ప్రవర్తించదు అనినట్లుగా మఱ్ఱఱియేన్ అని వీరుకూడ నామనసు ఆవారినితప్ప ఇతరములయందు ప్రవర్తించదు అనుచున్నారు. మఱ్ఱు (మఱ్ఱొన్ఱు) అనుటచే విడచినవిషయములపేరుగూడ స్మరించుటకు వీరికి ఇష్టములేదు అని చూపబడుచున్నది. **పావినిన్నిశై పాడి తిరివనే:-** ఐశ్వర్యమును అల్పము, స్థిరతలేనిదిగను అని పక్కకు నెట్టి, స్థిరమైన ఆత్మప్రాప్తి - గొప్ప ఆనందము అనుదానిని వదలి, తీసివేసి స్థిరమైనదై, మహానంద మయిన భగవత్ప్రాప్తిని ప్రాప్యములలో ప్రథమపర్వమని వదలి, దీని చివరిహద్దైన ఆళ్వారినికూడ ఉద్దేశ్యులుకారు అని వదలివేసి, వారియొక్క సంగతిగలిగిన పాటను మిక్కిలి రుచికరమైనది కాదని వదలి, ఆపాటతోకూడిన సంగీతమునే తమకు ఉద్దేశ్యముగ చెప్పుచున్నారు. **పాడిత్తిరివనే:-** ఔషధసేవజేసి తిరుగువారివలె ఇది కనపడును. వీరికి ఆళ్వారిపాటలను గానముచేయుటయే ధారకమై సంచరించుచున్నట్లు చేయుచున్నది.

**అగియపెరుమాళ నాయనారాచ్చాన్ పిళ్ళైవారి వ్యాఖ్యానమందలి విశేషములు.**

**అవతారిక:-**ఆళ్వారు కృష్ణుని సౌశీల్యగుణమునందు అభినివేశమును చెంది మోహపడినారు. వీరు అట్టి సౌశీల్యతను అనుసంధించిన పిదపగూడ, అందు తలమునకపొందక, దానిని వదలి, ఆళ్వారులవిశిష్టతలో అభినివేశమును గలిగినవారైనారు.

**వ్యాఖ్యానము:- నావినాల్ నవిత్తు:-** మనసుయొక్క సహకారములేక నాలుకతోమాత్రము చెప్పి ప్రీతిని పొందితిని అనుచున్నారు. **ఇన్బమ్:-** ఇటువంటిదైన ప్రీతి అని చెప్పవీలుకాకపోవుటచే అనేకవిధములైన ఆనందమును పొందినాను అని చెప్పుచున్నది. **ఎయ్ దినేన్** అనుటచే భగవద్విషయమును ఆశ్రయించిన వారికి ఆనందము ఒక్కొక్కసమయమందు వికసించును, కలుగును. ఇచ్చట అట్లుగాక 'ఎయ్ దువిట్టేన్' పొందితిని అని భూతకాలమును చెప్పుచున్నారు. **మేవినేన్ అవన్ పొన్నడి:-**శరీరమును వదలిన తరువాత కలుగు ఆనందమునకు ఆళ్వారు ఎంబెరుమానుని శ్రీపాదములనాశ్రయింపగ, వీరు అట్లుగాకుండ అట్టి ఆనందమును పొందుటకు ఆళ్వారులశ్రీపాదములనే ఆశ్రయించినాను అనుచున్నారు. **అవన్ పొన్నడి:-** ఎంబెరుమానుని లోకములనుకొలచిన స్పృహణీయమైన శ్రీపాద ద్వంద్వము లోకమంతటికిని ఒకటియై అందలి శిరసులను తడిమినది. నేను ఆశ్రయించిన ఆళ్వారులశ్రీపాదములు వేదమును అభ్యసించువారి శిరస్సులపైన మాత్రమే యుండును. నేను ముట్టుకొని పరిచర్య చేసినను, దోషము రానటువంటి శ్రీపాదములు అవి. **మేవినేన్:-** భగవంతుని విషయమును ఆశ్రయించినపుడు "నాగణైమిశై నమ్బిరాన్ చరణే శరణ్ నమక్కు ఎన్ఱు నాడొరుమ్ ఏగశిన్దైయనాయ్ - శేషశయ్యమీద పవళించియున్న మనస్వామి యొక్కశ్రీపాదమే మనకు ఉపాయమని ప్రతిదినమును, ఒకేవిధమైన ధ్యానము గలవారై" (తి.వా.మొ.5-10-11) అని ఆయనయొక్క శ్రీపాదములను విచ్ఛేదములేకుండ ఉపాయముగ తలంచు చుండవలెను. ఇచట అట్లుగాక ఒకసారి తలంచుటచేతనే చాలుననినది. **అవన్ పొన్నడి మేవినేన్:-** ఎంబెరుమానుని శ్రీపాదములను ఆశ్రయించునపుడు "ఉన్నడిక్కీళ్ అమర్న్దు పుగున్దేనే - నీశ్రీపాదముల క్రింద అమరి ప్రవేశించితిని" (తి.వా.మొ. 6-10-10) మొదలైన ప్రమాణములనుబట్టి, ఎదురుగా నిలుచుని ఆశ్రయించవలసియున్నది. ఇచ్చట 'అవన్ పొన్నడి' అనుటచే, ఆళ్వారులశ్రీపాదములను ఎచ్చటినుండియైనను, ఆశ్రయించునట్లు ఉన్నవి. ఎంబెరుమానుని శ్రీపాదములనాశ్రయించుటకు ఒకపురుషకారము అవసరము కాగా, ఆళ్వారులశ్రీపాదములను ఆశ్రయించునపుడు, పురుషకారము అవసరములేదు. ఎచటనుండి అనుసంధించినను, ఆచార్యాభిమానమే నాకు ఉత్తారకము. ఈరెండువిషయములను అనుసంధానముచేసుకొనినపుడు జీయరువారిమాటలను తలంచుకొనమని అరుంబదవ్యాఖ్యలో సూచితము. అదియెట్లన: నంజీయరువారు ఆశ్రమస్వీకారంచేసినతరువాత అనంతాళ్వాను చూచి, "చెమటపట్టినపుడు స్నానంచేసి, ఆకలివేసినపుడు భోజనముచేసేటటువంటివారు భట్టర్ తిరువడిగళే శరణమ్ అని ఎక్కడినుంచైనా పొందడానికి అడ్డు, ఆలస్యం ఏమైనా ఉన్నదా? అట్లుగాక, కైంకర్యానికి ఆటంకంగాయున్న ఒకవేషం(సన్యాసివేషం) వేసుకొని ఏంచేస్తున్నారు?' అన్నారు. పురుషకారం అక్కరలేదనటానికి ఇంకొక ఐతిహ్యాన్ని ఇచట సాయించినారు. అది ఏమన: భట్టరువారు పరమపదానికి వేంచేసినపుడు అడివి, కొండ దాటి, ఒపురుషకారం లేకుండానే పైలోకం లొంగిపోయినదే అని నంజీయరువారు అనినట్లుగా చెప్పుకొనేవారట. **తేవు మత్తఱియేన్:-** ఆచార్యదేవోభవ (తై.శిక్షా.11-2) అని శాస్త్రము చూపినట్టి ఆచార్యుడు అనబడు దైవము తప్ప ఇతరదైవమును తెలుసుకొనజాలను. **మెయ్ మ్మైయే:-** సత్యముగా. **మేవినేన్ అవన్ పొన్నడి మెయ్ మ్మైయే తేవు మఱియేన్**- శ్రీశఠకోపుని శరస్సునందుంచుకొని, అసత్యమును చెప్పువారు ఎవరైన ఉందురా? ఏవిధముగానైనను, కాలక్షేపమునకు భగవంతుని విషయమును తలంచి కాలమును వెళ్ళబుచ్చవలదా అనినచో, 'కురుగూర్ నమ్బి పావిన్ ఇన్నిశై ప్పాడిత్తిరివనే' - నాకు కాలక్షేపవిషయము మీకువలె ఒకటిరెండు విషయములేనా? వేయిపాశురములు లేవా? అనినట్లుగ భావన. **కురుగూర్ నమ్బి:-**

ప్రాప్తరాజ్యస్య రామస్య వాల్మీకిర్భగవాన్ ఋషిః।

చకారచరితం కృత్స్నం విచిత్రపదమాత్మవాన్।। (రా.బా.కాం.4-1)

[జ్ఞానాదిగుణములచే నిండుదనము కలిగినవారును, మనసును జయించినవారైన వాల్మీకిమహర్షి, రాజ్యమును పొందిన రామచంద్రునిచరిత్రను పూర్తిగా విచిత్రమైన పదములుగల కావ్యముగ రచించి నారు] అని పెరుమాళ్ళను కీర్తించిన వాల్మీకి జ్ఞానము మొదలైన గుణములచేత పూర్ణులయిన విధముగనే వీరును, గుణములచే పూర్తి కలిగినవారగుటచే ఆళ్వారును 'నమ్బి' అనినారు. "ఏఱ్కుమ్ పెరుమ్ పుగళ్ వానవర్ ఈశన్ కణ్ణన్ తనక్కు, ఏఱ్కుమ్ పెరుమ్ పుగళ్ వణ్ కురుగూర్చ్చడగోపన్- [తగియున్న మిక్కిలి కీర్తిగలవాడును, నిత్యసూరులకు స్వామియును, భక్తులకు సులభుడైన శ్రియఃపతి విషయమై ఒప్పియున్న అపరిమితకీర్తిగలవారును సుందరమైన కురుకాపురినిర్వాహకులునైన నమ్మాళ్వారులు] అనినట్లు స్తుతింపబడు ఎంబెరుమానునకు పరత్వము, సౌలభ్యము మొదలగు గుణములచే పూర్తి. స్తుతించు ఆవారికి జ్ఞానము, భక్తిచేతను పూర్తి కలిగినది. అందుచే నంబియనుటలో దోషములేదు. **తిరివనే:-** అచ్చట పరమపదమునకుపోయినచో సామగానముచేసి ఒకచోటనేయుండ వలెను. ఇచట అట్లుగాక ఎట్టి నిర్బంధమును లేక తిరుగుచుంటిని. అందుచేతనే, సుఖముగనుంచువారును, సాధనముగనుండువారును స్వామియు, కాలక్షేపవిషయమును, నాకు ఆవారులే అని భగవంతుని విషయమునే అనుభవించువారికి జవాబు చెప్పుచున్నారు.

**అళ్గియపెరుమాళ్ నాయనార్ ఆచ్చాన్ పిళ్ళైవారి వ్యాఖ్యానమందు రెండవ పాశురము ముగిసెను.**

## మూడవ పాశురము.

3. **తిరితన్దాగిలుమ్ తేవపిరానుడై**

**క్కరియకోలత్తిరువురు కాణ్బన్ నాన్**

**పెరియవణ్ కురుగూర్ నగర్ నమ్బిక్కా**

**ళురియనాయ్ అడియేన్ పెఱ్ఱ నన్మైయే.**

**ప్రతిపదార్థము:- తిరితన్దాగిలుమ్:-** (ఆవారునివదలి) తిరిగివచ్చినను, **తేవపిరానుడై:-** నిత్యసూరులకు నిర్వాహకులైన ఎంబెరుమానుని **కరియ:-** (నీలమేఘమువంటి) నల్లని, **కోలమ్:-** సుందరమైన **తిరువురు:-** దివ్యవిగ్రహమును **నాన్ కాణ్బన్:-** నేను సేవింతును. **పెరియవణ్ కురుగూర్ నగర్ నమ్బిక్కు:-** అతిశయముగలవారును, ఉదారులును, కురుకాపురిపూర్ణులు అయిన ఆవారులకు **ఉరియ ఆళాయ్:-** అనన్యార్హశేషభూతుడనైయుండి **అడియేన్ పెఱ్ఱ నన్మై:-** దాసుడు పొందిన లాభము ఇదియే **ఏ:-** ఏమి ఆశ్చర్యమో చూడుడు.

**అవతారిక:-** ఈమూడవపాశురములో 'తేవు మఱ్ఱఱియేన్' అని ఐశ్వర్య, కైవల్యములతోకూడ భగవంతుని విషయమునుకూడ మీరు ఉదాసీనము చేతురా? అను ప్రశ్న రాగా, నేను కోరుకొనిన లాభము అదిగాదు అనుచున్నంతవరకు దానిని ఉదాసీనముగనే చూతును. ఆవారులు ఆనందించు విషయము అను విగ్రహమగుటచేత ఎంబెరుమానునికూడ అనుభవించుటకు ఆటంకములేదు' అనుచున్నారు. శూర్పణఖవలె పిరాట్టిని అలక్ష్యపరచి స్వతంత్రముగ పెరుమాళ్ళను ఆశ్రయించుటను వీరు తప్పించుకొనుచున్నారు. "విట్టుశిత్తర్ తఙ్గళ్ తేవరై వల్లపరిశు వరువిప్పరేల్ అదు కాణ్డుమ్'అని పెరియాళ్వారును ముందుంచుకొని ఆశ్రయించిన ఆణ్డాళ్ వలె నమ్మాళ్వారును ముందుంచుకొని ఎంబెరుమానును ఆశ్రయించుటను వీరు

వదలలేదు. ఆవారుకు ఎంబెరుమానుడు ఉద్దేశ్యుడగుటచే తమకుగూడ ఉద్దేశ్యుడే అయినాడనుదానిని వీరు మరువలేదు. ఇదివరకు చెప్పిన ప్రమాణములను బట్టి, 'మీరు ఆనందించునది ఏమి' అని యుధిష్ఠిరుడు, పితామహుడును, ఆచార్యుడును అయిన భీష్ముని అడుగగా భీష్ముడు 'తామరలవంటి నేత్రములుగలవానిని ప్రీతితో స్తుతించుటయే నేను ఆనందించునది'అని చెప్పినట్లుగ ఆచార్యుడు ఇష్టపడునదియే తమచే కోరబడునది అని చెప్పుచున్నారు వీరు. ఈ విషయమందు క్రింది ఐతిహ్యములు ఇచట అనుసంధించదగినవి.

1. రాజకులమునందు జన్మించిన, ఎంబెరుమానారుల శిష్య అయిన త్రిపురాదేవిని కొందరు 'మీరు ఇతరదైవములను విడచి దైవమును ఆశ్రయించినవారిని ఆశ్రయించుటకు కారణమేమి? అని ప్రశ్నించగ, దానికి ఆమె ఇతరదైవతముల పేరుగూడ తన నాలుకతో ఉచ్చరించుటకు ఇష్టపడక, చలిదివణ్ణపుకుండను పెట్టు ఆమూలకు అధిపతియైన దైవము ఆశ్రయించతగినది అని మా ఆచార్యులైన ఉడైయవరులు సాయించినట్లైతే నేను కూడ దానిని ఆశ్రయించతగినది అని తీసుకుంటాను.' అని చెప్పినది.

2. గుణమలైప్పాడియను గ్రామమునకు చెందిన గాంగేయుడు అను వేళులు అనుజాతికి అధిపతిఅయిన ఒక సామంతరాజు సేనను కూర్చుకొని దక్షిణమువైపు పోవునపుడు అచటనుండి, పిళ్ళై ఆత్తాన్ అనెడి శ్రీవైష్ణవుడు అనేక సహాయములు చేసెను ఆసామంతరాజు వారిని చూచి, మీకు నేను చేయవలసినది ఏమైనను ఉన్నట్లయితే చెప్పుడు, నేను దానిని చేయుదును అని అడిగెను. దానికి పిళ్ళైయాత్తాన్ 'మీరు ఇంతకుముందే నాకు ఉపకారము చేసినారు అందుచేత ఇపుడు ఏమియు అవలరము లేదు 'అనినారు. దానికి ఆతడు 'నాకే తెలియకుండ మీకు నేను చేసిన ఉపకారమేమి?' అని అడిగెను.దానికి వారు జవాబు చెప్పుతూ, మా ఆచార్యులు కోవెలలో నుండుటకు మీ వలన ఒక వసతి లభించెను, ఆచార్యునికి ఇంతకంటే గొప్పది ఇంకేమైనా ఉన్నదా?'అనినారు. దీనివలన ఆచార్యునికి కావలసినవారు తమకుగూడ కావలసినవారు తమకుగూడ కావలసినవారు అని స్పష్టమగుచున్నది.

3.3. ఉడైయవరులు క్రిమికంఠుని ఉపద్రవముచేత తెల్లబట్టవేసుకొని తిరునారాయణపురమువేంచేసిన కాలములో క్రిమికంఠుడు 'ఎంబెరుమానారులతో సంబంధమున్నవారు రంగనాధుని కోవెలలోకి వెళ్ళకుండ అడ్డుకొనవలెను' అని ఉత్తరువులు ఇచ్చినాడు. ఇది తెలియక కూరత్తాఝ్వాను. రంగనాధుని సేవించుటకు వచ్చినారు. అపుడు కోవెల అధికారులు 'ఇట్టి ఆజ్ఞ ఉన్నను, మీరు అందరును అభిలషించునట్టి మంచిగుణములు కలిగినవారు, అందుచే మీరు కోవెలలోకి వెళ్ళి పెరుమాళ్ళను సేవించవచ్చును'అని అనుమతించినారు. ఆఉత్తరువును అపుడే తెలిసికొనిన ఆఝ్వాను 'మంచి ఆత్మగుణములు మోక్షమునకు పిలుచుకు వెళ్ళును అని అనుకొనినాను. ఆగుణములే శ్రీరంగనాధుని సేవించుటకు ఒక అంగము అగుటచే ఎంబెరుమానారుల శ్రీపాదముల సంబంధమును తెగగొట్టుకొనుటకు కారణమైన సంసార బంధమునకు కారణమయి ఉండును. అటువంటి శ్రీరంగనాధులసేవ నాకు అవసరములేదు' అని కోవెలనుండి తిరిగి వెళిపోయినారు.

దీనివలన ఆచార్యసంబంధమునకు ఆటంకమగు భగవత్సంబంధము విడువవలసినదియే అని తెలియుచున్నది.

**వ్యాఖ్యానము:- తిరిదన్దాగిలుమ్:-** తిరిగివచ్చినను. తిరిదరుల్ అనునది అయినను అనుటకు విశేషణమయి తిరిగివచ్చుట అను క్రియను పూర్తిగ చేసినను అని అర్థము అగుచున్నది. అనగా వెళ్ళిన దారియంతయు తిరిగి వచ్చినను, అని భావము. అనగా తిరువాయ్ మొఝి పాటలే పరమ ఉద్దేశ్యముగ

గ్రహించిన తరువాత ఆపాటలను వదలివేసి, అందలి సంగీతమును వదలి, పాడిన ఆళ్వారిని వదలి, వారు ఆనందించినవిషయమని మొదటి మెట్టయిన ఎంబెరుమానుని వద్దకు వచ్చి అని అర్థము. **తేవపిరాన్ ఉడై కరియకోలత్తిరువురు కాణ్బన్:-** తేవపిరాన్- మరపును చేదించు అమరులైన నిత్యసూరులకు తనను పూర్తిగా అనుభవించుటకు ఇచ్చుకొనిన ఉపకారకుడైన పరమపదనాథుని చెప్పుచున్నారు. వీరున్న చరమపర్వమైన ఆళ్వారులసన్నిధినుండి తిరిగి భగవంతుని విషయమునకు పోవునపుడు "కట్టుణ్ణప్పణ్ణియ పెరుమాయన్" అని చెప్పబడిన కృష్ణునితో ఆగక వానికిని మూలమూర్తియైన నిత్యసూరులనుభవించు పరమపదనాథునివరకును తిరిగి వెళ్ళుటను చెప్పుచున్నారు. "తేవపిరానుడై క్కరియకోలత్తిరువురు" - నిత్యసూరులకు జీవనమును ఇచ్చుచున్న పరమపదనాథుని విగ్రహసౌందర్యము వర్షకాలమేఘమువంటి నీలవర్ణముగలదై సౌందర్యమే విగ్రహరూపమును దాల్చినదా అనునట్లున్నది. ఇటువంటి దివ్యవిగ్రహమును మీరేవిధముగ తెలుసుకొనగలిగినారనగా, "కోలమే తామరైక్కణ్ణదు ఓర్ అఞ్జననీలమే- తామరవంటి కంటికి అలంకారమైన అద్వితీయమైన కాటుకవంటి నీలమేఘమే విగ్రహముగదా"(తి.వా.మొ.3-8-8) అని ఆళ్వారు ఈదివ్యవిగ్రహమునుగూర్చి ప్రశ్నించిన విషయమగుటచే నోరార చెప్పుచున్నారు. పరమయోగులైన ఉపాసకులు భక్తియోగమును పూర్తిచేసి ఎంబెరుమానుని దివ్యవిగ్రహసౌందర్యమును చూచిన తరువాత లోకమందు అద్వితీయమైన శరీరసౌందర్యము గల ఊర్వశి మొదలగు అప్సరసల సౌందర్యముకంటె స్వామి సౌందర్యము ఎన్నో రెట్లు భవ్యమైనదియు, మహానందమునిచ్చునదియు అని చూపుటకు ఆశరీరసౌందర్యమును వర్ణించుటవలె వీరు ఎంబెరుమానుని విగ్రహసౌందర్యమును వర్ణించుచున్నారుగద! ఈసందర్భమున నంబిళ్ళైగారి వ్యాఖ్యానములో యోగభ్రష్టురాలు ఊర్వశి శరీరసౌందర్యమును వర్ణించుచున్నట్లుగ చెప్పినారు అనియున్నది. యోగభ్రష్టులు అని యోగమును పూర్తిచేయనివారిని చెప్పుచున్నది. సామాన్యముగ ఒకేరీతిలోయుండు ఈ రెండు వ్యాఖ్యానములకంటె ఇచట ఈవ్యత్యాసము ఉండుటను పరిశీలింపతగినది. "కరియకోలమ్" - నీలమేఘవర్ణముగల విగ్రహము అని ఆశపడువిధముగ ఆళ్వారు వర్ణించుట మరలమరల అడుగుటచేతనే వీరుకూడ వర్ణించినారు. **కాణ్బన్:-** ఎదురుగ చూచుచున్నాను. "తేవపిరాన్"అనుటచే ప్రత్యక్షముగ చూచి అనుభవించు ఆళ్వారును వదలి, చాలదూరములోనున్న పరమపదనాథునియే ప్రత్యక్షముగ చూచుచున్నాను అనుచున్నారు. నాన్ తేవుమఱియేన్ అని ఆళ్వారులను తప్ప మరియే ఇతరదైవమునుగూడ తెలుసుకొనని నేను ఆవారులు ఆనందించినవిషయము అని పరమపదనాథుని చూచి అనుభవించుచున్నాను. **పెరియవణ్ కురుగూర్ నమ్బిక్కు:-** మిక్కిలి స్పృహణీయమైన గుణము కలవాడై ఆళ్వార్ తిరునగరియైన తిరుక్కురుగూరిలో అవతరించిన ఆళ్వారికి 'వణ్' అనునది 'నమ్బి'పదమునకు విశేషణము. పెరియ అంటే వణ్ అను మాటకు వివరణము. 'సర్వేశ్వరుని గుణము, సౌందర్యము నన్ను ఆళ్వారిసౌందర్యము, గుణములనుండి త్రిప్పలేకపోవుటచే ఆళ్వారియొక్క గొప్పతనమును నాకు తెలియజేసినది అని భావము. "కురుగూర్ నగర్" అని వైకుంఠమహానగరమును వేరుగా చేయుచున్నది. ఆళ్వారు 'తిరునాడు - పరమపదము' అనియును, 'అయర్వఱుమ్ అమరర్ గళ్ అదిపది' (తి.వా.మొ.1-1-1) అనిచెప్పినప్పుడు వారు ఎట్టి అభినివేశమును పొందినారో అట్లే వీరును 'తిరునగరి' అనియు, 'ఆళ్వార్'అనియును చెప్పునపుడు ఆవిధముగనే అభినివేశమును పొందుచున్నారు. **నమ్బిక్కు:-** పూర్ణులైన నమ్మాళ్వారికి. ఆళ్వారుల అనుభవములో ఎంబెరుమానుని అనుభవముగూడ మిళితమైయుండుటచే 'ఆళ్వారిని ఆశ్రయించితిని, ఎంబెరుమానుని విడచినాను' అని చెప్పనక్కరలేకుండగనే ఆళ్వారుల పరిపూర్తియున్నది. అందుచే

వీరియొక్క పూర్తియే గొప్పది. **ఆళురియనాయ్:-** ఆళ్వారికే చెందిన దాసుడనై. అనగా, తమకు వేరుగా ఒక ఇష్టము, అనిష్టము లేక ఆళ్వారికి ఏది ఆనందమో దానినే తాముకూడ ఇష్టపడి కోరుకొనినారు అని భావము. వారికే చెందిన దాసుని లక్షణమిది. **అరియేన్:-** ఆళ్వారుల సౌలభ్యము, సౌశీల్యము, వాత్సల్యము మొదలగు గుణములకు వశపడి, దాసుడను అనినారు. "తొణ్డీర్ ఎల్లీరుమ్ వారీర్ - దాసులందరును రండు"(తి.వా.మొ.5-2-2) అని గొప్పవారు, తక్కువవారు అనెడి వ్యత్యాసములేక అందరను రమ్మని పిలచు సౌశీల్యము గదా వారిది! **పెఱ్ఱ నన్మై:-** ఎంబెరుమానుని పొందుట అనెడి లాభము. నేను ఆళ్వారికి చెందిన దాసుడనై పొందిన లాభము, ఐశ్వర్యమును ఇదియేగదా! భగవానుని విషయము మంచిదే, ఇతరవిషయములు నిప్పువలె కాల్చివేయునని పరిశీలనలో నిశ్చయమగుటచేత నేనీ లాభమును పొందలేదు. మరి ఎందువలన పొందితినో తెలియునా? ఆళ్వారికి చెందినవాడనగుట చేతనే ఈలాభమును పొందినాను అనుచున్నారు.

## నఞ్జీయరువారి వ్యాఖ్యానవిశేషములు.

**తేవపిరానుడై క్కరియకోలత్తిరువురు కాణ్బన్ నాన్:-** పరమపదనాథుని దివ్యవిగ్రహమును ఆళ్వారులు ఉపొంగు విషయమని సేవించుచుంటినిగాని అందు అభినివేశముచెందుట లేదు.

పాణౌ గృహీత్వా విదురం సాత్యకించ మహాయశాః।

జ్యోతీంష్యాదిత్యవత్ రాజన్ కురూన్ ప్రచ్ఛాదయన్ శ్రియా।। (భా.ఉ.94-45)

[మిక్కిలి కీర్తిగల కృష్ణుడు విదురునియు, సాత్యకినియు చేతితో పట్టుకొని, సూర్యుడు ఇతరజ్యోతులను వెలవెలపోవునట్లు చేసినట్లుగ కౌరవులను తన తేజస్సుచే వెలవెలపోవునట్లుచేసి వచ్చినాడు] అనిచెప్పిన తేజోమూర్తిగదా స్వామి! అయినను, మనస్సుచేత అనుభవమును పొంది, ఆనందించుచుండుటయేతప్ప కంటితో చూచునవసరమే లేదు అని భావము. **పెరియవణ్ కురుగూర్ నగర్ నమ్బిక్కు:-** ఆళ్వారొక్కరికే సర్వేశ్వరుడు అజ్ఞానమును ఛేదించు భక్తిరూపాపన్నజ్ఞానమును ప్రసాదించినారుగదా! అందుచేతనే వీరియొక్క కీర్తి, గుణము, స్వభావము చాల గొప్పవి. **వణ్:-** అందము, గొప్పతనము, గుణము- అనునవి కురుగూరుకు విశేషణముగ తీసుకొని, ఆళ్వారులనుకూడ చూపునట్టి ఊరుగనుక ఊరియొక్క కీర్తివిశేషములను చెప్పునదిగా ఇచట తీఁకొనవలెను. మహావిద్వాంసులు, జ్ఞానులు అందరును సమూహముగ కూడిన, ఆవిశేషమైన నగరికి తాము నిర్వాహకులు అని 'పెరియవణ్ కురుగూర్ వణ్ చడగోపన్' (తి.వా.మొ.8-1-11) అని ఆళ్వారులే సాయించినారుగదా! 'వీరియొక్క నారాయణత్వము ఉండునట్లు' అని నంజీయరువారి వాక్యమునకు 'విద్వాంసులైన నరులసమూహమునకు ఆశ్రయణము అయినవారగుటచే వీరికిని నారాయణత్వము అమరినదే' అని అర్థము. "ఆళురియనాయ్ అడియేన్ పెఱ్ఱ నన్మైయే" 'అడియేన్' అనుటచే 'ఆయ'అనబడు చతుర్థి అర్థమును చూపుచున్నది. అనగా 'శేషి ఆనందించు కైంకర్యమే కైంకర్యపు చివరిహద్దు' అని చూపుచున్నది.

## అగియమణవాళప్పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యానమునందలి విశేషములు.

**అవతారిక:-** 'తేవు మఱ్ఱఱియేన్' అనినారు వెనుకటి పాశురములో. ఇచట ఇట్టి నిష్ఠగల వీరివద్ద ఎంబెరుమానుడు మిక్కిలిగా అభినివేశముగలిగియుండుటను చెప్పుచున్నారు. ఎంబెరుమానును కదల్చివేయుట కావలెనన్నచో ఆచార్యునియందు అభినివేశము కలిగియుండవలెను. "'తేవు మఱ్ఱఱియేన్' అని మనలనుకూడ మరచి, ఆళ్వారియందే అభినివేశమును కలిగినవారయినారుగదా! మనభక్తులకంటె భక్తులభక్తులయందు మనకు అభిరుచి ఎక్కువగదా అందుచే మనము వీరికి ఇచ్చునట్టి కానుక చాల

విశేషమైనది కావలెను" అని తలంచి వీరి మనస్సునకు జలప్రవాహమునందు వికసించు కలువలవంటి తనదివ్యవిగ్రహసౌందర్యమును చూపినాడు ఎంబెరుమానుడు. అట్టి కటాక్షమును చూచి, చలించిపోయినవీరు ఇది భగవచ్ఛేషత్వజ్ఞానమువలననో, భాగవతశేషత్వమువలననో, భగవదా శ్రయణత్వము వలననో వచ్చినదిగాదు, ఇదియంతయు, నేను ఆళ్వారికి అనన్యార్హశేషభూతుడనై పొందిన ఫలముగదా అని తమలో తాము చలించుచున్నారు ఈపాశురమందు. ఆచార్యుని ఆశ్రయించి యుండువానిని ఎంబెరుమానుడు తానే పైనుండి వచ్చి ఆశ్రయించును అనుటకు మధురకవియాళ్వారే ఉదాహరణముగదా!

**వ్యాఖ్యానము:- తిరితన్దాగిలుమ్:-** ఎంబెరుమానునితో వెళ్ళుచు తిరిగి వచ్చినను, ఈలాభమును పొందితిని. **తేవపిరానుడై:-** వీరి మనసునకు ఎంబెరుమానుడు మీదనుండి చూపిన విగ్రహశోభ నిత్యసూరులు అనుభవించు విగ్రహశోభయే అగును. ఎంబెరుమానుడు నిత్యసూరులను, వీరిని ఆచితూచి 'వారు(నిత్యసూరులు) మనకొక్కరికే మంచివారు. వీరు ఆళ్వారికే మంచివారు. అందుచే వీరికిగదా మనము ఈవిగ్రహమును దర్శింపజేయవలెను' అని వీరికి ఆవిగ్రహమును దర్శింపజేసి అనుభవింపజేసినారు. **కరియ:-** ఈవిగ్రహమును నిత్యసూరులు అనుభవించునపుడును, 'కణ్ గళ్ శివన్దు - కన్నులు రాగముచే ఎర్రపడి' (తి.వా.మొ. 8-8-1) అను పాశురమందు ఆళ్వారనుభవించునపుడును అది వెలవెలపోయినది. వీరనుభవించినపిదపనే తనసహజమైన శ్యామసుందరవిగ్రహశోభని తిరిగి పొందినది. ఆళ్వారనుభవించునపుడు 'శెమ్ పొన్ తిరువుడమ్బు - అందమైన స్పృహణీయమైన శ్రీమంతమైన దివ్యవిగ్రహము' (తి.వా.మొ.2-5-1) అని సాయించినారే అదే భావమని చెప్పినారుగద!

**కోలమ్:-** గజేంద్రునకు సహకరించుటకు వచ్చినట్లు ఏఆభరణములు ధరించక ఉన్నపళంగా లేచివచ్చినట్లుగా కాక వీరిని అనుభవింపజేయుటకే దివ్యాభరణములను ధరించి పిరాట్టితో కలసి వేంచేసినారు. **తిరువురు:-** మంగళప్రదమైన శ్రీదేవితో కలసియున్న దివ్యమంగళవిగ్రహము. ఇతర ఆభరణములవలె వదలుటకు వీలులేని మంగళకరమైన ఆభరణమును ధరించి వేంచేసినాడు. ఇట్లు ఉన్న విగ్రహమును మెరుపువలె చూపించి కటాక్షించునదియైయున్నది ఈమె. 'తిరుక్కణ్డేన్, పొన్మేనిక్కణ్డేన్ - లక్ష్మీదేవిని సేవించితిని, స్పృహణీయమైన తిరుమేనిని సేవించితిని' (మూ.తిరువం.1) అను విధముగ ఈమెను చూచిననే ఆదివ్యమంగళవిగ్రహమును సేవింపవీలగును. **కాణ్బన్:-** తన ప్రయత్నముచేతనే చూచు ఉపాసకులకు ఈదివ్యశరీరమును శ్రవణమననధ్యానములచేతనే చూడవలెను. ఇచ్చట ఎంబెరుమానుడు తానే మీదనుండి వేంచేసి సేవింపజేసినందువలన ప్రత్యక్షమందు కనబడినట్లు మనసునందు జూచితిని అనుచున్నారు. 'తేవపిరానుడై క్కరియకోలత్తిరువురు కాణ్బన్' - 'అమరర్ గళ్ ఆదిముదల్వన్ కరుగియ నీలనన్మేని వణ్ణన్ ... ... పూమగళార్ తనిక్కేళ్వన్ ఒరు గతియిన్ శువై తందిట్టు ఒళ్గివిలన్ ఎన్నోడుడనే- ' (తి.వా.మొ. 1-9-3) అని తాను ఆళ్వారును అనుభవించుటవలె తనను గూడ నాచేత అనుభవింపించినాడు అనుచున్నారు. **నాన్ కాణ్బన్:-** "తేవు మగ్రుఱితియేన్" అని ఆయనను చూడకూడదు అని కన్నులను త్రిప్పివేసికొనిన నేను గదా చూచితిని అంటున్నారు. **తేవపిరానుడైక్కరియకోలత్తిరువురు క్కాణ్బన్:-** పిరాట్టికి ఎపుడును అనుభవింపతగినదయి నిత్యసూరులకు ఎల్లవేళలయందును సేవింపవీలుగానున్న తిరుమేనినిగదా ముఖము త్రిప్పివేసుకొనిన నేను అనుభవము ను పొందితిని అనుచున్నారు. **తిరిదన్దాగిలుమ్ .... కాణ్బన్:-** చూస్తే ఆళ్వారు మంగళకరమైన వర్ణమువలె స్పృహణీయమైన బంగరుకాంతిగా కాక వేరైనవర్ణముతోనుండుటచే చూచుటయేతప్ప అభినివేశమును పొందలేదు. ఆళ్వారితిరుమేనివలె, ఆనందపు పూమాల సుగంధములు విరియక తులసివాసన వేయుటయే

వీరికి నచ్చని వాసన అయియున్నది. అందుచే ఈవిధముగ అన్నిపద్ధతులకును భిన్నముగానుండుటచే 'తేవర్ ఎన్ను అఞ్జి- దేవుడు అని భయపడి' (తిరునెడు-21) దూరముగా నిలచియే చూచితిని అంటున్నారు. 'ఆళురియనాయ్' ఆళ్వారికి దాస్యముచేయు లాభమును పొందినవాడనయి. ఎంబెరుమానుకు నిర్వాహమును చేయుటకే మనుషులు లేకపోయినపుడు ఆళ్వారికి నిర్వాహము చేయుట మిక్కిలి అరుదైనదిగదా! **నమ్బిక్కాళురియనాయ్:-** వీరియొక్క ప్రణవార్థానుసంధానము చేయువిధముగా. అకారవాచ్యునకే దాస్యముచేయువాడు మకారముచేత చెప్పబడు జీవుడు అనుచున్నది ప్రణవము. అట్టి అకారవాచ్యుడైన ఎంబెరుమానునకు చరమపర్వములోయున్న ఆళ్వారికి చేయు దాస్యమే జీవస్వరూపము అని ప్రణవమునకు వీరు తీసుకొనిన అర్థము. **పెరియవణ్ కురుగూర్:-** పరమపదము ఒకచిన్న చేతిలో ఇముడును అన్నట్లుగ ఉభయవిభూతియును ఒదిగియుండగలిగినంత విశాలమైన ఊరు అది. 'పువియుమ్ ఇరువిశుమ్బుమ్ నిన్నగత్త నీ ఎన్ శెవియిన్ వ పుగున్దు ఎన్నుళాయ్ - భూమియు, ఆకాశమును నీకు లొంగియున్నట్టి నీవును నాచెవిద్వారా ప్రవేశించి నాయందు ఉన్నావు' (పెరియ తిరువం.75) అనినట్లుగ ఉభయవిభూతియును, ఉభయవిభూతినాయకుడును తమకు వశమైయున్న ఆవారును ఆయూరియందు ఉండగలిగిన ప్రదేశము అనగా అంత వైశాల్యము గలిగిన విశేషమైనది కురుకాపురి. **నగర్:-** పట్టణము. పట్టణములో విశేషమైన వస్తువులు అమ్మకమునకు వచ్చిచేరును. ఇతరప్రదేశములనుండి వర్తకులు ఇచతకు వచ్చి విక్రయశాలలను తెరుచుదురు. అటులనే ఈనగరముగూడ విశేషమైన వస్తువులు వచ్చి చేరు స్థలమైయున్నది. **తేవపిరానుడై క్కరియకోలత్తిరువురు క్కాణ్బన్ నాన్ .... నగర్:-** ఆవలియొడ్డుననున్న నిత్యసూరులుకూడ వచ్చి విక్రయశాలలను తెరచు స్థలమైయున్నది. నగర్ అనినచో ముత్యముల మాలలు పరచియుండునదు. ఈనగరమందు ముక్తులు బారులు బారులుగ నుందురు. 'శొన్నశొల్ నమ్బువార్ పది వైగున్దమ్ కాణ్మినే' అని 10వపాశురములో వీరు పాయించినవిధముగా ఇచ్చట నివసించువారు ముక్తప్రాయులేగదా! 'కురవైకోత్త కుళ్గనై మణివణ్ణనై... ఏత్తుదల్ మనమ్ వైమ్మినో' (తి.వా.మొ.3-4-3), 'తెన్నిలజ్గై ఎరియెఝ చ్చెఱ్ఱ విల్లియై... పరవుమినో' (తి.వా.మొ.3-4-2) అనియును దేవకీపుత్రరత్నమైన కృష్ణుడును, ఆమణికంటె విశేషమైన వింటిని పట్టుకొని మాణిక్యమైన దశరథుడుపొందిన మరకతమణియును వేంచేసియున్న దేశమైయున్నది. **పెఱ్ఱ నన్మైయే:-**"అడియార్ గళ్ కుఝాగ్గళై ఉడన్ కూడువదు ఎన్ఱుకొలో- కైంకర్యపరులు సమూహములై తనతో కూడియుండుట" (తివా.మొ.2-3-10) అనునది విశేషమనియును, 'మల్గు నీలచ్చుడర్ తఴఝప్ప- ప్రవహించుచున్న నీలవర్ణశోభ విరియగా' అని ప్రారంభించి, "ఎన్ తిరుమార్వనై వన్దు ఎయ్ దు మాఱు అఱియేన్ - నా వక్షస్థలమందుండువాడు వచ్చియుండువిధమును తెలియ కుంటిని' (తి.వా.మొ7-6-6) అని ఆవారు కోరినందున వారికి లభించవలసినకొన్ని విశిష్టతలున్నవి. దాసుడు పొందగోరిన కల్యాణగుణశుభములు అన్నియును లభించుటచే ఇక ఇంకను లభించవలసిన లాభములు, శుభములు ఒక్కటియును లేదు. **నమ్బిక్కు అమ్బునాయ్ అడియేన్ పె నన్మైయే:-** ఎంబెరుమానుకు శేషత్వమును చేయుచున్న ఆవారులు వానినియు, దాసులసమూహములను పొందకపోవుటచే తపించినారు. ఆవారికి కైంకర్యము చేయు నేను, కోరినదంతయు పొందియేయున్నాను.

పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవసంశ్రయాః।

తేనైవతే ప్రయాస్యన్తి తద్విష్ణోః పరమం పదమ్।। (శాండిల్య స్మృతి 1-15)

[మృగమో మనుష్యుడో, పక్షియో ఎవరైనను వైష్ణవునొకనిని ఆశ్రయించినవారైనచో దానివలననే వారు

విష్ణువుయొక్క ఆఉచ్చస్థానమును పొందుదురు.] అని చెప్పినట్లుగా వైష్ణవులను ఆశ్రయించిన కైంకర్యపరులకు పరమపదమును చేరి పొందవలసియున్నది. అటులగాక పరమవైష్ణవులైన ఆవారిని ఆశ్రయించిన నాకు ఉన్నస్థలమందే వచ్చి నర్తనమాడునే! అనగా ఆవారుకు కైంకర్యము చేయుట అను గొప్ప సంపద వచ్చి చేతికి లభించినదే అని అనుచున్నారు. 'వేఱాగ ఏత్తి యిరుప్పారై వెల్లుమే మఱ్ఱవరై చ్చాత్తి ఇరుప్పార్ తవమ్ - వేరుగా స్తోత్రము చేసియున్నవారిని కోకొల్లలుగా ఇతరులను స్తుతించి తపముచేసి యున్నారు' (నాన్. తిరువం.18) అని ఎంబెరుమానుని ఆశ్రయించినవారి తపస్సుకంటెను వానికైంకర్యపరులను ఆశ్రయించినవారి తపము విశిష్టమైనది అనెడు గొప్పతనము నావిషయమందు ఫలించినదే అని మరలమరల చెప్పి ఉక్కిరిబిక్కిరి అగుచున్నారు.

మూడవ పాశురమునకు వ్యాఖ్యానవివరణములు పూర్తియైనవి.

4. నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్ గళ్
పున్మైయాగ క్కరుదువరాదలిల్
అన్నైయాయత్తనాయ్ ఎన్నైయాణ్డిడుమ్
తన్మైయాన్ చడగోపనెన్నమ్బియే.

**ప్రతిపదార్థము. నన్మైయాల్ మిక్క:-** మంచిగుణములచే గొప్పతనము అతిశయించినవారు. **నాన్మఱైయాళర్ గళ్:-** నాలుగువేదములయందును అధికారముగలవైదికులు, **ఎన్నై:-** దాసుడనైన నన్ను, **పున్మైయాగ కరుదువర్ ఆదలిల్:-** తక్కువతనమే రూపుదాల్చినదని తలచి ఉపేక్షించియుండువారు అనునదియే కారణముగ, **అన్నైయాయ్:-** తల్లియై, **అత్తనాయ్:-** తండ్రియై **ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్:-** దాసుని చేతినిపట్టుకొని కృపజేయు స్వభావము గలవారైన **చడగోపన్:-** నమ్మాళ్వారు **ఎన్ నమ్బి:-** నాకు నిర్వాహకులు, నాకొరతను తీర్చు పూర్ణులు.

**అవతారిక:-** 'తేవుమఱియేన్' అని వదలివేసిన భగవంతుని విషయమును 'పెరుమాయన్ ఎన్నప్పనిల్' అనియు, "తిరువురుక్కాణ్బన్" అనియు ఆళ్వారులు ఉప్పొంగిపోవుట అనెడి కారణముచే వీరు కోరుకొనుటకు కారణమేమైయుండును అనగా, దానికి సమాధానముగ 'ఎన్నడైయ- నాయొక్క నీచత్వమును లెక్కచేయకుండ నన్ను చేరదీసిన ఆళ్వారియొక్క సౌలభ్యమును, సౌశీల్యమును తలంచినచో వారు ప్రీతిచెందు భగవంతుని విషయమును నాచేత ఆనందింపజేయకయుండుట సాధ్యమగునా? అని మధురకవియాళ్వారి మనోభావనగా 'మీరు ఎంత తక్కువవారు, దానిని చూడకుండ మిమ్ములను వారు ఎట్లు స్వీకరించినారు? అనెడి ప్రశ్నకు ఈపాశురంలో సమాధానమును చెప్పుచున్నారు మధురకవులు.

**వ్యాఖ్యానము.** 'నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్ గళ్ పున్మైయాగ కరుదువర్' ఆత్మగుణములు పూర్తిగయున్నవారై సంసారులందరను యుజ్జీవింపజేయు వారిలో నమ్మాళ్వారు తప్ప ఇతరులందరిచేతను, 'వీడు తక్కువతనమే రూపుదాల్చివచ్చిన మనిషి, ఏమియు ప్రయోజనములేనివాడు'అని చేతులు దులుపుకొనవలసిన స్థితిలోలేనుగద నేను! నాలుగు వేదములను చక్కగ అభ్యసించినవేదవిదులగుటచే వారు మంచిగుణములచేత గొప్పవారు. అందువలన అందరకును ఆశ్రయమిచ్చువారుగనుంటిరి. ఆళ్వారు కూడ ఈగోష్ఠిలో చేరినవారైనను, ఈపాశురములోని రెండవభాగమునందు వారు తమకు నిర్వాహకులుగ చెప్పుటచే ఇచట ఆళ్వారిని తప్పించి మిగతవేదవిదులనే చెప్పుకొనవలెను. వీరికి మంచియనేది -

ఒకనివద్ద దోషములు, సుగుణములు ఉండినచో దోషములను వదలి, గుణములను మాత్రము చూడవలెను. మంచిచేత గొప్పతనము అనెడిది - నిజముగ గుణములేక, గుణము అనిచెప్పతగిన ఏఒక్క స్వభావములేక దోషమే వానివద్ద పూర్తిగాయున్నచో ఇట్టివానిని మనము రక్షించక వదలినచో వానిని మరియెవరు రక్షింతురు అని ఆదోషములనే కారణముగ తలంచి స్వీకరించుట. అటువంటి మంచితనముచే గొప్పవారైన వేదవిదులుకూడ వదలివేయునట్టి నీచత్వము కలవాడను నేను అనుచున్నారు. 'నాన్మఱైయాళర్ గళ్' 'అతినీచస్థితియందున్నవారినిగూడ చేరదీసి తీర్చి దిద్దవలెను' అనెడి మంచితనమును విధించువేదములలో పండిపోయినవారిని నాలుగు వేదములను ఆచరించి నిర్వహించువారని యందురు. అనగా విడదీయకుండ ఒకటిగాయున్న వేదమును ఋక్, యజుస్, సామ, అధర్వణ అని నాలుగు వేదములుగను, వాటిలో ఒక్కొక్కదానియందును శాఖ, కాండము మొదలైన విభాగములుగ ఏర్పరచి విభజించిన వ్యాసభగవానునివంటి అధికారము గలవారు. ఇటువంటివారికి ఉదాహరణములు:- 'నకశ్చిన్నాపరాధ్యతి - తప్పుచేయనివారు ఎవరును ఉండరు' (రా.యు.కాం. 116-44) అని రాక్షసస్త్రీలను కూడ చేరదీసిన జనకరాజపుత్రియు, 'నేను పొందిన లాభము నాలుగు ఊళ్ళవారును పొందవలెను' అని అనిన కూరత్తాళ్వాను. అనగా 'ఎట్టి అధమస్థితియందున్నను, వారిపై కరుణను చూపవలెను అనెడి వేదతాత్పర్యమును ఆచరించువారు వీరు' అనునట్లుగ లోకమునకు ఆదర్శప్రాయులుగ ఉండువారు. అట్టివారుగూడ నన్ను వదలివేసినారు అనుచున్నారు మధురకవులు. "పున్మైయాగ క్కరుదువర్" - 'పున్మై' అనెడి పదము నీచత్వమును చెప్పు ఒకగుణము - ఒక స్వభావమును చెప్పు మాట. ఇట్టి అల్పత్వమును చూపు గుణము ఒకటయి, అట్టి గుణముగల ఒక మనిషిగకూడ నన్ను తలంచక, 'నీచత్వమే రూపుదాల్చిన వస్తువు వీడు' అని నన్ను తలంచిరి. 'పున్మై' అంటే బాధనో, ఆబాధకు కారణమైన పాపమునో, శబ్దాదివిషయములయందు అభినివేశమునో, అహంకారమనెడి గర్వమునో సూచించును. ఈవిషయమును తరువాతిపాశురంలో ప్రారంభంలోనే చెపుతారు.

"ఆదలిల్ అన్నైయాయ్, అత్తనాయ్, ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్ నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్ గళ్" నన్ను వదలివేయుటకు కారణమైన ఆనీచత్వమే కారణముగా 'వీనిని నేనుకూడ వదలివేసినచో వీనిని కాపాడువారెవరుందురు' అని నాకు తల్లి, తండ్రి మొదలగు అన్ని ఉపకరించేవిగా అయి కాపాడినారు.

సపిత్రాచ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః।
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః।। (రా.సుం.కాం. 38-33)

[ఆకాకాసురుడు తండ్రిచేతను, (తల్లిచేతను) మహర్షులతోకలసిన దేవతలచేతను వదలవేయబడినవాడై, మూడులోకములను చుట్టి తిరిగి ఆరామునే శరణు పొందినాడు] అనినట్లుగ కాకాసురునివలె వీరికి కూడ వేఱొక రక్షకులు ఎవరును లేరు అని తలచి, అదియే కారణముగ, అన్నిప్రకారములగను రక్షించినారు. 'అన్నైయాయ్, అత్తనాయ్ ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్' ప్రీతికరమైనదానిని చేయునట్టి తల్లిచేయు దానిని, హితమునే చేయునట్టి తండ్రి చేయుదానిని, స్వరూపమునకు తగినట్లుగ కైంకర్యమును స్వీకరించు నాయకుడు చేయుదానినియును చేసినవారు. "తాయాయ్ తందైయాయ్, అఱియాదన అఱివిత్త అత్తా నీ శెయ్దన" అని తి.వా.మొ.2-3-2 లో నమ్మాళ్వారులు ఎంబెరుమానుడు తనకు అన్నివిధములబంధువయి సహాయము చేసినాడు అని చెప్పినట్లుగ వీరు ఆళ్వారి విషయమందు చెప్పుచున్నారు. **తన్మైయాన్:-** ఈవిధముగ అన్నివిధములబంధువయియుండు స్వభావము వీరికి సహజమైన స్వభావమనుచున్నారు.

నిప్పుకు కాల్చు స్వభావమువలె, నీటికి చల్లదనమువలె, ఈస్వభావము వీరి స్వరూపమును చూపు సహజమైన గుణము అని భావము. దీనినుండి, వీనికి సహాయము చేయుచున్నాను అని ఉపకారకుడు తలంచనుకూడ లేదు. ఉపకారముపొందినవాడు పెట్టుబడిగాని, ప్రత్యుపకారము చేయవలసిన ఆవశ్యకత కూడ లేదని స్పష్టము చేయబడుచున్నది. 'చడగోపన్ - శఠకోపన్ - శఠమును (జ్ఞానమును ఛేదించునదిగా యుండు నీచత్వమును) పోగొట్టినవాడు అనునది శఠకోపుడు అనుపేరుకు అర్థము. తమశఠత్వమును పోగొట్టినవారు అని చూపుటకు ఆతిరునామమును పెట్టి వివరించినారు. గతమూడు పాశురములలోను, "తెన్ కురుగూర్ నమ్బి" అని ఊరిపేరుతో చెప్పినవారు, ఈపాశురంలో చడగోపన్ అని పేరుపెట్టి చెప్పుట తమయొక్క దోషములను పోగొట్టినవారు అని వారి మనోభావము అయియుండును.

**ఎన్ నమ్బియే:-** నాయొక్క పూర్ణులు. 'అన్నైయాయ్, అత్తనాయ్ - తల్లియై, తండ్రియై అని చెప్పుటతో తృప్తి చెందక వీరిపూర్ణత మిక్కిలి విశేషమైనది అని అంటున్నారు. అంటే తల్లిచేసే మంచిని తండ్రిచేయలేడు, తండ్రిచేసే హితాన్ని తల్లి చేయలేదు. ఆచార్యుడు చేసే ఉపకారాన్ని తల్లీతండ్రీకూడా చేయలేరు. నాయకుడు చేసేదాన్ని సేవకుడు చేయలేడు. వీరందరూ చేయగలిగిన వన్నింటినీ తామే చేయగల పూర్ణత కలిగినవారు నమ్మాళ్వారు అంటున్నారు శ్రీమధురకవులు. **ఎన్ నమ్బియే:-** నాయొక్క నీచత్వము అనబడు గంభీరమైన లోపము ఎట్టిదియనగా అది యొక లోతైన గోతివలె కన్పట్టును అంటున్నారు. అట్టి లోపమును పూర్తిగా నింపివేసి దాన్ని పూర్తిగా లేకుండా చేయగలిగినవారు, కరుణారసప్రవాహపూర్తిగల నమ్మాళ్వారుమాత్రమే అనయే చెప్పవలెను అంటున్నారు. అన్నైయాయ్, అత్తనాయ్ అని ప్రారంభించి, చెప్పిన ఉదాహరణములకు వీరితో సాటియేలేదు. అట్టి బాంధవ్యములన్నియు, కర్మకారణముగ వచ్చినవే అగుటచేతను, పూర్తి కలిగిన గుణములు కలవికాకపోవుటచేతను అవి వీరికి సాటిగావు. అందుచే, ఆవారులు చేయు ఉపకారములను చూచినట్లయితే 'తేవు మఱియేన్' అని నేను వదలివేసిన భగవంతుని విషయమును అన్నివిధముల ఉపకారములు చేయువారైన ఆవారిని ఉంచుకొని తబ్బిబ్బు కాకుండ ఉండటానికి సాధ్యము కాదని భావము.

## నఞ్జీయరువారి వ్యాఖ్యానంలోని విశేషములు.

**అవతారిక:-** మూడవపాశురములో చెప్పిన విధముగ ఆవారు మిమ్ములను కాపాడుటకు, మీరు పెట్టిన మదుపు ఏమిటి అను ప్రశ్న ఉదయించగ, మంచివారందరును వదలివేయునట్లు జ్ఞానములేని వానిగ యుండుటయే నేను పెట్టిన పెట్టుబడి అంటున్నారు.

**వ్యాఖ్యానము:-** నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్ గళ్ - ఇతరులు సుఖముగ జీవించియుండుటయే తమసుఖజీవనముగను తలంచువారుగ ఉండువారు. పూర్వభాషీ,ప్రసన్నాత్మా- మొదటమాటాడువాడును, ప్రసన్నతయున్న మనసు గలవాడుగ యుండువాడు.

విమలమతిరమత్సరః ప్రశాన్తః శుచిచరితోఖిల సత్వమిత్రభూతః।
ప్రియహితవచనోస్తమానమాయో వసతి సదా హృది తస్య వాసుదేవః।। (వి.పు.3-7-24)

[నిర్మలమైన బుద్ధిగలవాడును, మాత్సర్యములేనివాడును, మిక్కిలి ఓర్పుగలవాడును, పరిశుద్ధమైన నడవడిగలవాడును, అన్నిజీవులకును, ప్రాణులకును మిత్రుడైనవాడును, ప్రీతికరమైనదియు, హితమైన వచనములుగలవాడును, ప్రకృతిసంబంధమును దాచుటకు దొరికినవాడును, అయినట్టివాని హృదయమందు వాసుదేవుడు ఎల్లవేళలలోను వసించుచున్నాడు.] అని ఇతిహాసపురాణములలో చెప్పబడిన

మంచివారిలక్షణములన్నింటిని కలిగినవారు. చెడును భావించువారిపైకూడ కరుణను చూపు కూరత్తావాను, ఆండాళు, సీతాపిరాట్టివంటివారు.నాన్మరైయాళర్ గళ్:- వేదములను వచించు అధికారము గలవారు, వేదములను గౌరవించునటుల చేయు విశిష్టత గలవారు. శడగోపన్ ఎన్ నమ్బియే:- తల్లియొక్క గర్భమందు ఉండునపుడే జ్ఞానమును మరిపించు శఠము అను వాయువును కోపించి తరిమివేసినవార గుటచేతనే శఠకోపులు అనెడి పేరు వచ్చినవారు. ఈవిధముగ తమకులోపములను కలిగించు శఠమును పోగొట్టుటయేగాక నాయందుగల లోపమునుకూడ పోగొట్టిన పరిపూర్ణులు.

**అగియమణవాళ పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యానమందుగల విశేషములు.**

**అవతారిక:-** తేవుమర్ఱ్ఱఱియేన్, పెరియవణ్ కురుగూర్ నగర్ నమ్బిక్కు ఆళురియనాయ్ అడియేన్ పెనన్మైయే అని వీరు చెప్పగా వినెడివారు.

సర్వేషామేవ లోకానాం పితామాతాచ మాధవః।
గచ్ఛధ్వమేనం శరణం శరణ్యం పురుషర్షభాః।। (భా.ఆ.192-56)

[పురుషశ్రేష్ఠులారా! అన్నిలోకములకును తండ్రియు, తల్లియు లక్ష్మీనాధుడే. శరణ్యుడైన ఈయననే శరణుపొందుడు.]

పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః।
వేద్యం పవిత్రమోంకారః ఋక్సామయజురేవచ।। (భ.గీ.9-17)

[ఈలోకమునకు తల్లియు, తండ్రియు, ధరించువాడును, పితామహుండును. వేదములచే తెలియబడునదియును, పరుశుద్ధిచేయునదియును అగు ఓంకారము(ప్రణవము)ను, ఋగ్యజుస్సామరూప మైన వేదమును నేనే.]

"ఉలగుక్కోర్ మున్దైత్తాయ్ తన్దైయే- లోకములకు విలక్షణుడవై అనాదియైన తల్లిగను, తండ్రిగను యున్నవాడై".(తి.వా.మొ.5-7-7) అని ఋషులు, ఆవారులు ఆఎంబెరుమానుడును, ఏకముఖముగ సర్వేశ్వరునే అన్నిలోకములకును తల్లి, తండ్రి మొదలైన సర్వవిధబంధువులుగను చెప్పుచున్నారు. అట్టి ఆయనను ఆశ్రయించవలెనే! లేక

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే।
వాసుదేవ స్సర్వమితి సమహాత్మా సుదుర్లభః।। (భ.గీ.7-19)

[అనేకపుణ్యజన్మములతరువాత జ్ఞానియైనవాడు వాసుదేవుడే సర్వమును అని నన్ను ఉపాసించును. అట్టి మహాపురుషుడు దుర్లభుడు] అని కట్టబడిన ఆ అత్యాశ్చర్యకరమైన చేష్టలుగలవాడును 'పెరు మక్కళ్ - గొప్పవారలు' (తి.వా.మొ.3-7-5), 'శిఱుమామనిశర్ - రూపమందు చిన్నవారై మహిమయందు గొప్పవారైన మానవోత్తములు' (తి.వా.మొ.8-10-3) అనియు నమ్మావారులు తామును అభినందించు విధముగ మహాత్ములైన జ్ఞానులను ఆశ్రయించుదుము. వారిని విడచి, నమ్మావారిని ఆశ్రయించుటకు కారణమేమి అని ప్రశ్నరాగా, "వారుకూడ నానీచత్వమును చూచి చేతులుదులుపుకొనవలసిన సందర్భమందు నానీచత్వమునే చూచి నాకు చేయూతనిచ్చినవారగుటచే వారే నాకు ఉద్దేశ్యులైనారు అని ఈపాశురమందు జవాబు చెప్పినారు.

**వ్యాఖ్యానము:- నన్మైయాల్ మిక్క:-** వీరికి మించిన మంచివారు మరియొకరులేరు అనునట్లుగా మంచి తనమందు చివరిహద్దైనవారు. ఎంబెరుమానుని కైంకర్యపరులను 'నలత్తాల్ మిక్కార్ - నీయందు ప్రేమచే మించినవారు' (తి.వా.మొ.5-8-3) అని ఆవారు సాయించుటకు సమర్థులగుటచే అటువంటివారిని

"నన్మైయాల్ మిక్కవర్ గళ్" అంటున్నారు వీరు. మంచితనపు సంపర్కము లేని దుర్మార్గులు ఎవరనగా ఒకకారణములేక ఎంబెరుమానుని సంపదయైన ఇతరులకు చెడునే చేయువారు. నన్మై - మంచియే మనగా, అటువంటివారికి కూడ చెడుచేయకుండుటయు, తనవిషయమందు అకారణముగ చెడుచేయు వారివిషయమందు అట్టి చెడును పట్టించుకొనకుండుట. 'నన్మైయాల్ మిక్కిరుక్కై' ఏమియనగ, 'అపకారిష్వపి సదా సాధుః సాధ్వేవ వర్తతే - అపకారులవిషయమందుగూడ ఎల్లపుడును మంచివానిగనే మంచివాడు ఉండుడు' అనినట్లుగ అపకారము చేయువానికి కూడ ఉపకారముచేయువానిగ యుండుట. వీరు ఇట్లనుటకు కారణమును 'నాన్మఱైయాళర్ గళ్' అనుట చూపుచున్నది. "మాతాపితృసహస్రేభ్యో వత్సలతరం శాస్త్రమ్ - వేయిమంది తలిదండ్రులకంటెను ఎక్కువ వాత్సల్యము గలది శాస్త్రము" అనియు, "నలజ్గళాయ్ నకలైగళ్ - మంచివారై మంచివిద్వాంసులై" (తిరుచ్చంద. 90) అనియును, తప్పుచేయువారికిగూడ చేయూతవదలక వారికిగూడ మంచిని ఉపదేశించుచున్న వేదముతోనున్న సంబంధమే వీరిని మంచిచే గొప్పవారిగ చేయును. "నన్మైయాల్ మిక్క" , "నాన్మఱైయాళర్" అను రెండు పదములచేతను, "శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం - వేదాన్తమును తెలిసినవాడును బ్రహ్మసాక్షాత్కార మును పొందినవాడును అగు ఆచార్యుని ఆశ్రయించతగినవాడు " అని చెప్పబడిన రెండు ఆచార్యలక్షణములును చెప్పబడుచున్నవి. మరియొక విధముగ " నన్మైయాల్ మిక్క" అను పదమును " నాన్మఱై" అను పదమునకు విశేషణముగ తీసుకొని నిత్యమగుట, లోపములేకుండుట మొదలుగాగల గుణములుగల వేదములు అనియు అర్థమును స్వీకరించవచ్చును. దానికి తగినట్లుగ వేదముయొక్క అర్థమును తెలిసినవారు "నన్మైయాల్ మిక్క నాన్మఱైయాళర్ గళ్" అగుదురు. రాక్షసస్త్రీలపై కరుణచూపిన సీతాపిరాట్టియు, నాలూరానుపై కరుణచూపిన కూరత్తావానును, చెడును తెలిసిన పురోహితులు, తండ్రియైనవారికి కరుణతో మంచిని చేసిన ప్రహ్లాదునివంటివారును ఇట్టివారు. **పున్మైయాగ కరుదువర్:-** నీచత్వమే రూపుదాల్చినవాడు అని నన్ను తలంచినవారు. "ఎన్నదావియెన్నుమ్ వల్ వినై - నాశరీరము అని చెప్పుటయను బలమైన పాపము" (తిరుచ్చంద. 119) అనినట్లు తక్కువతనమే తానుగ నన్ను తలంచువారు. తమయొక్క తక్కువతనముకూడ వీరిని బాధించనేలేదు, వారు వీరిని స్వీకరించక పోవుటయే వీరిని బాధించినది.

హతోస్మి యది మామేవం భగవానపి మన్యతే - ఓభరద్వాజమహర్షీ! మీరుకూడ నన్ను ఈవిధముగ తలంచినచో నేను హతుడను అయినాను (చంపినంతగ బాధించినది) అని భరద్వాజమహర్షితో భరతుడు చెప్పినట్లుగ ఆవారు బాధపడినారు. **అన్నైయాయ్ అత్తనాయ్:-** "అత్తనాగి, అన్నైయాగి" (తిరుచ్చంద-115) అని ఎంబెరుమానునివలె మొదట మంచిచేయుటకు తండ్రివలె దండనను విధించి తీర్చిదిద్ది తరువాత తల్లివలె ప్రియమైనదానిని ఇచ్చువారిగ కాకుండ మొదటయే తల్లివలె ప్రియమును చేయువారై తరువాత హితమును- మంచిని- చేయుదురు. మొదట ఎంబెరుమానుని మహత్వమును చెప్పి, నాకు ప్రీతిని కలిగించి, ఆతరువాత నేను ఉండవలసిన విధమును ఉపదేశించి దిద్దినారు. **ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్:-** నన్ను కాపాడు స్వభావముగలవాడు. తల్లిదండ్రులు చేయుదానిని చేయటమేకాక, పాలించువాడు చేయవలసినదానిని కూడ చేసినారు. "అత్తనాగి, అన్నైయాగి ఎమ్బిరానుమాయ్- "(తిరుచ్చంద-115) అని తిరుమశైయావారులు ఎంబెరుమానునిగూర్చి అనుసంధించుటవలె వీరు నమ్మావారిని అనుసంధించినారు. **ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్:** తాము తిరువాయ్ మొని సాయించినపుడు నన్ను రాజాజ్ఞను వ్రాయమని చెప్పి, ఉచితమైన కైంకర్యమును స్వీకరించినారు. "ఎన్నై ఆణ్డిడుమ్" నేను పొలిన్దునిన్దపిరాన్ పెరుమాళ్ళను లెక్కచేయకుండుటను చూచి, వారిని సేవించుటకు ఒకసారి వెళ్ళిరండి అని

ఉపదేశించినారు అని వడక్కు తిరువీదిప్పిళ్ళై సాయించినారు. 'తన్మైయాన్'.ఈవిధముగ కైంకర్యపరులను రక్షించుట నమ్మాళ్వారికి సహజగుణమైయున్నది. ఆవారిసంబంధమును చూచి దాస్యమును స్వీకరించుటచేతనే ఎంబెరుమానునకు ఇది విధిగా యున్నది. **ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్ చడగోపన్:-** "అవనడియార్ శిరుమనిశరాయ్ ఎన్నై ఆణ్డార్ - ఆస్వామి దాసులై చిన్నగొప్ప మనుష్యులు అయి, నన్ను పాలించుదురు" - (తి.వా.మొ.8-10-3) అని నమ్మాళ్వారు తమను పాలించువారిని చెప్పినారు. వీరు నమ్మాళ్వారే తమను రక్షించువారు, పాలించువారు అని చెప్పుచున్నారు. ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్ చడగోపన్ - నాయొక్క అజ్ఞానపు నాచత్వమును పోగొట్టి, రక్షించి, శఠకోపులు అని వారికితగిన పేరు కలిగినవారు అయినారు. **ఎన్నమ్బియే:** సాత్వికులందరిచేతను విడువబడిననన్ను అంగీకరించుచు అప్రియములును, అహితములును, పాతవై కనుమరుగు అగునట్లు నన్ను ప్రియమునందును, హితమునందును ముంచెత్తి ఏయుపకారమును చేయని నాచేతి కైంకర్యమును స్వీకరించిన పూర్ణతగలవారు నమ్మాళ్వారేగదా అని తమసిద్ధాంతమును నేర్పించి లాభమును చేకూర్చినారు.

నాలుగవ పాశురమునకు అగియమణవాళ ప్పెరుమాళ్ నాయనారుల వ్యాఖ్యాన విశేషములు పూర్తియైనవి.

నాలుగవ పాశురమునకు వ్యాఖ్యానవివరణములు పూర్తియైనవి.

5. నమ్బినేన్ పిఱర్ నన్ పొరుళ్ తన్నైయుమ్
నమ్బినేన్ మడవారైయుమ్ మున్నెలామ్
శెమ్ పొన్ మాడత్తిరుక్కురుగూర్ నమ్బిక్కు
అమ్బనాయ్ అడియేన్ చదిర్త్తేనిన్ఱే.

**ప్రతిపదార్థము:- అడియేన్:** (ఈనాడు 'అడియేన్ - దాసుడను' అని చెప్పుకొనుటకు తగినట్లున్న) నేను, **మున్ ఎలామ్:** (ఆవారుల విషయీకారమును పొందుటకు) పూర్వమంతయు, **పిఱర్:** చుట్టుపక్కలవారి నన్ **పొరుళ్ దన్నైయుమ్:** మంచివస్తువులన్నింటిని **నమ్బినేన్:** ఆశపడియుంటిని. **(పిఱర్)మడవారైయుమ్:** ఇతరస్త్రీలనుకూడ **నమ్బినేన్:**ఆశపడి కాంక్షించితిని, **ఇన్ఱు:** ఇప్పుడయితే **శెమ్ పొన్ మాడమ్:** కాంతిగల బంగారమువంటి మేడలుగల **తిరుక్కురుగూర్ నమ్బిక్కు:** తిరునగరికి నిర్వాహకులైన ఆవారులకు **అన్బనాయ్:** భక్తునిగా అయి, **చదిర్త్తేన్:** చాతుర్యము గలవాడనైతిని.

## పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యాన వివరణము.

**అవతారిక:** వెనుకటి పాశురమందు తమ అల్పత్వము రూపుదాల్చినదిగను, దానికి తగినట్లు తమకు ఆవారు అన్నివిధములగను సహాయము చేసినారనియు సాయించినారు. ఆరెండింటిని ఈపాశురమందు వివరించుచున్నారు.

**వ్యాఖ్యానము:** పాశురపు మొదటిభాగముచే తమ అల్పత్వమును, రెండవభాగముచే ఆవారు తమకు ఏవిధముగ సహాయము చేసినారో వివరించుచున్నారు. **పిఱర్ నన్ పొరుళ్ దన్నై నమ్బినేన్:** ఇచట పిఱర్ అంటే సర్వేశ్వరుడే. నన్ పొరుళ్ అంటే ఆత్మవస్తువు. నిత్యులు, ముక్తులు, భక్తులు అనబడు మూడురకముల జీవులకును, అతీతుడు - పైవాడు అయి, వారికియుండనట్టి అనేకవిశేషగుణములు కలిగినవాడగుటచే 'పిఱర్' అనినారు.

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ।
క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే॥

ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః।
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః।।
యస్మాత్ క్షరమతీతో2_హమక్షరాదపిచోత్తమః।
అతోస్మిలోకే వేదేచ ప్రథీతః పురుషోత్తమః।। (భ.గీ.15-16,17,18)

[క్షరములనియు, అక్షరములనియు, లోకమందు పురుషులు రెండు విధములు. భూతములన్నియును క్షరములే. కూటస్థుడగు(మూలస్థానమందున్నవాడు) ముక్తాత్మ అక్షరము అనబడుచున్నాడు. ఎవడు మూడులోకములయందును ప్రవేశించి, వాటిని ధరించువాడుగను, ఎట్టి లోపములును లేనివాడుగను, అన్నింటిని నియమించువాడుగను, పరమాత్మయని చెప్పబడువానిగను ప్రకాశించుచున్నాడో అతడే పురుషోత్తముడు. ఆతడు ముందు చెప్పబడిన పురుషులకంటె ఇతరమైనవాడు. నేను, జ్ఞానమందు హెచ్చుతగ్గులుగల సంసారిపురుషునికంటెను వేఱైనవాడనగుటచేతను, జ్ఞానమందు హెచ్చుతగ్గులు లేని ముక్తపురుషునికంటె మీదివాడినగుటచేతను, శ్రుతులయందును, స్మృతియందును పురుషోత్తముడని ప్రసిద్ధి చెందితిని.] అని భగవద్గీతయందుకూడ జీవులకంటె చాలవేఱైనవానిగ తనను కృష్ణుడు సాయించెనుగదా! వస్తువు అని గుణము,చేత మొదలైనవాటితోనున్న ఒక ద్రవ్యమును సూచించుచున్నది. నన్ పొరుళ్ అనునది ఒకవిశేషమైన ఆత్మవస్తువే. 'ద్రవ్యాణి నవ తే విదుః - ఆత్మతో మొదలుగా ద్రవ్యములు తొమ్మిది అనునది వైశేషికుల తీర్పు' అని తార్కికులలో ఒకవర్గమైన వైశేషికులు ఆత్మ మొదలైన తొమ్మిది వస్తువులను ద్రవ్యములుగ చెప్పినారుగదా!

తత్ర ద్రవ్యాణి పృథివ్యప్తేజోవాయ్వాకాశ దిగాత్మమనాంసి నవైవ (తర్కసంగ్రహమ్-1-3)

[ఈపదార్థములలో పృథివి, జలము, తేజస్సు(అగ్ని), వాయువు, ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, మనసు అను తొమ్మిది వస్తువలే ద్రవ్యములగును] అని తర్కసంగ్రహమందు చెప్పబడినవి. ద్రవ్యములలో ముఖ్యమైనదయిన ఈ ఆత్మనే అనాదికాలముగ నేను అపహరించియుంటిని అంటున్నారు.

**నమ్బినేన్:** ఆశపడినాను. ఇతరులవస్తువులను ఆశపడుటయే అపహారము - దొంగతనము అగును. 'వన్ కళ్వన్ - క్రూరమైన కృత్రిమమును గల నేను' (తి.వా.మొ.5-1-4), 'కళ్వనేన్ ఆనేన్- దొంగతనము చేసినవాడిని అయితిని' (పె.తి.1-1-5) అని ఆవారులుకూడ ఆత్మాపహారమును దొంగతనమని చెప్పుటచే వీరుకూడ వారి అడుగుజాడలలో సాయించుచున్నారు.

యో2_న్యథా సన్తమాత్మాన మన్యథా ప్రతిపద్యతే।
కిం తేనకృతం పాపం చోరేణాత్మాపహారిణా।। (భా.ఉ.42-35)

[భగవానుని శరీరమైయుండు ఆత్మను ఎవడు తనకు స్వంతముగా తలంచునో, అట్టి తలంపు, ఆత్మనపహరించినవాడైన ఆదొంగచేత చెయ్యకూడని పాపము.] అని భారతములోకూడ ఆతామాపహారమును చాలక్రూరమైన పాపముగ చెప్పబడినదిగదా! "ఎంబెరుమానుకు కైంకర్యము చేసియుండక చరమపర్వములోనున్న వారికైంకర్యపరులకు కైంకర్యముచేయుచున్న ఆత్మవస్తువును గదా నేను అపహరించితిని" అనుచున్నారు. ఆయనకు దాస్యము చేయుచుండుట శేషత్వము. వానిదాసులకు దాస్యమును చేయుటవలననే ఈ ఆత్మకు అనన్యార్హశేషత్వము సిద్ధించును. అందుచే అదియే ఆత్మయొక్క సహజగుణము. దొంగతనమువలన వచ్చు పాపము దొంగిలించబడిన వస్తువును బట్టియు, ఎవనివద్దనుండి దొంగిలించబడినది అనినదానిబట్టియు దొంగతనపు క్రౌర్యతయొక్క హెచ్చుతక్కువలు నిర్ణయింపబడును. అందుచే దానికి చేయతగిన శిక్ష, ప్రాయశ్చిత్తములు కూడ వేరువేరుగనుండును. తక్కువవానివస్తువును

అపహరించుటకంటె గొప్పవారివస్తువును దొంగిలించుటచే వచ్చు పాపము తీవ్రమైనది. వెలకట్టుటకు అశక్యమైన ఒకవస్తువును దొంగిలించుట వలన వచ్చు పాపము చాల ఘోరమైనది. ఆటంకపరచుట మొదలైమ తలంపులు, చిన్న వస్తువులను దొంగిలించుటకంటెను, రత్నమును దొంగిలించుటవలన వచ్చు పాపము తీవ్రమైనది. ఇచ్చట అబహరింపబడిన వస్తువు ఆత్మవస్తువు. అది ఎంబెరుమానుని శ్రీకౌస్తుభమణివలె చాల గొప్పది. దానిసొత్తుదారుడైన సర్వేశ్వరుడు అందరికంటెను పైవాడు. అందుచే ఇచ్చటచేయబడిన పాపముకంటె ఘోరమైనది మరియొకటి లేదు.

తృణకాష్ఠాపహారేణ యోదోషః పరికీర్తితః।
స్వర్ణరత్నాపహారోపి తావానేవ భవేత్కథమ్।।
కదాస్వాపహారేణ యోదోషః పరికీర్తితః।
శ్రోత్రియస్వాపహారేపి తావానేవ భవేత్కథమ్।।
ఆత్మవస్తుయతోనర్ఘం ఆత్మేశస్తు పరఃపుమాన్।
తస్మాదస్యాపహారేణ దోషస్యాన్తో నవిద్యతే।।

[గడ్డి, కట్టెలు, మొదలగువాటిని అపహరించిన ఏదోషముండునని చెప్పబడుచున్నదో, ఆదోషమే బంగారము, రత్నము మొదలైనవాటిని అపహరించుటచేత కలుగునా? నీచునిసొత్తును అపహరించిన ఏదోషము చెప్పబడుచున్నదో, అదే దోషము బ్రాహ్మణుని సొత్తును దొంగిలించినచో ఉండుట సాధ్యమా? ఆత్మవస్తువో వెలకట్టలేనిది. ఆత్మను కలవాడో, పరమపురుషుడు. అందుచే, దానిని అపహరించుటవలన వచ్చు దోషమునకు హద్దే లేదు.] అను ప్రమాణము ఇచట అనుసంధింపతగినది. **నమ్బినేన్ మడవారైయుమ్:** ఎంబెరుమానుడు తనది అని కోరుకొనిన ఆత్మవస్తువును అపహరించిన నేను, 'దేహమే ఆత్మ' అని తలచు సంసారులు తమవారిగా అభిమానించు స్త్రీలను కోరుటలో ఏఆశ్చర్యమును లేదు అంటున్నారు. రాజుగారి రత్నమునే అపహరించిన నేను, పేదవాని కట్టెలు, గడ్డిని దొంగిలించుటకు భయపడుదునా? ఎంబెరుమానుడు కోరుకొని ఆనందించు ఆత్మవస్తువును అపహరించితిని, సంసారులు ఆనందించు తమభార్యలనుగూడకోరి అపహరణమును గావించితిని. **మడవార్:** ఇతరుల మంచి వస్తువులు అనునట్లుగా ఇతరులస్త్రీలు అని కూటముగా ఇచ్చట తీసుకొనవలెను. అందుగూడ నాకు తగినవారితో తృప్తిపడక పరదారలనే అపహరించితిని అనునట్లుగ ఇచ్చట భావము. **మున్నెలామ్:** ఈవిధముగ దేహమే ఆత్మయని తలచి, శబ్దాదివిషయములలో అభినివేశమునంది గడచినకాలము ఇంత అని చెప్పవీలగునా? అనినచో, ఈశ్వరునివలె, ఆత్మకూడ నిత్యమైనది. కాలముగూడ మొదలెప్పుడో తెలియనిది, అనాదియైనది. అచిత్తయిన దేహముతో సంబంధము అనాదియైనది. అందుచే దీనికి పూర్వమున్న కాలమంతా ఇటువంటి తప్పులను చేయుటయే అలవాటుగయున్నది అనుచున్నారు. దీనివలన ఇంతవరకూ తమయొక్క అల్పత్వమును తెలిపియున్నారు. ఇక అటువంటి నీచత్వమును గలిగిన తమకు ఆవారులు నిర్హేతుకముగ సాయపడుటను చెప్పుచున్నారు. **శెమ్ పొన్ మాడత్తిరుక్కురు గూర్ నమ్బిక్కు:** ఇటువంటి ప్రారంభంచేత ఆవారుల హద్దులేని గొప్పతనము -విశిష్టత- స్పష్టము చేయ బడుతోంది. ఎంబెరుమానునివలె నాయొక్క పాతనడవడికను పరిశీలించి ఫలమునందించు పూర్తిలేనివారా ఆవారులు? అనాదికాలముగ ఆత్మాపహారముచేయుచు, విషయములందు చిక్కుకొనుచు వచ్చుచున్న నా నడువడి, వీరికి ఫలమును ఈయకపోవుటకు కారణముఅయినను, దానిని లెక్కచేయక, శరణ్యులైనవారియొక్క గొప్పతనముచే, ఫలమునకు సాధనానుష్ఠానము చేసినవారికి ఫలించినట్లుగా ఫలితమును పొందియుండుటను చూచితిని

అంటున్నారు. 'శెమ్ పొన్ మాడత్తిరుక్కురుగూర్ నమ్బి' అని శ్రీకురుకాపురిని వర్ణించుటకు ఈరకముగ ఒక అభిప్రాయముగూడ చెప్పబడుచున్నది. నేను అనుభవించగోరిన విషయములకు అర్థమును వెదకియు, అర్థము గలిగిన స్థలమును వెదకియు, తిరుగుతున్నపుడు ఆకాంతిగలబంగారువంటిమేడలలో దొంగతనమును చేయనారంభించితిని. అచటనేయుంచబడిన మహానిధియైన నమ్మాళ్వారులను చూచి, వారిని మరి వదలలేకపోయితిని అంటున్నారు. 'వైత్తమానిదియామ్ మదుశూదనైయే - స్థాపించబడిన శ్లాఘ్యమైన నిధివలెనున్న మధుసూదనునే' (తి.వా.మొ.6-7-11) అని నమ్మాళ్వారులు తిరుక్కోళూర్ ఎంబెరుమానుని వైత్తమానిది - యుంచబడిన మహానిధి- అన్నారు. అచట అవతరించిన ఈ మధురకవియావారికి నమ్మాళ్వారే వైత్తమానిది అయినారు. అటులగాకుండ ఆవారుల శ్రీపాదములవలె, వారు అవతరించిన తిరునగరిగూడ వీరికి కోరుకొనదగినదియగుటచే 'శెమ్ పొన్ మాడత్తిరుక్కురుగూర్ - కాంతిగల బంగారుమేడలుగల సంపదగలిగిన కురుగూరు-' అని తిరునగరిపైగూడ కవిత్వము చెప్పుచున్నారని భావించవలెను. **ఇన్లు అన్బనాయ్:** దీనికి పూర్వము ఆవారిని ఆశ్రయించు జ్ఞానమే లేకపోయిన నాకు నేనెదురుచూడని, ఆవారులశ్రీపాదములయందు ఒక అభినివేశము ఉన్నట్టుగా తెలిసికొంటిని. అనాదికాలముగ నాదికాని ఆత్మను నాదియని తలంచుట, విషయములయందు చిక్కుకొనుట, ఆవారులను పోగొట్టుకొనుటకు బలమైన కారణముకాగా, నిర్హేతుకముగ కటాక్షించు ఆవారుల గొప్పతనమే నేను ఆవారులను పొందుటకు కారణమైనది. ఇట్టి లాభమునకు నేనుగా ఏప్రయత్నమును చేయకపోగా అట్టిదానికొరకు సాధనానుష్ఠానమును చేయువారికివలె ఈలాభమును పొందితిని. నేను, నాది అనెడి అహంకార మమకారములను అణచివేసి, ఇతరవిషయములందు పట్టును ఛేదించుకొని ఎంబెరుమానునకు కైంకర్యమును చేయుచుండుటను చేయక, అదియే హద్దైన వారిదాసులకు కైంకర్యమును చేయు స్థితియందున్నారు శ్రీమధురకవియావారు.ఇట్లు దశలుదశలుగా ముందుకుపోకుండ, నమ్మాళ్వారిని సేవించినవెంటనే నేను చరమపర్వమైన వారి శ్రీపాదములయందు గాఢమైన అభినివేశమును గలిగినవాడనయితిని అనుచున్నారు ఇచట శ్రీమధురకవులు. **అడియేన్:** నమ్మాళ్వారిగొప్పతనమును తలంచి, 'అహమస్య అవరో భ్రాతా, గుణైర్దాస్యముపాగతః - నేను వీరియొక్క కనిష్ఠసోదరుడను, (నిజముగ) వీరిగుణములచేత దాసుడనైతిని' అనినట్లు ఇళైయపెరుమాళ్(లక్ష్మణస్వామి) పెరుమాళ్ళవద్ద కైంకర్యమునందు మునిగినట్లు వీరుగూడ నమ్మాళ్వారిగుణములకు వశపడి 'దాసుడను' అనినారు. వీరు తిరుక్కురుగూర్ నమ్బి అని నమ్మాళ్వారులను పిలచుటను అనుసరించియే శ్రీవైష్ణవులు ఆచార్యులను పెరియనమ్బి, తిరుక్కోట్టియూర్ నమ్బి అని చెప్పుట జరుగుచున్నది. వీరు నమ్మాళ్వారివిషయమందు 'అడియేన్' అని అనుసంధించుటను అనుసరించి, శ్రీవైష్ణవులు ఆచార్యులు పిలచునపుడు 'అడియేన్' అని బదులు చెప్పుట పద్ధతియైనది. **చదిర్తేన్:** చదిర్ అంటే గొప్పతనము. గొప్పవానిని అయితిని అనినట్లు. ఎంబెరుమానునకి దాస్యము చేయు ఆత్మను తనది అని తలంచుటకును, వారిని తప్పించు ఇతరవిషయములందు అభినివేశమునకును మీదనుదహరించిన చాతుర్యము చెడ్డదే అయిన నీచత్వమేగదా! అట్టి నీచత్వము తగ్గి, ఎంబెరుమానునియందు అభినివేశమును కలిగియుండుటతోనాగక, చివరిహద్దైన నమ్మాళ్వారివరకును సాగునట్టి అభినివేశముచే కలుగు గొప్పతనమును కలిగినవాడనైతిని అని భావము.
ఐదవపాశురమునకు పెరియవాచ్చాన్పిళ్ళైవారి వ్యాఖ్యానవివరణము ముగిసెను.

## నఞ్జీయరువారి వ్యాఖ్యాన విశేషములు.

**పిఱర్ నన్ పొరుళ్:** ఆత్మయు, పరమాత్మయు, ఒకటేయని అభేదశ్రుతులును, ఆత్మయు పరమాత్మయు, వేఱువేఱనియు చెప్పు భేదశ్రుతులున్నప్పటికిని, శరీరాత్మభావమును చెప్పు ఘటకశ్రుతులను తీసుకొని

భేదమే సిద్ధాంతము అని చూపుటకు 'పిఱర్ నన్ పొరుళ్' అంటున్నారు. పొరుళ్ అంటే ఆత్మలోనున్న దుర్గుణములైన ఆటంకములను వేఱుచేయుటకు ఆగుణములతోకూడిన ద్రవ్యమయియుండు ఆత్మ అని చూపుచున్నారు. 'నన్ పొరుళ్' అనుటచే ఆత్మకు ఎంబెరుమానుని శరీరము అయియుండు మంచి స్వభావము ఉండును అని స్పష్టపరచుచున్నారు. **నమ్బినేన్ మడవారైయుమ్:**

అనన్యసాధ్యే స్వాభీష్టే మహావిశ్వాసపూర్వకం।

తదేకోపాయతాయాఞ్చాప్రపత్తిః శరణాగతిః।। (భరతమునిలక్షణ - విష్వక్సంహి)

[తనయొక్క ఇష్టము వేరొకరిచేత జరగనపుడు మహావిశ్వాసముతో వానినొక్కనినే ఉపాయముగా ఉండవలెనని యాచించుట ప్రపత్తి. అదియే శరణాగతి] అనినప్రకారము, ఎంబెరుమానుని విషయమందు మహావిశ్వాసముతో ఆయనయే మనకు సర్వము అని ఆశ్రయించవలసియుండగా స్త్రీలయందు అట్టివిశ్వాసమును కలిగియుంటిని అనుచున్నారు మధురకవులు. **అడియేన్ చదిర్త్తేన్ ఇన్ఱే:** స్త్రీలను నమ్మి చెడిపోయిన (విశేషతను పాడుచేసుకొనిన) నేను నమ్మాళ్వారిని ఆశ్రయించి, విశిష్టతను కలిగినవాడ నయితిని అనుచున్నారు.

నఞ్జీయరువారి వ్యాఖ్యానవిశేషములుపూర్తి అయినవి.

## అగియమణవాళప్పెరుమాళ్ నాయనారువారి వ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక:** అర్థమును వెతుకుటకును, విషయములననుభవించుటకును దేశమంతను చుట్టివచ్చుసరికి వెలిగిపోతున్న బంగారువంటి మేడలుగల తిరుక్కురుగూరును చూచి, ఇచ్చట అవి లభించునని వచ్చితిని, ఆయూరికి నిర్వాహకులైన నమ్మాళ్వారుల శ్రీపాదములయందు ప్రీతికలిగి, అర్థకామములయందుగల పట్టువదలిపోయినది అనుచున్నారు.

**వ్యాఖ్యానము:** పొరుళ్: "సత్యంచానృతంచ సత్యమభవత్ - వికారము చెందకపోవుటచే సత్యము -ఉన్నది- అనబడు ఆత్మగను, మార్పుగలదియగుటచే అనృతము -లేనిది- అనబడు అచిత్తుగను, అయి మార్పు(వికారము) లేనిదిగనే యున్నది బ్రహ్మము" అని ఉపనిషత్తులయందును, "ఉళ్ళదు - ఉన్నది" (తి.వా.మొ 1-2-4) అని సాయించుటచేతను, చెప్పిన విధముగ మార్పులేని సత్యమను వస్తువగుటచే, ఆత్మను పొరుళ్ అనుచున్నారు. 'ఎణ్ పెరుక్కు అన్నలత్తు ఒణ్ పొరుళ్ - లెక్కకు మించిన ఆయానందముగల తేజోవంతమైన వస్తువు' (తి.వా.మొ.1-2-10) అని నమ్మాళ్వారుగూడ ఈఆత్మవస్తువునే పొరుళ్ అన్నారుగదా! "మేమ్ పొరుళ్ - అతిశయముగలిగిన ద్రవ్యము" (తిరుమాలై-38) అని చెప్పినటువంటి సందర్భములలో అచేతనమైన దేహమును, నిజమైనదగుటచేత 'పొరుళ్' అనిచెప్పినను, దానివలె, అనిత్యమయి, ఎల్లప్పుడును మార్పుచెందుతూ ఉండేదయి, అతినీచమైనదియు, జ్ఞానము, సుఖము, లేనిదయి ప్రీతియైనదికాక నిత్యమై వికారము లేనిదై అత్యున్నతమైనదై, సహజమైన జ్ఞానానందములు గలదియై స్వభావరీత్యా ప్రీతికలిగించుటచే ఆత్మనే 'నన్ పొరుళ్ - మంచి వస్తువు' అనుచున్నారు. 'పొరుళ్ - వస్తువు, ద్రవ్యము' అని అన్నట్లయితే అది అచేతనమును చెప్పును. అట్లు చెప్పుటకు వీలునివ్వకుండుటకు 'నన్ పొరుళ్' అని ఆత్మను చెప్పుచున్నారు. "పిఱర్ నన్ పొరుళ్ - ఇతరుల మంచిద్రవ్యము" అని ఎంబెరుమానుని శరీరమగుటచే ఈఆత్మ సర్వేశ్వరునికంటె వేఱైనది అని చూపుచున్నారు. తనంతట తానే ప్రకాశించు జ్ఞానమగుటచే ఆత్మ అచిత్తుకంటె భిన్నమైయుండును. ఎంబెరుమానునకు శరీరముగానుండుటచే ఎంబెరుమానునికంటె వేఱైనదిగా యున్నది. శరీరముతోనున్న ఆత్మయగుటచే శరీరము అను అచిత్తుకంటెను వేఱైనదిగాయున్నది. తాను ఎంబెరుమానునకు శరీరమయియుండుటచే ఎంబెరుమానునికంటెను

ఇతరమైనదిగానున్నది. అనుభవించు భోక్త అయియుండుటచే అనుభవములేని అచిత్తుకంటెను అన్యమైనది. తాను ఎంబెరుమానునకు భోగ్యమయి (ప్రీతికరమైన వస్తువై) యుండుటచే ఈశ్వరునికెంటెను వేఱైనదిగా యుండును. **పిఱర్ నన్ పొరుళ్:** 'పిఱర్' అని స్వామియొక్క విశిష్టతను 'నన్ పొరుళ్' అని శరీరముయొక్క విశిష్టతను చూపుచున్నారు. ఆత్మ అనునది దేహము, ఇంద్రియము, మనస్సు, ప్రాణము, బుద్ధి మొదలైనవాటికంటె వేఱైనదియగుటచే 'నన్ పొరుళ్ - మంచి వస్తువు' అని అంటున్నారు. ఎంబెరుమానుడు, ప్రధానము, అవ్యక్తము అనబడు మూడుగుణములుగల మూలప్రకృతిని, కాలము అనబడు మూడుగుణములు లేని అచేతనవస్తువును, పురుషుడు అనబడు ఆత్మలగు చిత్తుకంటెను వేఱైనదియగుటచే ఆయనను 'పిఱర్' అనుదురు.

"పిఱర్ నన్ పొరుళ్ తన్నైయుమ్ నమ్బినేన్" - ఎంబెరుమానుని సొత్తైన ఆత్మను తనదిగా అభిమానించు ఆత్మాపహారమును ఇచ్చట చెప్పినట్లయనచో దేహమునే ఆత్మయని దేహాత్మాభిమానమును చెప్పినట్లగును. అటువంటివాడు ఇతరులద్రవ్యములను ఆశపడుట స్వభావమగుటచే ఇచట 'పిఱర్ నన్ పొరుళ్ తన్నైయుమ్ నమ్బినేన్' అని ఇతరుల ద్రవ్యములను అపహరించుటను చెప్పినదిగా తీసుకొనబడును. దానినే 'నన్ పొరుళ్ - మంచివస్తువు- ద్రవ్యము' అనెదమా? అనినచో దానినే తీసుకొనేవారు అది విశిష్టమైనదిగా తలంచుటచే అటులనే చెప్పవలెను. వారివస్తువులయందు ఎక్కువ విలువలేని వస్తువులను అపహరించక వారు ఎక్కువవిలువఉన్నదిగా తలంచిన వస్తువులను అపహరించితిని అని భావము. **నమ్బినేన్ మడవారైయుమ్:** దేహమే ఆత్మయని తలంచుటచే ఆత్మజ్ఞానము కలిగినవారికి పరమాత్మయే పురుషార్థమైయుండునట్లు శరీరమునకు శరీరమే భోగ్యమైనదియగుటచే పరస్త్రీశరీరములను ప్రీతికరమైనవిగా తలంచి ఆశపడినాను. **మడవారైయుమ్:**మంచిగుణములు కలవారై పతివ్రతలుగాయున్న యువతులు-(14నుండి 19సం.ల వయసులోనున్నవారు) వారినే ఆశపడితిని అని తీసుకొనవలెను. **మడవార్:** వారియొక్క సౌమ్యత అనబడు మృదుత్వమును, సౌందర్యమును చూసి పరపురుషులను మోహపరచు సామాన్యస్త్రీలను ఆశపడినాను అనికూడ తీసుకొనవచ్చును. 'మడవార్' అనెడి బహువచనప్రయోగముచే ఒకస్త్రీతో తృప్తిచెందక అనేకులను ఆశపడుటను చెప్పుటయైనది.

నజాతు కామః కామానాముపభోగేన శామ్యతి।
హవిషా కృష్ణవర్త్మేవ భూయేవాపి వర్ధతే।। (వి.పు. 4-10-23)

[కాముకుల కామము, అనుభవించుటచే ఒక్కసారిగూడ శాంతించదు. హవిస్సుచే (వృద్ధిచెందుచున్న) అగ్నివలె తిరిగి తిరిగి వృద్ధిచెందును] అని స్త్రీచాపల్యము అనుభవించగా అనుభవించగా వృద్ధిచెందునది యగుటచే అనేకులను ఆశపడితిని- కోరితిని అనికూడ తీసుకొనవచ్చును. పాశురములో మొదటి రెండు పాదములచేతను స్వతంత్రముకాని ఆత్మను స్వతంత్రముగ భావించియుండ, ఆత్మకాని దేహమును ఆత్మయని తలంచుట ఫలముకాని అర్థకామములందు (వస్తువుల ప్రీతియందు) గొప్పఫలము అనెడి తలంపు కలుగుట మొదలగు దోషమును ప్రకాశింపజేయు అన్నింటిని కలిగినవాడను అనుచున్నారు.

**శెమ్ పొన్ మాడత్తిరుక్కురుగూర్:** -శెమ్ పొన్ మాడమ్- కాంతిగల బంగారువంటి మేడలు అనుటచే ఇచ్చటికే పోయి వస్తువులను అనుభవించవచ్చును, 'నగర్' అగుటచే నాగరీకులైన స్త్రీలను అనుభవించవచ్చునని తలంచి ఊరిలో ప్రవేశించితిని. ఊరికి నిర్వాహకులైన నమ్మాళ్వారులు శ్రీమదష్టాక్షరిని వశముచేసికొనినవారగుటచే అచట దొంగలు తిరుగాడుటకు వీలుకాకపోవుటచే నాకుగూడ ఆవారిని సేవించినంతనే దురాలోచనలు నశించి నమ్మాళ్వారిపరిపూర్ణతను చూచి వారికి ప్రీతిపాత్రుడనైతిని. **నమ్బికుక్కు**

**అన్బనాయ్:** అర్థకామములలోనుండు ఆనందమును ఆవారులవద్ద చూచినందువలననే వారికే ప్రీతిపాత్రుడనైయుంటిని. **నమ్బిక్కు అన్బనాయ్ అడియేన్:** నమ్మావారు శ్రీఅష్టాక్షరిని చేతియందుంచుకొనినవారగుటచే వారి కటాక్షమాత్రముచే ఆఅష్టాక్షరియొక్క మూడు పదముల అర్థముయందు (అదిగూడ వారిని విడచి) అభినివేశము గలవాడినైతిని.మధ్యమపదమైన నమశ్శబ్దార్థమైన భగవద్దాసులకు కైంకర్యముచేయు విషయమందు వారు ఎంబెరుమానుకు దాస్యమును చేయుటతోబాటు భాగవతదాస్యమునుగూడ స్వీకరించినారు. నేనును, నమ్మావారికే దాస్యముచేయు వాడనైతిని. **ఇన్దే:** ఎంబెరుమానుని ఆశ్రయించియుండుటచే క్రమముగ ముందుకు పోయి పరమపదమును చేరిన పిదప అనుభవమును పొందవలెను. నేను నమ్మావారులసంబంధముచే అట్టి అనుభవమును ఇచటనే పొందితిని. ఆనాడు ఈశ్వరసంబంధము ఉండియు, సంసారినైతిని. ఈనాడు కేవలము ఆవారిసంబంధపు ఔన్నత్యముచే మహాలాభమును పొందితిని.

ఐదవపాశురవ్యాఖ్యానవివరణములు ముగిసినవి.

**6.** **ఇన్ఱు తొట్టు మెర్ఱుమైయుమ్ ఎమ్బిరాన్**
**నిన్ఱు తన్పుగఴేత్తవరుళినాన్**
**కున్ఱమాడత్తిరుక్కురుగూర్ నమ్బి**
**ఎన్ఱు మెన్నై యిగఴ్వివిలన్ కాణ్మినే.**

**ప్రతిపదార్థము: ఇన్ఱు తొట్టుమ్:** ఈనాటినుండి, **ఎర్ఱుమైయుమ్:** భవిష్యత్తులో, **నిన్ఱు:** స్థిరముగ, **తన్ పుగఴ్:** ఆఴ్వారుల శ్రీమంతమైన, **ఏత్త:** (నేను) స్తుతించుటకు, **ఎమ్బిరాన్ అరుళినాన్:** నా స్వామియైన నమ్మాఴ్వారు కృపజేసిరి, **కున్ఱమ్ మాడమ్:** పర్వతమునవలె బాగ ఎత్తుగనున్నమేడలుగల, **తిరుక్కురుగూర్ నమ్బి:** తిరుకురుకాపురికి నిర్వాహకులైన నమ్మావారులు, **ఎన్ఱుమ్:** (ఇక) అన్నికాలములలోను, **ఎన్నై:** నావిషయమందు, **ఇగఴ్వు ఇలన్:** అనాదరముతో నుండలేకపోవుచున్నారు. **కాణ్మిన్:** దీనిని (అనుభవించుటలో) చూడుడు.

పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యాన వివరణము.

**అవతారిక:** "కురుగూర్ నమ్బిక్కు అన్బనాయ్ అడియేన్ చదిర్త్తేన్ ఇన్దే" అని - నమ్మాఴ్వారు ఇచటనే ఇప్పుడే మిమ్ములను కటాక్షించినారు అని చెప్పినారు. అయినను, మీరు అనాదికాలముగ శబ్దాదివిషయములలో పండిపోయినవారగుటచే ఆశబ్దాదివిషయములు మిమ్ములను మరియొకసారి జయించినచో మీరేమిచేతురు? అను ప్రశ్నరాగా, అట్లు మరియొకసారి అవివచ్చి నన్ను జయించ నవకాశములేకుండగ ఆఴ్వారు నన్ను కటాక్షించినారు. ఎల్లవేళలయందును నేను వాటిని జయించునట్లుగనే ఆవారులు నాకు కటాక్షమును ప్రసాదించినారు అనుచున్నారు ఈపాశురములో.

ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ ఉషిత్వా శాశ్వతీసమాః।
శుచీనాం శ్రీమతాంగేహే యోగభ్రష్టోపి జాయతే।। (భ.గీ. 6-14)

[యోగమును ప్రాంభించిన తరువాత దానినుండి జారినవాడు (యోగమాహాత్మ్యముచేతనే) పుణ్యము చేయువారిలోకములను పొంది దీర్ఘకాలము సుఖముగ జీవించి శుచిగలవారును, గుణానందసంపదగలవారై గొప్పవారి గృహమందు జన్మించును] అని భగవద్గీతయందును,

సమాధిభఙ్గస్తస్యాసీత్ తన్మయత్వా ధృతాత్మనః।

సంత్యక్తరాజ్యభోగర్ధి స్వజనస్యాపి భూపతేః।। (వి.పు.2-13-29)
[లేడినే మనసులో తలంచుచున్న ఆరాజునకు రాజ్యము, ఐశ్వర్యము, బంధువులు మొదలైన అన్నింటిని వదలినవారైనను, సమాధికి భంగము కలిగెను] అని శ్రీవిష్ణుపురాణమందును, చెప్పిన విధముగ ఆకృప చేజారిపోవుటకు అవకాశమున్నది. కాని నమ్మాళ్వారికృప అటువంటిది కాదు అని వారికృపావిశేషమును చెప్పుచున్నారు.

**వ్యాఖ్యానము: ఇన్ఱు తొట్టుమ్:** నమ్మాళ్వారునన్ను కటాక్షించిన ఈనాటినుండియు. ఎంబెరుమానుని చేరినచో ఆయనను చేరిన వెంటనే ఫలము లభించును అని చెప్పుటకు వీలుగాదు. ఆశ్రయించి చాలకాలము గడచినతరువాతనే ఫలము లభించును. కాని ఆళ్వారివిషయమున అటులగాదు. ఆళ్వారులు కటాక్షించిన ఈనాడు మొదలుకొని, వారిని అనుభవించు ఫలానుభవకాలముగనే యున్నదిగద! **ఎழுமైయుమ్:** ఏడుజన్మములందును. ఈపదము వచ్చెడి కాలములన్నింటికిని ఉపలక్షణము. **ఎమ్బిరాన్:** నాకు ఉపకారకుడు, లేదా నాకు స్వామి అనికూడ చెప్పుకోవచ్చును. 'పిరాన్ పెరునిలమ్ కీణ్డవన్- ఉపకారకుడై గొప్పభూమిని (అండభిత్తి అడుగునుండి) విడదీసినాడు.' (తి.వా.మొ. 1-7-6) అని ఎంబెరుమానుని విషయమందు ఆళ్వారు చెప్పు మాటనే ఆఎంబెరుమానునికి, ఉపకారముచేయువార గుటచే ఆళ్వారులవిషయమందు చెప్పుచున్నారు. **నిన్ఱు: ఒకవిధముగ నిలచి.** ఎంబెరుమానుకు ఉపకరించువారు అనుకారణముచే ఆఎంబెరుమానుని పొందినవెంటనే వానిని అను భవింపప్రారంభించునట్లుండక, ఎల్లవేళలందును ఆళ్వారులననుభవించుటయే అయి నడచుచున్నది అని భావము. **తన్ పుగழ் ఏత్త:** తనకీర్తినే స్తుతించునట్లు. 'పెరుమాయన్' - మహాశ్చర్యకరమైన చేష్టలు చేయువాడు- అని ఎంబెరుమానుని స్తుతించుచున్నారే అనినచో ఆళ్వారులకీర్తిని అనుభవించుట యందే ఎంబెరుమానుని కీర్తిగూడ ఇమిడియుండుటచే 'తన్ పుగழ్' అనుటలో దోషములేదు. **అరుళినాన్** అనునపుడు ఒకపెట్టుబడిని ఎదురుచూడకనే తానే కృపజేసినారు. "మయర్వఱ మదినలమ్ అరుళినాన్ -అజ్ఞానమునశించునట్లు భక్తిరూపాపన్నజ్ఞానమును కృపజేసినవాడు" (తి.వా.మొ.1-1-1) అని ఆళ్వారు ఎంబెరుమానునివిషయమందు చెప్పినమాటనే, మధురకవులు నమ్మాళ్వారివిషయమందు చెప్పుచున్నారు. **కున్ఱమాడత్తిరుక్కురుగూర్ నమ్బి:** కొండలవంటి మేడలుగల తిరుకురుకాపురికి నిర్వాహకులైన పరిపూర్ణులు. నమ్మాళ్వారి పూర్ణత తమను స్తుతించి, దానితోబాటు మరియొకరిని (ఎంబెరుమానుని) స్తుతించునట్టిదిగాదు. "కున్ఱమ్పోల్ మణిమాడ నీడు తిరుక్కురుగూర్ - కొండవంటి మణిమయమైన మేడలు ఎత్తుగనున్న శ్రీకురుకాపురి" (తి.వా.మొ.4-10-1) అని ఆళ్వారు కటాక్షించుట వీరిమనసునందు బాగుగ నాటియుండుటచే దానినే వీరు కటాక్షించుచున్నారు.**ఎన్ఱుమ్ ఎన్నై ఇగழ్విలన్:** అని ఎప్పుడును అనాదరించలేకపోవుచున్నాడు. నన్ను అనాదరించలేకపోవుచున్నాడు అని రెండు పదములతోను ఇగழ్విలన్ అనుపదమును కలుపుకొని అర్థము చెప్పుకొనవలెను. అనగా, నాఆత్మఉన్నసర్వకాలములందును, నేను మఱల వేఱొక విషయమందు చిక్కుపడేందుకు నన్ను వదలలేకుండయున్నారు. నా అథోగతిని గమనించకుండ, నన్ను రక్షించువారు నేను ఇతరవిషయమందు చిక్కుకొనునట్లుగ వదలివేతురా? తమశ్రీపాదములు తప్పవేఱొక ఆశ్రయములేకయున్న నన్ను నేనే అడ్డుకొన తలంచినను, నన్ను వదలివేతురా? **కాణ్మినే:** ఇది ఎదురుగ కనబడుచున్న విషయమైయుండగ ఆవారుల గొప్పతనమును నేను చెప్పవలెనని అడుగవలసిన ఆవశ్యకత లేదుగదా! అని అంటున్నారు.

ఆరవపాశురమునకు పెరియవాచ్చాన్పిళ్లైవ్యాఖ్యానవివరణము పూర్తియైనది.

## నఞ్జీయరువ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక:** "అడియేన్ చదిర్తేన్ ఇన్తే" అని ఫలమును పొందినట్లుగ చెప్పినారు, అది ఎట్లయినది? అని ప్రశ్నరాగా, 'వీవిల్ కాలమ్ ఇశైమాలైగళ్ ఏత్తి మేవప్పెఱ్ఱేన్ - విచ్ఛిన్నములేని కాలమంతయు, గానముతోకూడిన శబ్దము అనెడి రాగమాలికలతో స్తుతించి అనుభవించుభాగ్యమును పొందితిని' (తి.వా.మొ. 4-5-3) అని ఆళ్వారులు ఎంబెరుమానుని విషయముగ కృపజేసినట్లు కాలమున్నంత వరకును- అని ఆళ్వారులు తమను స్తుతించునట్లు చేసినారు అనుచున్నారు ఈపాశురమందు.

**వ్యాఖ్యానము: ఇన్ఱు తొట్టుమ్:** ఎంబెరుమానుని కంటెను ఆళ్వారే ఉద్దేశ్యులని రుచిపుట్టిన ఈనాటినుండి. **ఎమైయుమ్ ఎమ్బిరాన్:** భవిష్యత్కాలంలోకూడ విచ్ఛిన్నత లేకుండ నాకు ఉపకరించిన ఆవారు. గతించినకాలమందుగూడ నాకు రుచిలేకపోవుటచే వారిఆశ్రయమును పోగొట్టుకొంటిని. **నిన్ఱు:** ప్రథమపర్వమైన ఎంబెరుమానుడే అయియుండినచో అందు స్థిరముగనుండలేక పోవలసివచ్చును.కాని చరమస్థానమందు ప్రవేశించిన నేను స్థిరముగ నిలచితిని. "మానిడమ్ పాడవన్ద కవియేనల్లేన్ - మనుజుని స్తుతంచుటకువచ్చిన కవినిగాను" (తి.వా.మొ.3-9-9) అని ఆవారులు కవిత్వము చెపునపుడు మనుజులను తప్పించినారు. వీరు ఎంబెరుమానునే తప్పించినారు. **కున్ఱమాడత్తిరుక్కురుగూర్ నమ్బి:** ఎల్లలేని ఆవారులపూర్ణతవలె మేడల ఔన్నత్యముగూడ హద్దుకనపడనిదా అనినట్లుగ **ఎన్ఱుమ్ ఎన్నై ఇగళ్విలన్:** తాము ఆళ్వారిని స్తుతించుటకు కారణమును చెప్పుచున్నారు. ఆవారుల పూర్వపు స్థితియే వీరిచేత మాటాడించుచున్నది. **కాణ్మినే:** మీవలె భగవంతుని విషయమునందు కవిత్వముగాకుండ నేను నమ్మావారివిషయమందు కవిత్వమునుచెప్పుటను చూడలేకపోవుచున్నారా? అని ఇతరఆవారులను ఉద్దేశించి చెప్పుచున్నారు.

నఞ్జీయర్ వ్యాఖ్యానవిశేషములు పూర్తియైనవి.

## అగియమణవాళప్పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక:** వెనుకటి పాశురమందు ఆళ్వారుల శ్రీపాదములయందు తమకుగల జ్ఞానభక్తులను చెప్పినారు. ఈపాశురమందు వారివిషయమందు తమకుగల నిశ్చయమును చెప్పుచున్నారు.

**వ్యాఖ్యానము: ఇన్ఱు తొట్టుమ్:** నాదోషమే పెట్టుబడిగా నన్ను చేరదీసిననాటినుండి, **ఎழுమైయుమ్:** పరమపదమునందుగూడ ఆళ్వారిశ్రీపాదములనే ఆశ్రయించినవారువీరు. మేనమామగారింటికివెళ్ళు భరతుని అనుసరించిన శత్రుఘ్నాళ్వానువలె యున్నవారు వీరు. **ఎమ్బిరాన్:** నాకు స్వామియైనవారు - పిరాన్=స్వామి. సొత్తుకు స్వంతదారులు దానిలోయుండు లోపముచూసి దానిని వదలుకొందురా? **ఎழுమైయుమ్ ఎమ్బిరాన్:** ఒకసమయంలో ఎంబెరుమానుని సొత్తగుటయు, మరియొకసమయమందు ఆళ్వారులసొత్తగుటయు కాక ఎల్లకాలములయందును తమను ఆళ్వారులసొత్తగనే తలంచినవారు వీరు. **ఎమ్బిరాన్:** ఎంబెరుమానునివద్దకు తీసుకువెళ్ళి చూపనవసరములేకుండ తామే నన్ను చేరదీసిన మహోపకారకులు. పిరాన్= ఉపకారకులు. ఆఉపకారమును వివరించుచున్నారికపై **నిన్ఱు తన్ పుగழ் ఏత్త అరుళినాన్** అంటూ. **ఏత్త:** నఱ్పూవై పూవిన్ఱవణ్ణన్ పుగழ் -ఇయఱ్ఱువాయ్ (పెరియ తిరువం.1) అని మొదలుపెట్టి 'మొయ్ కழల్ ఏత్తముయల్ (పెరియ తిరువం. 87) అనెడి ఆఖరిపాశురమువరకును స్తుతించప్రయత్నమును వదలిన ఆళ్వారులవలెకాక పతకమువంటి ఈపాశురమందు నూటికి నూరు

పాళ్ళుగ (పరిపూర్ణముగ) తాము ఆళ్వారులను స్తుతించు విధానమును సాయించుచున్నారు. **తన్ పుగழ் ఏత్త:** ఎంబెరుమానునిగుణములవలె దోషమునుచూసి, చూచినదానికి తగిన శిక్షవిధించునట్టివా ఆళ్వారుల గుణములు? "అన్నైయాయ్, అత్తనాయ్ ఎన్నై ఆణ్డిడుమ్ తన్మైయాన్" అని నాదోషమునే గుణముగ స్వీకరించినవారుగదా ఆళ్వారు! **తన్ పుగழ்ఏత్త అరుళినాన్:** ఆళ్వారులవిషయమందు తాము చెప్పిన కవిత్వమును వినిపించు కైంకర్యమునకు సాధనము ఆళ్వారుల కృపయే అని నిశ్చయించినారు. నిన్ఱు తన్ పుగழ் ఏత్త అరుళినాన్- ఆళ్వారుల గుణములను పొగడుటయే లాభము. అది సిద్ధించుటయు వారి అనుగ్రహమువలననే కలుగును అని నిశ్చయించినవారై స్తుతించునట్లు ఆళ్వారులు చేసినారు.

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః।

మునే వక్ష్యామ్యహం, బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః।। (రా.బా.కాం.1-7)

[మునివరా! మీచే కీర్తింపబడిన గుణములు పొందుటకు దుర్లభమైనవియు, అనేకములుగను యున్నవి. అట్టి గుణములు కలమనుజుని నేను స్పష్టముగ తెలిసికొని చెప్పెదును వినుడు.] అని రాముని గుణములను అడిగిన నారదునివలె వీరికిగూడ ఆళ్వారులగుణములను అనుసంధించుటచే 'కాలాఴుమ్, నెఞ్జழியుమ్ కణ్ శుழలుమ్ - కాలు కూరుకుపోవును, మనస్సు శిథిలమగును, కళ్ళు తిరుగును' (పెరియ తిరువం.34) అను స్థితి ఏర్పడుటచే మనస్సును నిలకడగచేసి స్తుతించగలిగినట్లు కటాక్షించినారు అని అర్థమును గ్రహించవలెను. **ఎన్నుమ్ ఎన్నై ఇగழ்విలన్:** నాకు దోషము ఎక్కువగనుండుటయో లేక గుణము మిక్కుటమగుటయో అనెడి భేదమును లెక్కలోకి తీసుకొని నన్ను అనాదరించుట, ఆళ్వారు చేయలేదు. **కున్ఱమాడ... ఎన్నై ఇగழ்విలన్:** కొండలవంటి కదలని నిశ్చలమైన అట్టి మేడలకు చలనము కలిగినను, ఆళ్వారి మనసులో నావిషయమందు చలనము కలుగదు. **కాణ్మినే:**

ఆరభ్యతే నఖలు విఘ్నభయేన నీచైః, ఆరభ్య విఘ్నవిహతాః విరమంతిమధ్యాః।।

విఘ్నైః పునఃపునరపి ప్రతిహన్యమానాః ప్రారబ్ధముత్తమగుణా నపరిత్యజన్తి।। (నీతిశతకము72)

[నీచులు ఆటంకములకు భయపడి కార్యమునారంభింపరు. మధ్యములు కార్యమును ఆరంభించినపిదప ఆటంకములు వచ్చి అడ్డు తగులుటచే మధ్యలో వదలివేయుదురు. ఉత్తములు ప్రాంభించిన కార్యమును ఎన్ని ఆటంకములు అడ్డుకొనినను, (పూర్తిచేయకుండ) వదలరు.] అనియును "పాణనార్ తిణ్ణమిరుక్క ఇని ఇవళ్ నాణుమో - పాడువారు మంచెపైనుండగా ఈమె ఇకసిగ్గుపడునా" (పెరియ తిరు. 8-2-2) అను ప్రమాణములు చెప్పువిధముగ ఆవారు ఇప్పటివలెనే ఎప్పుడును నన్ను వదలరు అనునది మీరే చూడవచ్చును.

ఆరవపాశురమునకు వ్యాఖ్యానవిశేషములు పూర్తియైనవి.

7. **కణ్డుకొణ్డెన్నైక్కారిమాఱప్పిరాన్**
**పణ్డై వల్వినై పాற்றி యరుళినాన్**
**ఎణ్డిశైయుమఱియ వియమ్బుగేన్**
**ఒణ్ డమిழ் చ్చడగోపన్ అరుళాయే.**

**ప్రతిపదార్థము. పిరాన్:** పరమోపకారకులయి, **కారిమాఱన్:** పొఱ్ఱారుల కుమారులైన నమ్మాళ్వారు, **ఎన్నై:** (వారి గొప్పతనమును తెలియని) నన్ను, **కణ్డు:** కటాక్షించి, **కొణ్డు:** స్వీకరించి, **పణ్డై వల్ వినై:** అనాదియైన, మిక్కిలి బలిష్టములైన, పాపములను, **పా అరుళినాన్:** నాశమై పోవునట్లు పోగొట్టి కటాక్షించినారు, (అందుచే)

**ఒణ్ తమిழ్ చడగోపన్ అరుళైయే:** అందమైన తమిళభాషాకవిత్వమునకు స్థానమైన నమ్మాழ்వారుల కటాక్షమే **ఎణ్ దిశైయుమ్:** ఎనిమిది దిక్కులయందునున్న వారందరును **అఱియ:** తెలుసుకొనునట్లు, **ఇయమ్బుగేన్:** చెప్పగలను.

## పెరియవాచ్చాన్పిళ్ళైవ్యాఖ్యానవివరణము.

**అవతారిక:** వెనుకపాశురమందు మధురకవియాழ்వారు తమను నిర్హేతుకముగ రక్షించుటను అనుసంధించినారు. ఇతరులకును ఈవిధముగ నమ్మాழ்వారి కటాక్షమునకు పాత్రులుగ అర్హులైనను, వారు దానిని పోగొట్టుకొనుటకు కారణము, వారు ఆழ்వారిగొప్పతనమును తెలుసుకొననందుననే అని నిశ్చయమునకు వచ్చి ఈపాశురములో వారిమహత్వమును అందరును తెలుసుకొనునట్లు చెప్పెదను అనుచున్నారు.

**వ్యాఖ్యానము: కణ్డు కొణ్డు:** నేను ఆవారులను చేరినంతనే, వారిమనస్సు నిధిని పొందినట్లు అయినది అనుచున్నారు.అట్లుగాకుండ, తమను పొందుటకు నమ్మాழ்వారు వీరిని వెదుకుకుంటూ తిరుగుచుంటిరి అని తోచుచున్నదని కూడ భావించవచ్చును.

నిమజ్జతోనన్త భవార్ణవాన్తః చిరాయ మే కూలమివాసి లబ్ధః।

త్వయాపి లబ్ధం భగవన్నిదానీం అనుత్తమం పాత్రమిదం దయాయాః।। (స్తో.ర.24)

[దేశముచేతను, కాలముచేతను, వస్తువుచేతను పరిమితి నిశ్చయించవీలుకాని నా ఉపకారకుడా! సంసారసాగరమందు చాసకాలము అణచియుంచబడిన నాకు ఒడ్డువలె నీవు లభించినావు. ఓభగవానుడా! నీకుగూడ ఇప్పుడు నీకృపకు అర్హ మైన పాత్రముగ దాసుడను ఈవస్తువు లభించినది.] అని ఆళవందారు ఎంబెరుమానుని కృపకు తమను సాటిలేని పాత్రమని చెప్పినట్లు వీరు (మధురకవులు) ఆழ்వారి కటాక్షమునకు తమను సాటిలేని పాత్రముగా చెప్పుచున్నారు. తాము దోషములు పూర్తిగా కలవాడగుటచే తామే ఆழ்వారుల కృపకు ఉత్తమమైన అర్హుడని దీని భావము. **ఎన్నై:** "అఱియ ఇయమ్బుగేన్ - తెలుసుకొనుటకు చెప్పుచున్నాను" అనునపుడు 'ఎన్నై' అను పదము సిద్ధించునుగదా! వేరే చెప్పవలసిన అవసరమున్నదా? అనినచో, రెండు విధములైన నీచత్వము తమకు ఉండుటను చెలియచేయుటకు చెప్పుచున్నారు. ఆనీచత్వములేవన: 1. ఆవారులను పొందునపుడు సంసారులకంటె ను వారికిగల విశిష్టతను తెలియకపోవుట, 2. ఆవారుల నిర్హేతుకమైన కటాక్షమును ఇట్టిది అని తెలియుటకు తగిన స్వభావము(గుణము) లేకపోవుట. **కారిమాఱప్పిరాన్:** 'కారిమాఱన్' అనినచో సరిపోయినను, ఆవారు తమవిషయమందు చేసిన ఉపకారమును తలంచుకొని పిరాన్ - ఉపకారకుడు- అంటున్నారు. పిరాన్ అని సామాన్యంగా చెప్పితే ఆవారికి ఉపకరించిన ఎంబెరుమానుని కూడ చెప్పును గనుక నమ్మావారినే చెప్పుటకు కారిమాఱప్పిరాన్ అనుచున్నారు.

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరం।

సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి।। (భ.గీ. 5-29)

[యజ్ఞములను, తపములను అనుభవించువాడును, అన్నిలోకములకును ఈశ్వరుడును, అన్ని జీవరాసులకును సహృత్తును, అయిన నన్ను తెలిసికొని, శాంతిని పొందును.] అనిన ప్రకారము సర్వేశ్వరుడు అందరికిని ఉపకరించుట సామాన్యము గదా! అట్లు అందరికిని సామాన్యమయియుండక వీరు తమకే ఉపకరింతురు అని చెప్పుటకు కారిమాఱన్ అని విశేషముగ చెప్పినారు. **పణ్డై వల్ వినై:** అనాదికాలముగ తమతోకూడియున్నదై శబ్దాదివిషయములందు చిక్కుకొనునట్లు చేయు పాపము. శూర్పణఖవలె

తగినవిషయమును ఆశ్రయయించినను, పిరాట్టిని అడ్డుకొని పెరుమాళ్లను వరించునట్టు చేయు పాపము, ప్రథమపర్వమైన ఎంబెరుమానుడే పురుషార్థము అను తలంపుకు కారణమైన పాపము, మొదలగువాటిని అనాదియైన బలమైనపాపములు అనిచెప్పుదురు. ఈపాపములను ప్రాయశ్చిత్తములతో కూడ పోగొట్టుకొనుటకు వీలుగాదు. ఎన్ని కల్పములనుభవించినను, పూర్తిగ అనుభవించుటను తప్పింపవీలుగాదు. అందుచేతనే బలిష్ఠమైనపాపము -వల్ వినై- అనినారు. **పాఱ్ఱియరుళినాన్:**

తస్యపుత్రాదాయముపయన్తి సుహృదః।సాధుకృత్యాం ద్విషన్తః పాపకృత్యామ్।। (శాట్యాయనశాఖ) [మోక్షమునందు ఆమనుష్యునియొక్క సొత్తును పుత్రులు పొందుదురు. పుణ్యమును వాని స్నేహితులు పొందుదురు. పాపమును వాని శత్రువులు పొందుదురు] అనియును, 'శుమ్మెనాదే కైవిట్టోడి త్తూఱుగళ్ పాయన్దనవే - ఊపిరివిడువక పూర్తిగ వదలివేసి, సంసారమను పొదలలోనికి పరుగెత్తి ప్రవేశించినవి, (పెరియతిరు.5-4-3) అనియు చెప్పినవిధముగ, ఎంబెరుమానుడు పాపములను పోగొట్టునపుడు అవి నశించిపోక బంధువులు, స్నేహితులు మొదలైనవారివద్దకుపోయి చేరును. అట్లుగాకుండ, ఆవారు పాపములను రూపుమాసిపోవునట్లు చేసినారు అని భావము. **పాఱ్ఱి** అని అనిష్టమైన పాపములు నశించిపోవుటను చెప్పుచున్నది. 'అరుళినాన్' అనియు, 'తన్ పుగఴ్ఏత్త అరుళినాన్' అనునట్లుగా ఎడతెరిపి లేకుండా తమ విశిష్టతనే -గొప్పతనమునే- చెప్పునట్లు చేయు ఇష్టప్రాప్తిని చెప్పుచున్నారు. **ఎణ్డిశైయుమ్ అఱియ ఇయమ్బుగేన్:** ఎణ్డిశైయుమ్ ఏని ఎనిమిది దిక్కులను చెప్పినను, 'అఱియ' అని తరువాత చెప్పుటవలన ఆదిక్కులయందుగల జ్ఞానముగల చేతనులను చెప్పుచున్నది. ఎనిమిది దిక్కులలోనున్న జీవులందరును - మహాజ్ఞానులు, అల్పజ్ఞానులు అనే భేదములేకుండ తెలుసుకొనేటట్లు చెప్పుచున్నాను అంటున్నారు. 'తొణ్డీర్ ఎల్లోరుమ్ వారీర్ - దాసులందరును రండి'(తి.వా.మొ.5-2-8) అందరినీ రమ్మనమని ఆఴ్వారు ఆహ్వానించుటను వినియుండుటచే వీరుకూడా అటులనే చెప్పుచున్నారు. వారు ఎంబెరుమానునియందు గలరుచిచే ఆవిషయమందు రుచిగలవారందరూ రండి అన్నారు. వీరు ఆఴ్వారియందు అభినివేశము గలవారగుటచే ఆఴ్వారియందు రుచిగలవారందరూ రండీ అంటున్నారు. **ఒణ్డమిఴ్ చ్చడగోపన్ అరుళైయే:** ఆఴ్వారికి అజ్ఞానమును నశింపజేయు భక్తిరూపాపన్నజ్ఞానమును కృపజేసిన ఎంబెరుమానుని కృపవంటిదిగాద ఆఴ్వారి కృప. ఆకృపకు నోచుకొననివారిని కూడ తమవద్దకు వచ్చునట్లు చేయునదిగదా ఆఴ్వారుల కటాక్షము! **ఒణ్ తమిఴ్:** ప్రకాశము, శబ్దము కలిగిన తమిళము, ఇంపైన తమిళము అని భావము. తిరువాయ్ మొ మొదలైన నాలుగు దివ్యప్రబంధములను ఆవారు కృపజేయుటను తెలియచేయుచున్నారు. 'ఒణ్ తమి ' అని విశేషణమును ఉపయోగించుటచే 'పాలేయ్ తమిర్ ఇశైకారర్ పత్తర్ పరవుమ్ ఆయిరమ్- పాలవంటి మధురమైన తమిళులు, సంగీతకారులు, భక్తులు వ్యాపింపజేయు వేయిపాశురములు' (తి.వా.మొ.1-5-11) అని తిరువాయ్ మొ పాడిన కృపని చెప్పి, 'చడగోపన్ అరుళ్' అనుటచే ఆకృపకు పైనున్నది తమను కటాక్షించిన కృప అనుదానిని కూడ చెప్పుచున్నారు.

ఏడవపాశురమునకు పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యానవివరణము పూర్తి అయినది.

## నఞ్జీయర్ వారి వ్యాఖ్యాన విశేషములు.

**కణ్డుకొణ్డు ఎన్నై:** 'ఇరున్దాన్ కణ్డుకొణ్డు- కటాక్షించి నా మనసులో ఉన్నాడు' (తి.వా.మొ.8-7-2) అని ఆఴ్వారు ఎంబెరుమానుడు తమను అలభ్యలాభముగ తలంచి చేయూతనిచ్చుటను చెప్పినారు. ఇచ్చట వీరు ఆఴ్వారు

తమను అలభ్యలాభముగ తలంచి తమను కటాక్షించుటను చెప్పుచున్నారు. ఈరెండు దృశ్యములును కనబడుట తమలాభంగాయున్నదివీరికి. **కారిమాఱప్పిరాన్**: ఆళ్వారులు 'పిరాన్ పెరునిలమ్ కీణ్డవన్ - ఉపకారకుడు గొప్పభూమిని విడదీసినవాడు' (తివా.మొ.1-7-6) అనినట్లుగా వీరుకూడ కారిమాఱప్పిరాన్ అంటున్నారు. **పణ్డై వల్ వినై పాఱ్ఱి యరుళినాన్**' 'పణ్డై" అంటే అనాదియైన సంసారము అని, వల్ వినై అంటే బలమైన పాపములు అని అర్థము. వాటిప్రారంభమే తెలిసినవారులేరు అంటున్నారు. **ఒణ్ తమిళ్**: తేటగాయున్న నీటిలో ఎక్కువలోతులో ఉన్న వస్తువులు కూడా స్పష్టముగా కనబడుతాయి. అలాగే 'వేదములు తెలుసుకొనుట చాలకష్టము' అని తెలుసుకొనుటకు వెనుకాడినట్టి విషయాన్ని ఆళ్వారు అందరికీ స్పష్టంగా తెలిసేలా చెప్పిన భాషగనుక దీనిని 'ఒణ్ తమిళ్' అన్నారు.

**నఞ్జీయరువారి వ్యాఖ్యానవిశేషములు పూర్తియైనవి.**

## అళ్గియ మణవాళప్పెరుమాళ్ నాయనార్ వారి వ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక**: 'గురుం ప్రకాశయేన్నిత్యమ్- గురువుగారిని నిత్యము అందరకు తెలిసేటట్లు చేయవలెను' అని చెప్పినట్లుగ ఆచార్యుని అందరును తెలుసుకొనేటట్లు ప్రకాశింపజేయవలెను అనే విధిప్రకారము నమ్మాళ్వారికీర్తిని అన్నిదిక్కులలోను అందరికీ తెలిసేటట్లుగా చెప్పుచున్నాను అంటున్నారు శ్రీమధురకవి యాళ్వారు. ఆవారికి అనేకమైన గొప్పతనములున్నను, సంసారులదుర్గతిని చూచి సహించలేక వారందరికీ తరించడానికి ఉపదేశించుటకు కారణమైన వారికృపయొక్క గొప్పతనమే అతివిశిష్టమైనదికనుక దానిని లోకమంతా తెలుసుకొనేటట్లు ప్రకాశింపచేయుచున్నాను అంటున్నారు. ఎంబెరుమానుడుగూడ సాటిలేని కరుణాసాగరుడయినప్పటికీ, ఆయన సర్వస్వతంత్రుడవడంచేత చేతనుడిలో దోషమును చూచి ఉపేక్షించే గుణము ఆయనకు గలదు. ఆవారుమాత్రం అలాకాకుండా అందరిపైనా తమకృపాకటాక్షప్రవాహాన్ని వర్షింపజేస్తారు గనుక లోకమంతా వారిని తెలుసుకొనేటట్లు వారిగుణమును చాటుదును అంటున్నారు.

**వ్యాఖ్యానము**: కణ్డుకొణ్డు ఎన్నై అని తమదుర్గతిని చెపుతున్నారు. మంచివారలచే చూడబడడానికి కూడ తగనివాడుగనున్న తమను(మధురకవులను) (అనుమానం, సిగ్గు, ఏమీలేకుండా) వెనుకాడక కటాక్షించిన విషయాన్ని చెప్పుచున్నారు. కొణ్డు అని దోషమునుచూచి వెనుకంజవేయకుండా వీరిని చేరదీయడాన్ని చెప్పుతున్నారు. "ఎన్నై క్కణ్డు, ఎన్నై క్కొణ్డు" నావేపు కన్నెత్తి చూడడానికి కూడ తగని నన్ను చూచినారు, అందరూ చేతులు దులిపేసుకుంటే వారుమాత్రం నన్నుస్వీకరించేరు. ఒకవేళ వీరు వదిలేసుకున్నా నమ్మాళ్వారుమాత్రం వీరిని ఇక వదలలేరు. **కారిమాఱప్పిరాన్: ఎంబెరుమానునివలె నమ్మావారు** అహంకారియైన ఉపకారి కాడుగదా! ఆళ్వారులు మంచివంశంలో జన్మించినవారు. మంచి కుటుంబంలో అవతరించి నాకు ఉపకరించినవారు. తాను అవతరించి, నా జన్మనే ఛేదించినవారు. **వల్ వినై: పాపము ఎటువంటిదంటే,** అందరికీ మంచివాడైన ఎంబెరుమానుడు "క్షిపామి" (ఆసురజన్మలలోనే ఎప్పుడును త్రోసివేతును) అనడానికి తగినది ఈపాపము. ఆళ్వారుల కటాక్షముచేతనే పోగొట్టదగిన పాపము. **ఎన్నై క్కొణ్డు పణ్డై వల్ వినై పా యరుళినాన్**: ఎంబెరుమానుడు చరమశ్లోకంలో చెప్పిన ప్రకారము 'నన్నే శరణు పొందుము, పాపములు పోవునట్లు చేయుదును' అని అనకుండా తామే నన్నుపట్టుకొని నాపాపములు పోవునట్లు చేసినారు. **ఎణ్ తిశైయుమ్**: దిక్కులు నాలుగు, మూలలు నాలుగు, అని ఎనిమిది దిశలనీ చెప్పుతున్నారు. ఈవిధముగ చెప్పుటను మీద, క్రింద ఉన్న రెంటినీ కూడ కలుపుకొని పదిదిక్కులకీ ఉపలక్షణంగా తీసుకోవలెను. లేదా, మీదికి వెళ్ళలేకపోవుటచేతను, కిందకి దిగలేకపోవుటచేతను, 'ఎణ్

తిశైయుమ్' - ఎనిమిది దిక్కులును అంటున్నారు అనైనా అర్థం చేసుకోవచ్చును. ఆవారుల కృపయుండుటచే క్రిందకు వెళ్ళరు. ఆవారు వెళితేతప్ప వీరు మీదకి వెళ్ళలేరు. **అఱియ ఇయమ్బుగేన్**: 'నాడుమ్, నగరముమ్ నన్గఱియ- ఊరూ, వాడా అంతా బాగుగా తెలుసుకొనునట్లు' (తిరుప్పల్లాణ్డు-4) అనినట్లు అందరూ తెలుసుకొనేటటుల **ఇయమ్బుగేన్**: నమ్మాళ్వారుల కటాక్షపు గొప్పతనాన్ని, అది తమవరకూ ఏవిధంగా ప్రసరించి ఫలించిన విధానాన్నీ, తమపాపములు ఎట్లు పోయాయో, తాము ఎటువంటి ఫలమును ఎలా పొందేరో అందరూ తెలుసుకొనేటట్లుగా చెప్పగలిగేను అంటున్నారు మధురకవియావారు. **ఒణ్ తమి చ్చడగోపన్**: కరుణచేత నమ్మాళ్వారు నన్ను తీర్చి దిద్దిన విధమును, కవిత్వంతో వారు లోకమును దిద్దినవిధమును గూడ చెప్పగలిగితిని. **ఎణ్ తిశైయుమ్ ఇయమ్బుగేన్**: 'దేవాః స్వస్థానమాయాన్తి దైత్యాః సర్వే హతాగతాః। నభయం విద్యతే కిఞ్చిత్ జితం భగవతా జగత్॥

(దేవతలు తమస్థానమునకు వచ్చినారు. అందరు దైత్యులు(రాక్షసులు) చంపబడి నశించినారు. ఇక ఏభయమును లేదు. భగవానునిచే జగత్తు జయింపబడినది.) అనినట్లుగ ఎంబెరుమానుడు లోకములను కొలచినపుడు, జాంబవంతుడు ఆవార్తను(మీద చెప్పిన శ్లోకాన్ని) తాను డప్పువాయించి చాటించుచు తిరిగినట్లుగ, నేను కూడ డప్పువాయించి చాటించి తిరిగేను అని మధురకవియావారు చెప్పుతున్నారు. జాంబవంతుడు డప్పువాయించి చెప్పినది ఎంబెరుమానుని శక్తియొక్క గొప్పతనమును. వీరు ఇచ్చట డప్పువాయించి చెప్పేది నమ్మాళ్వారుల కరుణాకటాక్షముయొక్క గొప్పతనము. అచ్చట ఇతరములైన లాభములను కోరుకొనిన ఇంద్రుడు మొదలైనవారందరూ ఆనందించారు. ఇచ్చట ఇతరలాభాపేక్షలేని ఉత్తములు ఆనందించారు. అచ్చట వంచనచేత కొలినాడు ఎంబెరుమానుడు. ఇచట ఏమాత్రమూ వంచనలేని సత్యమునే చెప్పిన పాశురములుగల తిరువాయ్ మొళ్ళిచేత అందరినీ ఆనందింపజేసేరు నమ్మాళ్వారు. దానికీ, దీనికీ సామ్యము ఉన్నది. అచ్చట పదక్రమముచే (శ్రీపాదములను ఉంచుటచే) అందరిని దిద్దుబాటుచేసినాడాయన. ఇచ్చటగూడ ఆళ్వారు నాశిరస్సుమీదుగా తమశ్రీపాదములను ఉంచుటచే పదక్రమముచేత దిద్దిన గొప్పతనము వారికిగూడ యున్నది. 'మత్తగత్తిన్ తన్ తాళ్ అరుళాలే వైత్త అవర్ - మస్తకమున తనపాదమును కృపచేనుంచినవారని (జ్ఞానసారము-36) అరుళాళప్పెరుమాళెంబెరుమానార్ కూడ సాయించినారుగదా!

ఏడవపాశురమునకు వ్యాఖ్యానవివరణములు పూర్తియైనవి.

**8. అరుళ్ కొణ్డాడుమ్ అడియవరిన్బుఱ**
**అరుళినాన్ అవ్వరుమఱైయిన్ పొరుళ్**
**అరుళ్ కొణ్డాయిరమ్ ఇన్ తమిళ్ళ్ పాడినాన్**
**అరుళ్ కణ్డీర్ ఇవ్వులగినిల్ మిక్కదే.**

**ప్రతిపదార్థము: అరుళ్ కొణ్డాడుమ్**: భగవత్కృపను కొనియాడుచున్న, **అడియవర్**: భగవద్భక్తులు, **ఇన్బుఱ**: ఆనందించురీతిని, **అ అరుమఱైయిన్ పొరుళ్**: ఆఅరుదైన అపూర్వమైన వేదములోని గూఢార్థములను **అరుళినాన్**: కటాక్షించినవారై, **అరుళ్ కొణ్డు**: పరమకృపచే **ఇన్ తమిళ్ళ్**: మధురమైన తమిళభాషయందు అమరిన, **ఆయిరమ్**: తిరువాయ్ మొళ్ళి వేయిపాశురములను, **పాడినాన్**: పాడినవారైన నమ్మాళ్వారుల, **అరుళ్ కణ్డీర్**: కృప ఒక్కటియేగదా! **ఇవ్వులగినిల్**: ఈలోకమునందు, **మిక్కదు**: ఉన్నతమైనది.

## పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యాన వివరణము

**అవతారిక**: వెనుకటి పాశురమలో 'చడగోపన్ అరుళై ఎణ్డిశైయుమ్ అఱియ ఇయమ్బుగేన్' అని చెప్పుటకు కారణమేమి అను ప్రశ్నరాగా నమ్మావారుల కృప చిత్, అచిత్ ఈశ్వరుడు అని మూడు తత్త్వములను ఎత్తుకొనినదగుటచే అట్లు చెప్పినాను అంటున్నారు ఈ పాశురములో.

**వ్యాఖ్యానము.: అరుళ్ కొణ్డాడుమ్ అడియవర్**: ఎంబెరుమానుని కృపను కొనియాడుచున్న దాసులు అని యర్థము. నమ్మావారువలె యుండువారలు అని భావము. 'అదువుమ్ అవనదు ఇన్నరుళ్- అదియును వాని ప్రీతికరమైన కటాక్షమే.' (తి.వా.మొ.8-8-3) అనియును, 'అరుళ్ పెఱువార్ అడియార్ దమ్ అడియన్ - కటాక్షము నభించువారుకైనదాసులకు దాసుడు' (తి.వా.మొ.10-6-1) అనియు కటాక్షించిన నమ్మావారువలె ఉండువారు అని భావము.అంటే 'ఆనైక్కన్ఱరుళై యీన్ద - గజేన్ద్రునికి కరుణాకటాక్షమును కృపజేసిన' (తిరుమాలై-46) అనియును, 'నిన్నోడుమ్ ఒక్కవపట్టు అరుళినాయ్ - నీకు సమానమైన దారియందు పోవు (వారిని ఆరాధించినపద్ధతిలో పోవునట్లు) అరుళినాయ్- కృపజేసినవాడవైనావు (తిరుమాలై-42) అనియు కృపజేసిన తొణ్డరడిప్పొడియావారు, 'అరుళ్ పురిన్ద శిన్దై - కృపని తెలిసుకొనిన మనస్సు' (ఇరం. తిరువం.56) అని కృపజేసిన బూదత్తావారును, 'నిన్నరుళే పురిన్దేన్ - నీకృపనే కోరియుంటిని' (పెరియా.తిరు.5-4-1) అని సాయించిన పెరియావారును, 'అరుళాదొయుమే - కృపచేయకయుండుట వీలగునా?' (మూన్ఱా.తిరువం.16) అని సాయించిన పేయావారులవలె ఎంబెరుమానుని కటాక్షమును కొనియాడుచున్నవారిని 'అరుళ్ కొణ్డాడుమ్ అడియవర్" అనుచున్నారువీరు. అట్లనుటచే ఎంబెరుమానుని కటాక్షమే మోక్షోపాయము తప్ప తమవద్దనున్నది ఏమియును మోక్షోపాయముగాదు అని తెలిసినవారు అని చెప్పబడుతోంది. అనగా ఎంబెరుమానుని కటాక్షమునకు గూడ కారణముగా తమవద్దనున్న కర్మజ్ఞానభక్తి మొదలైనవాటిని ఉపాయముగా తలంచక, ఎంబెరుమానుని కటాక్షమొక్కటే ఉత్తమమైన ఉపాయమని తలంచువారలు అని భావము. తమమంచిగుణములైన వీటిని ఎంబెరుమానుని కటాక్షముచేతను, దానివలన ఆతడుగావించిన సృష్టి, అవతారము మొదలైన మహాగొప్పచేష్టలచే ప్రకాశింపజేసిన పరత్వమును చూపించు అధికారివిశేషణముగ తలంచుదురే తప్ప ఇవి ఉపాయములై ఎంబెరుమానుని కటాక్షమును పొంది అందువలన ఆయన మొక్షమును ప్రసాదించినాడని ఎన్నడును తలంచనివారు అని ఇచ్చట భావము. వీరు ఈవిధముగ సర్వేశ్వరుని కటాక్షమును కొనియాడు దాసులుగ, భాగవతులుగ ఇతర ఆవారులనే తలంచిరి. 'ఆయాన్ అరుళే నన్నఱు నానయ్య నాన్ కణ్డుకొణ్డేన్ నారాయణా ఎన్నుమ్ నామమ్ - చక్రధారి కటాక్షమే గొప్పది, నేను నారాయణా అను నామమును అనుభవించి చూచి కొనియాడితిని.' (పెరియా.తిరు.5-4-1) అనియు, 'నిన్నరుళే పురిన్దిరున్దేన్ - నీకటాక్షమునే కొరియున్నాను.' (పెరియా.తిరు.5-4-1) అనియు, వారి పాశురములు ఎంబెరుమానుని కటాక్షమునే తిరుగులేని ఉపాయముగ చెప్పుచున్నవిగదా! **ఇన్బుఱ**: ఆనందము నిండుగ యున్నవారు. 'ఎణ్ణాదనగళ్ ఎణ్ణుమ్ నన్మునివర్ ఇన్బమ్ తలైచ్చిఱప్ప - ఇతరులు ఊహించలేని ఉభయవిభూతికంటె గొప్పవైన సంపదలను సర్వేశ్వరునికి కావలెనని తలంచుచున్న భక్తులైన మునివరులు ఆనందముతో ఉన్మత్తకులగునట్లు' (తి.వా.మొ.10-7-5) అని నమ్మావారులు సాయించినరీతిలో వారిదివ్యప్రబన్ధములనే యనుసంధానముచేయుచున్నవారిని, వారెట్టి మోక్షసాధనమును అనుష్ఠించక, ఎంబెరుమానుని అనుభవించుటయే జీవనముగా తలంచువారుగ చేయును అని భావము. **అరుళినాన్ అవ్వరుమఱైయిన్ పొరుళ్**: 'అవ్వరుమఱై' అన్ద అను విశేషణపదము సంస్కృతవేదప్రసిద్ధిని చూపును. 'అరుమఱై' అనునది ఈసంస్కృతవేదము (తెలుసుకొనుటకు) పొందుటకు అరుదైయున్నది అని చూపుచున్నది. 'మఱై' అని ఇచ్చట చెప్పబడునది వేదమందలి భగవత్స్వరూపరూపగుణవిభూతులను

వివరముగ చూపు ఉత్తరభాగమైన, రహస్యములైన ఉపనిషత్తులే అగును. **అవ్వరుమఱైయిన్ పొరుళై అరుళినాన్**: ఎప్పుడును సత్త్వగుణమందవగాహులైనవారికే తప్ప ఇతరులకు అవగాహనకసాధ్యమైన ఉపనిషత్తుల అర్థమును కటాక్షించినారు. 'పొరుళ్' అన్న పదమునకు అరథము(భావము), ఐశ్వర్యము అని రెండు అర్థములున్నవి. రెండును ఇచ్చట సరిపోవును. పరమసాత్త్వికులకు ఉన్న స్థిరమైన ఐశ్వర్యము ఉపనిషద్రహస్యమేగదా!

"సాహిశ్రీరమృతా సతామ్" (యజు. అష్ట-3-7) [సత్పురుషులకు వేదమే నాశములేని సంపదయగును] అని యజుర్వేదమందు వేదము సంపదగ చెప్పబడెనుగదా! ఈవిధముగ వేదము సత్పురుషులకు సంపదయగుటయు, అన్ని సంపదలకంటెను విశేషమైన సర్వేశ్వరుని తనయందు ఉంచుకొనుటవలననే సాధ్యము.

'సర్వగంధః సర్వ రసః' (ఛాం.ఉ. 3-14-2)

[పరమపురుషుడు అన్ని గంధములు ఉన్నవాడు, అన్ని మంచి రసములు ఉన్నవాడు.] అని సర్వేశ్వరుడే అన్నిసుగంధములు ఉన్నవాడు, మంచిరుచులన్నియు కలిగినవాడుగను చెప్పబడుటచే ఆతడే అతివిశిషటమైన సంపద అయినాడు.

రసోవైసః రసంహ్యేవాయం లబ్ధ్వా౽నందీ భవతి।
కొహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్।
యదేష ఆకాశ ఆనందో నస్యాత్।
ఏష హ్యేవానందయాతి।। (తై.ఆనం.7)

[ఆపరమపురుషుడు రసస్వరూపుడు గదా! రసస్వరూపుడైనవానిని పొందు (ఈజీవుడు) ఆనందము గలవాడగుచున్నాడు. ప్రకాశించువాడును, ఆనందస్వరూపుడును, అయిన ఈ పరమపురుషుడు లేకపోయిన ఎవడు ఈలోకములోనున్న సుఖమునో, మొక్షసుఖమునో పొందవీలగును? అందుచే వీనిని జీవుడు ఆనందింపజేయుచున్నాడు] అనెడి ఉపనిషద్వాక్యమందును,

తద్ధేతు వ్యపదేశాచ్చ। (వే.సూ. 1-1-15)

[జీవుని ఆనందమునకు కారణముగ పరమాత్మను చెప్పుటచే (పరమాత్మ జీవాత్మకంటె వేఱైనవాడు)] అని బ్రహ్మసూత్రములందును ఎంబెరుమానుడే ఆనందస్వరూపుడుగను, జీవుని ఆనందమునకు కారణముగను చెప్పబడుటచే ఆతడే అతివిశిష్టసంపదయైన ఉపనిషదర్థమయినాడు.

**అరుళినాన్ అవ్వరుమఱైయిన్ పొరుళ్:** ఉపనిషత్తుల అర్థమును ఆఎంబెరుమానుని కటాక్షముచే తమప్రబంధమందు నమ్మాళ్వారు ప్రకాశింపజేసినారని భావము. **అరుళ్ కొణ్డు ఆయిరమ్ ఇన్ తమి పాడినాన్:** నమ్మాళ్వారు తమబుద్ధిచే అర్థములను కటాక్షించక "మయర్వఱ మదినలమ్ అరుళినన్ - అజ్ఞానగంధరహితమైన భక్తిరూపాపన్జ్ఞానమును కటాక్షించినాడు" (తి.వా.మొ.1-1-1) అనినప్రకారము ఎంబెరుమానుని కృపచేతనే పొందిన జ్ఞానమునుపయోగించి వానిచేతనే నడిపింపబడినవారుగ స్వీకరింపబడిన వేయిపాశురములు గల తిరువాయ్ మొళ్ఖి కటాక్షింపబడినది. 'ఎన్నాగియే, తప్పుదలిన్ఱి త్తనైకవితాన్ శొల్లి-దోషములేకనే తనవిషయమై కవిత్వమును తానే చెప్పి' (తి.వా.మొ-7-9-4) అనబడు రీతిలో తిరువాయ్ మొళ్ఖిని అనుసంధానము చేయు ఇతరులవలె కవిత్వముచెప్పిన ఆళ్వారు తాము గూడ ఆశ్చర్యపోవునట్లు ఎంబెరుమానుడు వారిచే ఎట్టి దోషములులేని కవిత్వమును చెప్పించినారు. **ఆయిరమ్ ఇన్ తమి పాడినాన్:**

చతుర్వింశత్సహస్రాణి శ్లోకానాముక్తవాన్ ఋషిః।

తథా సర్గశతాన్ పంచషట్కాండాని తథోత్తరమ్।। (రా.బా.కాం. 1-2)

[వాల్మీకి మహాముని ఇరవైనాలుగువేలశ్లోకములుగను, ఐదువందలసర్గలుగను, ఆరు కాండలును, ఉత్తరకాండముతోకూడినదిగను రామాయణమును చెప్పెను] అని వాల్మీకి ఇరవైనాలుగువేల శ్లోకములను చెప్పినట్లు, వీరు వేయిపాశురములు పాడినారు.ఈవిధముగ పాడిన పాటలు వాల్మీకిని తప్పించివేరెవరును లేకపోయినను, ఒకజీవునికి హితమును తెలియజేయుటకు ఒక పాటయే సరిపోవును అనినట్లుగా పాడినారుగదా! అందుచేతనే ఏలోపమును లేదు. **ఇన్ తమిళ్ పాడినాన్:** పురుషార్థమును స్పష్టీకరించు టకు అర్థమును.

పాఠ్యే గేయేచ మధురం ప్రమాణై స్త్రిభిరన్వితమ్। (రా.బా.కాం.4-8)

[రామాయణకావమయము మూడువిధములైన హద్దు(ప్రమాణము)లతో కూడినదై చదివినపుడును, పాడినపుడును మధురమైయుండును.] అని చెప్పినట్లు అతిరుచికరమైనదిగను, అందరిచేతను నేర్చుకొనుటకు వీలుగాయుండునట్లుగను, మధురమైన తమిళభాషయందు పాడినారు.

**పాడినాన్ అరుళ్ కణ్డీర్:** 'మయర్వఱ మదినలమ్ అరుళినన్ - అజ్ఞానము నశించునట్లు భక్తిరూపజ్ఞానమును కటాక్షించినాడు' (తి.వా.మొ.1-1-1) అనుప్రకారము ఆవారులను నిర్హేతుకముగ కటాక్షించిన ఎంబెరుమానుని కటాక్షమును మించియున్నది సర్వేశ్వరుని స్తుతించిన ఆవారుల కృప. ఎంబెరుమానునిచేత వదలివేయబడిన ఆత్మలను, వారియొక్క బాధపడవలసినస్థితిని చూచి, వారిని తీర్చిదిద్దినందుచే వీరియొక్క కృప విశేషమైనదై మనచే ప్రత్యక్షముగ దర్శింపతగియున్నది అని భావము. **ఇవ్వులగినిల్ మిక్కదే:** చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు అను మూడు తత్త్వములను వివరించునదైయున్నది. నమ్మావారు చివరి తిరువాయ్ మొలో పదవపాశురమందు 'శూఙ్ద్న్దు అగన్దు ఆఙ్న్దు ఉయర్న్ద ముడివిల్ పెరుమ్ పాఴేయో - మహదాదులయందు వ్యాపించి, ప్రక్కలను వ్యాపించి, మీదకు పెరిగిన అంతములేని అపరిచ్ఛిన్నమైన భోగమోక్షసాధకమైన మూలప్రకృతికి అంతరాత్మయైనవాడా' అని అచిత్తత్త్వమును చెప్పి, తరువాత 'శూఙ్ద్న్దు అదనిల్ పెరియ పరనన్మలర్ చ్చోదియో - అంతటను (జ్ఞానముచే)వ్యాపించి, ఆమూలప్రకృతికంటె గొప్పదై దానిని నియమించునట్టి, మంచి విలక్షణమై, వికసించు తేజోమయమైన జీవాత్మలకు అంతరాత్మయైనవాడా' అనిచిత్తత్త్వమును చెప్పి, 'శూఙ్ద్న్దు అదనిల్ పెరియ శుడర్ ఞానవిన్బమేయో - వ్యాపించిఅంతకంటె గొప్పదై ఉజ్జ్వలమైన జ్ఞానమూర్తియైన, సుఖాత్మకమైన పరమాత్మస్వరూపుడా' అని ఈశ్వరతత్త్వమును చెప్పి, చివరిపాదమునందు 'శూఙ్ద్న్దదనిల్ పెరియ ఎన్ అవా - వ్యాపించి, అంతకంటె గొప్పదైన నా అభినివేశము' అని తమ భగవద్భక్తి, ఈమూడుతత్త్వములకంటెను గొప్పది అని సాయించినారు. ఇచ్చట మధురకవియావారు అటులనే నమ్మావారు తమవిషయమందు చూపిన కరుణ ఆమూడు తత్త్వములకంటెను గొప్పది అంటున్నారు.

ఎనిమిదవపాశురమునకు పెరియవాచ్చాన్పిళ్ళైవ్యాఖ్యానవివరణము పూర్తియైనది.

## నఞ్జీయరువ్యాఖ్యాన విశేషములు.

**అవతారిక:** నఞ్జీయరువారివ్యాఖ్యానములో "అరుళ్ కొణ్డాడుమ్ అడియవర్ ఇన్బుఱ అరుళినాన్ అవ్వరుమఱైయిన్ పొరుళ్" అను మొదటిరెండు పాదములును కైంకర్యపరులు(దాసులు) ఆనందముతో నిండుగనుండునట్లుగ వేదరహస్యమును భగవద్గీతాముఖముగా ప్రకాశింపజేసిన కృష్ణుని చెప్పుచున్నది,

ఉత్తరార్థము ఆకృష్ణుని కటాక్షమును మూలముగతీసుకొనిన వేయిపాశురములు గల తిరువాయ్ మొళ్ళిని పాడిన నమ్మాళ్వారుల కటాక్షము ప్రపంచమునకు అతివిశిష్టమైనదిగ చెప్పుచున్నదని అన్వయ క్రమము, అర్థము విడమర్చి చెప్పబడినవి.

**వ్యాఖ్యానము:** "అరుళ్ కొణ్డాడుమ్ అడియవర్ ఇన్బుఱ" ఇచ్చట 'అడియవర్' అనుపదము కృష్ణునికి దాసులుగానున్నవారిని చూపుచున్నది. 'అడియవర్ ఇన్బుఱ' అనుటచే శేషభూతులకు (దాస్యముచేయు వారికి) ప్రీతినిండుగనుండుటయే స్వరూపము. దాస్యముచేయుచుండుటయు, ప్రీతినిండుగయుండు టయు వేరువేరుగావు అని స్పష్టము చేయబడుచున్నది.

ముక్తానాం లక్షణంహ్యేతత్ యచ్ఛ్వేతద్వీపవాసినాం।

నిత్యాఞ్జలిపుటా హృష్టా నమ ఇత్యేవవాదినః।। (భార. శాం. 344-45)

[శ్వేతద్వీపవాసులకు ఏదిలక్షణమో అదియే ముక్తులకును లక్షణమగును. ఎల్లప్పుడును అంజలి ఘటించియేయుందురు. (అందువలన) ఆనందించుచుందురు. నోటితో 'నమః'అనియే చెప్పు స్వభావము గలవారయియుందురు] అనుప్రకారము, మొదటిపాదముచే కృష్ణుని కటాక్షమును అనుసంధించుచు వాని దాసులు ఆనందమును పొందుదురని చెప్పబడుచున్నది. ఆవిధముగ ఆయన కటాక్షించుట, అరుదైనవేదార్థమైన భగవద్గీతను ఉపదేశించుటయే అని తరువాతపాదముచే చెప్పబడుచున్నది. అరుళినాన్ అవ్వరుమఱైయిన్ పొరుళ్: పరమరహస్యమైనవేదముయొక్కఅర్థమును ఎవరును కోరకుండగనే నిర్హేతుకముగ తనవద్ద కొంచెము ప్రేమగలవారును ఆనందించునట్లు గీతోపనిషదాచార్యుడై నిలచి ప్రకాశింపజేసినాడు. వేదములు రహస్యముగనుంచిన అర్థములను కటాక్షించిన ధీరోదాత్తనాయకునిగ కృష్ణుడు ఇచట కనపడుచున్నాడు. **అరుళ్ కొణ్డాయిరమ్ ఇన్ తమిళ్ పాడినాన్:** ఈకృష్ణునియొక్కకటాక్షమును మూలముగా తీసుకొని వేయిపాటలగ తిరువాయ్ మొళ్ళిని నమ్మాళ్వారు పాడినారు అంటున్నారు. ఆవారుల తిరువాయ్ మొకి మూలమువలె కృష్ణుని గీత అమరియున్నదని భావము. అనగా, కృష్ణుడు గీతలో సూక్ష్మముగ సాయించినదానిని ఆవారు తిరువాయ్ మొలో వివరముగ సాయించినారు అనినట్లు తోచినా, వేదమును అలవాటుగ అభ్యసించువారికే ఉజ్జీవనముగలుగునట్లు, వేదమెందు వివరముగ చెప్పబడిన కర్మజ్ఞానభక్తియోగములనే కృష్ణుడు వివరించినాడు. వేదమందు సూక్ష్మముగా చెప్పిన శరణాగతిని కృష్ణుడు కూడ గీతలో సూక్షమముగను, వేదముఖముగను కటాక్షించినాడు. అందుచే, భగవద్గీత వేదమందు అధికారము గలవారే ఫలమును పొందునట్లు అమరియున్నది. దానియందు అధికారములేనివారు కూడ ఉజ్జీవనలాభము పొందగలుగునట్లు శరణాగతినే వేయి తమిళపాశురములలో వివరముగ నమ్మావారు పాడినారు. ఈకారణముచే కృష్ణుని కటాక్షముకంటె నమ్మావారులకటాక్షమే లోకమునందు మిక్కిలి విశేషమైనదియని చివరిపాదమందు సాయించుచున్నారు. **అరుళ్ కణ్డీర్ ఇవ్వులగినిల్ మిక్కదే:** ఎంబెరుమానుడు కటాక్షించిన గీత, వేదము, సంస్కృతము తెలిసిన కొంతమందికే ఉపయోగపడును. నమ్మాళ్వారు సాయించిన తిరువాయ్ మొ వేయి ఇంపైన తమిళపాశురములగుటచే వేదము, సంస్కృతము తెలిసినవారితో సమముగ వాటిని తెలియనివారికి కూడ ఉపయోగపడును. 'పాలేయ్ తమిళ్ళర్ ఇశైకారర్ పత్తర్ పరవుమాయిరమ్- పాలవలె మధురమైన తమిళభాషను అభ్యసించినవారు, సంగీతకారులు, భక్తులు కీర్తించు వేయి' (తి.వా.మొ.1-5-11) అనియు, 'తొణ్డర్కు్క అముదుణ్ణ చ్చొన్మాలైగళ్ శొన్నేన్ - భాగవతులకు అమృతమును తినిపించు వాఙ్మాలికలను చెప్పితిని' (తి.వా.మొ.9-4-9) అనిగదా నమ్మాళ్వారుకూడ సాయించినారు.

## అழగియమణవాళ ప్పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక:** 'భగవత్కృపను లోకమందు అందరును ప్రశంసించుచుండగ మీరు ఆழ్వారుల కృపను ప్రశంసించుచున్నారేమి'యని కొంతమంది ప్రశ్నించగ భగవత్కృప మోక్షము పొందునపుడే కావలసినది. ఆమోక్షము జ్ఞానముచేత ఉండును. ఆజ్ఞానము ఆழ్వారులవలనయుండును. అందుచేత ఆழ్వారికృపయే లోకములో విరివిగాయుండును. అన్నారు.

**వ్యాఖ్యానము: అరుళ్ కొణ్డాడుమ్ అడియవర్ ఇన్బుఅ:** తిరువాయ్ మొழிని పాడుట, ఎంబెరుమానుని ఆనందింపజేయుటకుగాక ఎంబెరుమానుని కృపాగుణమును ప్రశంసించు సత్త్వగుణముగల సత్పురుషుల ముఖవికాసమునకే పాడినారు. **అడియవర్:** భగవత్కైంకర్యమే పురషార్థమను స్వరూపజ్ఞానము కలిగిన వారు. **అరుళ్ కొణ్డాడుమ్:** ఆపురుషార్థమునకు సాధవముగూడ వానికరుణయేయని తలంచువారు. ఈశ్వరునియు, వానిగుణములను శ్లాఘించుట వాని కృపాగుణమును కించపరచుటగాదా! కృపాగుణము లేకపోయిన, ఇతరగుణములు నిరుపయోగమే గదా. అందుచేతనే ఈగుణమును ప్రశంసించుచున్నారు. ఇతరదైవములకంటెను ఎంబెరుమానుడే ప్రశంసించతగినవాడుగ యున్నాడు. ఇతరగుణములకంటెను వాని కటాక్షమైన కరుణయే ప్రశంసించతగినది. భక్తిమొదలగువాటిని అనుష్ఠించ శక్తిగలవానికి ఆఉపాయములు సాధనమని చెప్పినప్పటికిని, 'మనను పొందుటకు వీడు ఇట్టి సాధనానుష్ఠానము చేయవలెనే' అను ఎంబెరుమానుని దయాగుణమే ఆఉపాయములకు ఫలమును సాధనమై ఇచ్చును. ఆఉపాయములను అనుష్ఠించుటకు శక్తిలేనివానికి వాని ఆకించన్యత్వమే (ఏమాత్రపు కైంకర్యమును చేయలేకపోవుట) (పెట్టుబడిలేకపోవుట) చూచి కలుగు కృపయే సాధనమయినది. **అరుమఱైయిన్ పొరుళ్ అరుళినాన్:** వేదముయొక్క ఆ యపూర్వమైన అర్థమును కటాక్షించినాడు. "కరుణ సాధనము. కైంకర్యము పురుషార్థము" అనబడు అపూర్వమైన అర్థమును "వழுవిలా వడిమై శెయ్యవేణ్డుమ్ - విచ్ఛేదములేని కైంకర్యము చేయవలెను" (తి.వా.మొ.3-3-1) అనియు, "అడియై అడైన్దు అరుళ్ శూడి ఉయ్న్దవన్ - శ్రీపాదములను పొంది కృపాకటాక్షమును ధరించి, ఉజ్జీవించినవాడు." (తి.వా.మొ.7-2-11) అనియు ఉపదేశించినారు. **పొరుళై అరుళినాన్:** (తాము చతుర్థవర్ణమునందు అవతరించినవారగుటచే) ఆవారు వేదవాక్యములను చెప్పకనే దాని అర్థమును కటాక్షించినారు. **అరుమఱైయిన్ పొరుళ్:** రజస్తమోగుణములు ఎక్కువగాయున్నవారికి అర్థమును దాచియు, సత్త్వగుణము ఎక్కువగాయున్నవారికి అర్థమును తెలియపరచుటచే "మఱైయాయ నాల్ వేదమ్- దాచబడిన నాలుగువేదములు" (తి.వా.మొ.3-1-10) అనినప్రకారము 'మఱై' అనియు, వేదము అనియును పేరుపొందగా ఈవేదముయొక్క అర్థమును ప్రకాశింపజేసినారు. **అరుళ్ కొణ్డాడు ఆయిరమ్ ఇన్ తమిழ் పాడినాన్:** వేయి శాఖలుగల సామవేదమునందు చెప్పబడిన అర్థమును వేయిపాశురముల తిరువాయ్ మొழிలో కృపచే ప్రకాశింపజేసినారు. **ఆయిరమ్ ఇన్ తమిழ் పాడినాన్:** ప్రణవము (ఓంకారము) వలె చాలసూక్ష్మముగనో, లక్షగ్రంధములకుపైగాయున్న మహాభారతమువలె అతివిరివిగనో పాడకుండ, వేయి ఇంపైన తమిళపాశురములు పాడినారు. **పాడినాన్:** 'వేఱ్కైయాల్ శొన్న పాడల్ - అభినివేశముచే చెప్పిన పాటలు' (తి.వా.మొ.4-10-11) అని చెప్పినట్లుగ తమ అనుభవమైన ఆనందవార్ధిలో మునుగుటకు తగిన ఉపాయముగనున్న మంగళవచనములను కటాక్షించినారు. **అరుళ్ కొణ్డు పాడినాన్:** ఒకపురుషుడు చెప్పినది అగుటచే ఇది అంధకారమును ఇచ్చి, అజ్ఞానమును

కలిగించు మోహము, మరపువంటి దోషములకు ఆటపట్టయియుండునే, ఇది ఎట్లు ప్రమాణమగును? అను ప్రశ్నరాగా, తాము చెప్పినారుగనుకకదా అట్లు అనుచున్నారు! పరమపురుషుని కటాక్షముచే దీనిని చెప్పినారు గనుక అట్టి దోషములకు అవకాశమే ఉండదే! అని భావము. **"ఆమ్ ముదల్వన్ ఇవన్ ఎన్రు త ఎన్నా ముదల్ వన్దు పుగున్దు నల్లిన్ కవి తూముదల్ పత్తర్కు్కత్తాన్ తన్నై చ్చొన్న ఎన్ వాయ్ ముదలప్పనై** - జగత్కారణుడైనవాడు ఈశ్రియఃపతియే అని తనవిషయమందు తెలివిని నాకిచ్చి నానాలుకపై వచ్చి ప్రవేశించిమంచి, మధురమైన కవిత్వము అయిన తిరువాయ్ మొని పరిశుద్ధులైన భక్తులకుతాను తనను చెప్పిన నాకవిత్వమునకు కారణభూతుడైన స్వామిని' తి.వా.మొ.7-9-3) అని నమ్మావారు తామే సాయించినారుగదా! **పాడినాన్ అరుళ్ కణ్డీర్ ఇవ్వులగినిల్ మిక్కదే:** పాటకాక పాడినవారైన నమ్మాళ్వారు కాక, పాటకుకారణమైన సర్వేశ్వరుని కటాక్షముగాక, పాడిన నమ్మాళ్వారుల కటాక్షమే అతివిశేషమైనది. **ఇన్ తమిళ్ పాడినాన్ అరుళ్:** హద్దు అతిక్రమించిన (ఎక్కువగ వేగిపోయి బొగ్గువలె మాడిపోయిన పణియారమువలె గట్టిదైన) శ్రీగీతను చెప్పినవాని కటాక్షము విశేషమైనదిగాదు. 'నెఱియెల్లామ్ ఎడుత్తురైత్త నిఱైజ్ఞానత్తొరుమూర్త్తి - అన్ని ఉపాయములను ఎత్తి యుపదేశించినవాడును, పరిపూర్ణజ్ఞానము గలవాడును, విలక్షణమైన స్వభావము గలవాడు' (తి.వా.మొ.4-8-6) అనినప్రకారము, కర్మయోగమునుండి ప్రపత్తివరకూ ఉన్న సకలోపాయములను తెలియునట్లు చెప్పినను, దానియందు అభినివేశముగలిగినవారు కొంచెముమందియును, అభినివేశము కలగనివారు చాలమందియు యున్నారు. నమ్మావారి కటాక్షము అట్లుగాకుండ, 'ఊరుమ్ నాడుమ్ ఉలగముమ్ తన్నైప్పోల్ అవనుడైయ పేరుమ్ తార్గళుమే పిదఱ్ఱ - ఊరు, దేశము, లోకము కూడా తనవలెనే ఎంబెరుమానుని నామమును, వాని హారములను జల్పించగ' (తి.వా.మొ.6-7-2) అనినట్లుగ లోకం అంతా ఆవారువలె అయిపోయినది. 'నెఱియుళ్ళి ఉరైత్త - వేదములు చెప్పిన మార్గమును పరిశీలించి చెప్పిన' (తి.వా.మొ.1-3-5) అని తాము (్పవతరించిన తనజ్ఞానముతో చెప్పిన గీతవంటిది కాదు. ఎంబెరుమానుని కటాక్షముచే పాడినవిశిష్టత తిరువాయ్ మొకిని, దానికి కారణమైన వీరికరుణకును ఉన్నది. **ఉవ్వులగినిల్ మిక్కదు:** సర్వేశ్వరుని కటాక్షమును ప్రశంసించు దాసులు తక్కువమందియే. వీరి కటాక్షమునకు లోకమంతయు ప్రశంసించతగిన విశిష్టత ఎక్కువగా యున్నది. **ఆయిరమ్ ...మిక్కదే:** భగవద్గీతను చెప్పిన కృష్ణుడంటే చేతులెత్తి దండమును సమర్పించువారు లేరు. "కురుగూర్ చ్చడగోపన్ శొన్న" అని ఆవారియూరిపేరు వినగానే వైష్ణవలోకమంతా చేతులెత్తి నమస్కరించడానికి నిలచింది. **కణ్డీర్: ఎంబెరుమానుని కరుణాశాస్త్రమువలననే తెలుసుకొనతగినది.** వీరి కరుణ ప్రత్యక్షంగా తెలుసుకోగలిగినది. **ఇవ్వులగినిల్ మిక్కదు:** ఆవారుల కటాక్షము ఈలోకంకంటే గొప్పది అనెడి అర్థమును తీసుకొనవలెను."కడల్ మణ్ణెల్లామ్ విలైయోవెన మిళిరుమ్ కణ్ ఇవళ్ పరమే - సముద్రము, భూమి అంతయు, దీనికి సాటియా అనునట్లు మెరిసే కళ్ళు ఈమెవే' (తిరువిరు.60) అన్నట్లు లోకమంతా వీరి కన్నులలో ప్రకాశించే కరుణకు సాటికాదుగదా!

ఎనిమిదవ వాశురవ్యాఖ్యానవివరణములు పూర్తియైనవి.

**9.** మిక్క వేదియర్ వేదత్తి నుట్పొరుళ్
నిఱ్క ప్పాడియెన్ నెఞ్జుళ్ నిఱుత్తినాన్
తక్క శీర్ చ్చడగోపనెన్ నమ్బిక్కాళ్
పుక్క కాదలడిమై పయనన్రే.

ప్రతిపదార్థము: **మిక్కవేదియర్ వేదత్తిన్:** విశిష్టులైన వేదవేత్తలచే వల్లె వేయబడిన వేదముయొక్క, **ఉళ్ పొరుళ్:** అంతరార్థము, **నిఱ్క:** స్థిరముగనుండునట్లు, **పాడి:** తిరువాయ్ మొழ్ఱిని పాడి, **ఎన్ నెఞ్జుళ్:** నా హృదయమందు, **నిఱుత్తినాన్:** ఆవేదార్థములను లేదా తిరువాయ్ మొని సుప్రతిష్ఠితముగ చేసినారు (ఆழ్వారు) **తక్కశీర్:** దగిన గుణములుగల **చడగోపన్:** శఠకోపులు అను పేరుగలవారైన, **ఎన్ నమ్బిక్కు:** ఆ ఆழ్వారులవిషయమందు, **ఆళ్ పుక్క:** దాస్యము చేయుటకు ఉపకరించు, **కాదల్:** ఆశ అనెడిది, **అన్దే:** ఆక్షణమందే, **అడిమై:** ఆழ్వారులశ్రీపాదములయందు కైంకర్యము చేయుటయే **పయన్:** ఫలమైయున్నది.

## పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యాన వివరణము.

**అవతారిక:** "ఆழ్వారుల కృప ఈలోకముకంటె గొప్పది" అని వెనుకటి పాశురమందు చెప్పుటకు కారణ మేమి అనినచో, 'నాయొక్క నీచత్వమును లెక్కచేయకనే అన్ని వేదములలోనున్న రహస్యార్థములను పాడి, దానితో ఆழ్వారు నాకుపకరించినారు" అనునదే అయియుండును అనుచున్నారు. 'నీశనేన్ నిఱైవొన్నుమిలేన్ ఎన్ కణ్ పాశమ్ వైత్త పరఞ్జుడర్ చ్చోదిక్కే - అల్పుడను, ఎట్టి పూర్ణతయును లేనివాడను, నాయందు అధికమైన ప్రీతితోయున్న విశేషమైన ప్రకాశముతోనున్న అద్వితీయమైన కాన్తి గలవానికి' (తి.వా.మొ.3-3-4) అని ఎంబెరుమానునివిషయమందు ఆழ్వారులు సాయించినదానిని ఆழ్వారులశ్రీపాదములయందు వీరు సాయించుచున్నారు.

**వ్యాఖ్యానము: మిక్కవేదియర్:** ప్రమాణములలో శ్రేష్ఠతను గలిగిన వేదములచేతనే "వేదియర్ - వేదవేత్తలు" అని పేరుపొందినారు. "ఉళన్ శుడర్ మిగుశురుదియుళ్ - ప్రకాశవంతమైన, సర్వోత్కృష్టమైన వేదమందు ప్రతిపాదింపబడిన" (తి.వా.మొ.1-1-7) అని ఆழ్వారులు తిరువాయ్ మొழ్ఱిని ప్రారంభించునపుడే వేదమును "శుడర్ మిగు శురుది" అని కటాక్షించగ వినుటచే, వీరును 'మిక్క వేదియర్ - గొప్ప వేదవేత్తలు' అని వేదమును ప్రమాణములలో శ్రేష్ఠమైనదిగ సాయించినారు. 'మిక్క - శ్రేష్ఠతమము' అని అర్థమును స్వీకరించి దానిని 'వేదియర్' అనుటలో వేదమునకు విశేషణముగ తీసికొని ఈవిధముగ అర్థము తీసుకొనబడినది. అట్లే గాక 'మిక్కవేదమ్' అనుదానికి అనేకశాఖలు అధ్యయనము చేసినవారు అనికూడ చెప్పవచ్చును. **వేదత్తిన్ ఉట్పొరుళ్:** అన్నివేదములయొక్క రహస్యార్థము. ఆత్మ ఎంబెరుమానునకు శేషమైయున్నది అనిగదా వేదార్థము! వేదముయొక్క అంతరార్థము అయిన వేదాన్తరహస్యము 'ఆభగవచ్ఛేషత్వమును వానిదాసులకు కైంకర్యము చేయునంతవరకూ సాగవలెను' అనునది. వేదప్రారంభమందును, అంతమందును చెప్పబడు ప్రణవమునందు అకారము తరువాత లుప్తమైన చతుర్థ్యంతము దీనినేగదా చెప్పుచున్నది. వేదాంత రహస్యమిదియేగదా! **నిఱ్కప్పాడి:** తెలుసుకొనుటకు కష్టసాధ్యమైన ఈరహస్యార్థమును వినినవారందరును తెలుసుకొనునట్లు నమ్మాழ్వారులు పాడినారు. 'పయిలుమ్ తిరువుడైయార్ యవరేలుమ్, అవర్ కణ్డీర్ పయిలుమ్ పిఱప్పిడైదోఱు ఎమ్మైయాళుమ్ పరమరే - అనుసంధానము చేయుచు, సంపదగలవారు ఎవరైనను వారు ఇకముందు విరివిగా వచ్చు ప్రతియొక్క జన్మమునను మమ్ములను రక్షించి దాస్యమును స్వీకరించునట్టి పరమశేషులేగదా' (తి.వా.మొ. 3-7-1) అని సాయించినారు ఆழ్వారులు. **ఎన్ నెఞ్జుళ్ నిఱుత్తినాన్:** 'ఎంబెరుమానునకు దాస్యము చేయుట ఆత్మస్వరూపము' అను అర్థముకూడ ప్రయత్నించి పొందలేని మెట్టయిన నా మనసునందు 'వానిదాసులకు దాస్యముచేయుట ఈఆత్మస్వరూపము' అను వేదాంతరహస్యమును స్థిరముగనుండునట్లు చేసినారు. రాతిని బద్దలుకొట్టి అందు నీటిని ఆపియుంచువారివలె, ప్రవేశించతరముగాని నామనసునందు తెలుసుకొనుటకు కష్టసాధ్యమైన ఈయర్థమునే తెలిసికొనినట్లు చేసినారు. ఇదియేగదా నా నీచత్వమునుగూడ లెక్కచేయక

ఆవారు నావిషయమందు చేసిన ఉపకారము. **తక్కశీర్ చ్చడగోపన్** అని ప్రారంభించి చేసిన మంచిపనిచే (కృతజ్ఞతచే) తమకు కలిగిన స్థిరత్వమును చెప్పుచున్నారు. **తక్కశీర్ చ్చడగోపన్:** 'తిరుమాల్ అవన్ - శ్రియఃపతి ఆయన, ఆయనపై కవిత్వము' (తిరువిరు. 48) అని చెప్పుటకు తగిన కల్యాణగుణములు గల ఆవారు "అయర్వఱుమ్ అమరర్ గళ్ అదిపతి - మరుపులేని నిత్యసూరులకధిపతి' (తి.వా.మొ. 1-1-1) అని ప్రారంభము ఎంబెరుమానుని సర్వేశ్వరత్వమునకు తగియుండునట్లు 'తిరుమాలుడైయకవి - లక్ష్మీవల్లభుని కవి' అనినచో సరిపోయినట్లున్నది ఆవారుల గొప్పతనము. "ఏఱ్కుమ్ పెరుమ్ పుగ వానవరీశన్ కణ్ణన్ తనక్కు ఏఱ్కుమ్ పెరుంపుగఴ్ వణ్ కురుగూర్ చ్చడగోపన్ - వర్ధిల్లుచున్న మహాకీర్తిగల నిత్యసూరి నిర్వాహకుడైన కృష్ణునకు తగినట్లుగ ఎక్కువగుచున్నకీర్తిగల కురుకాపురినిర్వాహకులైన శఠకోపులు" (తి.వా.మొ.3-9-11) అని తామే సాయించినారు. 'తక్కశీర్ చ్చడగోపన్' అని కల్యాణగుణములు చెప్పిన తరువాత ఇంకొక గొప్పతనమును చెప్పుచున్నారు. **ఎన్ నమ్బిక్కు:** అతి నీచస్థితిలోయున్న నన్నుగూడ కటాక్షించతగిన సౌశీల్యము మొదలగు ఔదార్యగుణములచే పూర్తిగలవారికి, **ఆళ్ పుక్క కాదల్:** వారికే సంబంధించిన నాయొక్క ప్రీతి, అడిమై ప్పయన్ అన్రే: ఈప్రీతిగదా అది కలిగిన క్షణంలోనే ఆఴ్వారుకు కైంకర్యముచేయుట అనెడి ఫలమును పొందించినది! ఎంబెరుమానుని విషయమందు ప్రీతిచే లభించిన దాస్యము ఈప్రాకృతశరీరము నశించినపిదప అర్చిరాదిమార్గముద్వారా పరమపదమును చేరినపిదప పొందవలసినదిగనున్నది. అట్లుగాక, ఆఴ్వారులవిషయమందుకలిగిన ప్రీతి ఈశరీరంతోనే ఈలోకమందే ఆఴ్వారిశ్రీపాదములలయందు అన్ని కైంకర్యములును చేయునట్లు చేసినది. "తుయరఱు శుడరడి తొఴుదెఴు - దుఃఖమును నశింపజేయు ప్రకాశవంతమైన శ్రీపాదమును ఆశ్రయించి ఉజ్జీవింపుము' (తి.వా.మొ.1-1-1) అని తిరువాయ్మొఴిని ప్రారంభించునపుడే దాస్యము చేయ ఆశపడిన ఆఴ్వారుకు 'మునియే నాన్ముగనే - సంకల్పము గలవాడా, చతుర్ముఖునికంతరాత్మయైనవాడా' (తి.వా.మొ.10-10-1) అను తిరువాయ్ మొఴియొక్క చివరిపదిని ముగించిన తరువాతగదా ఈ కైంకర్యము లభించినది! ఆఴ్వారివిషయమందు ప్రీతికలిగితే ఆమాత్రం ఆలస్యంకూడా అవదు అనిచెప్పబడుచున్నది. ఆనాడే అనుటకు అపుడే అని అర్థము. లేదా 'పయనన్రే' అనియై "ఫలమగును, ఫలము ఉండినదగును" అనే అర్థమును గూడ స్వీకరించవచ్చును.

తొమ్మిదవపాశురమునకు పెరియవాచ్చాన్పిళ్ళైవ్యాఖ్యానవివరణము పూర్తియైనది.

## నఙ్జీయరు వ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక:** "పయిలుమ్ శుడరొళి", (తి.వా.మొ.3-7), "నెడుమాఱ్కడిమై"(తి.వా.మొ.8-10) అను రెండు తిరువాయ్ మొఴులలోను అన్ని వేదములకును సారార్థమైన భాగవతశేషత్వమును కృపజేసి, నామనసు నందు ఆఴ్వారు స్థానమును నిలుపుకొనినారు అనుచున్నారు ఈ పాశురమందు.

**వ్యాఖ్యానము: మిక్కవేదియర్:** జ్ఞానమును, భక్తిని పరిపూర్ణముగయున్న వైదికులు. మిక్క అను పదము వారి జ్ఞానభక్తులను చూపించుచున్నది. **వేదత్తిన్ ఉట్పొరుళ్:** వేదమునకు ఊపిరివంటి అంతరార్థము తిరువాయ్ మొఴి.. తిరువాయ్మొఴికి అంతరార్థము "పయిలుమ్ శుడరొళి", "నెడుమాఱ్కడిమై" తిరువాయ్మొఴులు. **నిఱ్కప్పాడి:** వాద్యములతోటి, సంగీతముతోటి పాడుటచే నామనసునందు స్థిరముగ నుండునట్లు పాడినారు అని భావము. **ఆళ్ పుక్క కాదల్ అడిమై పయనన్రే:** ఆఴ్వారుల శ్రీపాదములయందే ఉండినభక్తి వారికి కైంకర్యమైనదియగుటచేత అదియే నాకు కలిగిన లాభము.

నఙ్జీయరువ్యాఖ్యానవిశేషములు పూర్తియైనవి.

## అழగియమణవాళ పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యానవిశేషములు.

**అవతారిక:** నాలుగవ పాశురమందు ఆచార్యవిశ్వాసమును చెప్పినారు. ఐదు, ఆరు పాశురములలో ఆచార్యుల గొప్పతనము, వారి ఉపకారముయొక్క గొప్పతనమును చెప్పినారు. ఈపాశురమందు ఉపకారముయొక్క విశిష్టతను విశదీకరించి తమకృతజ్ఞతను చెపుతున్నారు. ఆచార్యునికి కృపయే స్వరూపమై, శిష్యునికి కృతజ్ఞతయే స్వరూపముగనుండును.

**వ్యాఖ్యానము: వేదియర్:** వేదవిదులయినారు. వేదముతోబాటు శాస్త్రములును "కాణ్బరో, కేట్పరోదాన్ - చూచుదురో, వినెదరో - మనసుతో శోధింతురో శ్రద్ధతో వినుదురో"(తిరుమాలై-7) అని కంటితో చూడక, చెవితో వినక ఎపుడును దోషములేని వేదప్రమాణమునందే స్థిరముగ యున్నవారు. **మిక్కవేదియర్: ఆవేదమునందును, అల్పమై** ఒకేచోట ఉండలేని స్వర్గము మొదలగు పురుషార్థములను కోరుకొని, వాటికి సాధనములను ఆశ్రయించుట చేయక, శ్రేష్ఠతమమైన భగవత్ప్రాప్తియే పురుషార్థమని దానికి సాధనము భక్తిప్రపత్తులేయని తైత్తిరీయ నారాయణవల్లిలో చెప్పినట్లుగా వేదాన్తవిజ్ఞానముచే సునిశ్చితులైయుండువారు. **మిక్కవేదియర్: 'మిక్కార్ వేదవిమలర్** - గొప్పవారై వేదమందు ప్రతిపాదింపబడిన పరిశుద్ధులైన నిత్యసూరులు' (తి.వా.మొ.2-9-8) అని ఆழ్వారులవద్దవినుటచే 'మిక్కవేదియర్' అనుచున్నారు. **వేదియర్ వేదమ్** - 'అన్దణర్ మాడు - బ్రాహ్మణుల సంపద'(తిరునెడు.4) అనునట్లుగ ఆవేదవేత్తలకు మహాసంపద యైన వేదము. **వేదత్తిన్ ఉట్పొరుళ్ నిఱ్కప్పాడి:** అది 'నిఱ్కుమ్ నాన్మఱై - స్థిరముగయుండు నాలుగు వేదములు' (తి.వా.మొ.6-5-4) అయినట్లుగ దాని అర్థమైయున్న ఇదిగూడ ఏకాలమునందును నాశములేనిదై స్థిరముగనుండునట్లు పాడి, **ఎన్ నెఞ్జుళ్ నిఱ్కప్పాడి నిఱుత్తినాన్:** పాడుచున్నపుడే నామనసునందు స్థిరముగ యుండునట్లు భావరాగతాళయుక్తముగ సంగీతముతో పాడినారు. అదిగూడ పైపైని చెప్పివదలకుండ అంతరార్థముగ ఉపదేశించినారు. **వేదత్తిన్ ఉట్పొరుళ్ నిఱ్కప్పాడి ఎన్నెఞ్జుళ్ నిఱుత్తినాన్:** వేదార్థములను తిరువాయ్మొழிలో చేర్చి పాడుట అరుదైనకార్యము. తిరువాయ్మొழி అర్థములను నామనస్సులో జొప్పించుట మరియొక కష్టసాధ్యమైన కార్యము. **తక్కశీర్ చ్చడగోపన్ ఎన్ నమ్బి:** ఈవిధముగ ఉపదేశించగలిగిన తమజ్ఞానము మొదలైన గుణములయొక్కపూర్తినిచూచి 'శఠమును కోపించి తరిమివేసిన వారు ' అని పేరుపొందినవారు నాశఠమునుపోగొట్టి తమ పూర్ణతనుస్థిరముగ స్థాపించినారు. లోపములున్నవారి లోపములను పోగొట్టుటగదా ఒకరిపూర్తికి చివరిహద్దు! **ఎన్ నమ్బి:** వారు ఉపదేశించిన అర్థములకంటె వారిపూర్తిని కనుగొని దానికే లొంగిపోయినారు మధురకవులు. **తక్కశీర్ చ్చడగోపన్ ఎన్ నమ్బి:** 'తక్కకీర్త్తి త్తిరుక్కురుఙ్గుడి నమ్బి - తగినకీర్తిగల తిరుక్కురుంగుడి పూర్ణులు' (తి.వా.మొ.5-5-5) అనబడినవారియొక్క పూర్ణులుకారు వీరి పూర్ణులు. ఆనంబిగారి పూర్ణత నావరకును చేరలేదుగదా అంటున్నారు. **ఆట్పుక్క కాదల్ అడిమై పయనన్రే:** వారు ఎంబెరుమానునకు దాస్యము చేయుటయు, వానియందు ప్రీతిని కలిగియుండుట, వానికి కైంకర్యమును చేయుటయు ఉపదేశించినారు. వీరు ఆழ்వారులకు దాస్యముచేసి వారియందే అభినివేశముగనిలుపుకొని, వారికే కైంకర్యమును చేయ ఆశపడుచున్నారు. వారు బాహ్యవిషయములను (శబ్దాదివిషయములను) వదలి, అంతరార్థములను చెప్పినారు. వీరు అంతరార్థమైన భగవద్విషయమును బాహ్యవిషయముగచేసి, దానికంటె అంతరార్థమైన ఆழ్వారుల శ్రీపాదములయందు దాస్యమును స్వీక రించి, వారియందే ప్రీతిని కలిగి వారి కైంకర్యమందే ఉన్మత్తకులైనవారు. **అడిమై పయనన్రో:** 'దాస్యమే లాభము' అనుదానినే ఆழ్వారివద్ద నేర్చినారు. కాని వారివలె ఎంబెరుమానునివద్ద 'వழுవిలా అడిమై -

విఘాతము లేని కైంకర్యము'(తి.వా.మొ.3-3-1) చేయుటకంటె, ఆళ్వారికి దాస్యముచేయుటయే తగినది అనుచున్నారు వీరు.

తొమ్మిదవపాశురమునకు వ్యాఖ్యాన వివరణములు పూర్తియైనవి.

**10.** పయనన్ఱాగిలుమ్ పాఙ్గలరాగిలుమ్
శెయల్ నన్ఱాగ త్తిరుత్తి ప్పణికొళ్వాన్
కుయిల్ నిన్ఱార్ పొழிల్ శూழ் కురుగూర్ నమ్బి
ముయల్ గిన్ఱేనున్ఱన్ మొయ్ కழలుక్కన్బైయే.

**ప్రతిపదార్థము: పయన్ అన్ఱు ఆగిలుమ్:** (ఇతరులు తిరుగుచుండుటచే) మనకు ఒకఫలము లేకపోయినను, **పాఙ్గు అలర్ ఆగిలుమ్:** (వారు తిరుగుటకు) తగినవారు లేక అనుకూలురు కాకపోయినను, **శెయల్:** తమ చేష్టలచే నన్ఱాగ **తిరుత్తి:** బాగుగ శిక్షను గరిపి దిద్ది, **పణికొళ్వాన్:** (వారిని) రక్షించువాడై, **కుయిల్ నిన్ఱు ఆర్ పొழிల్ శూழ் కురుగూర్:** కోకిలలు మొదలైనవాటితో నిండుగానుండి ఆరవారము చేయుచున్న తోటలు చుట్టును ఉన్న తిరునగరిలో వేంచేసియున్న **నమ్బి:** ఆవారులే, **ఉన్ దన్:** మీయొక్క **మొయ్ కழలుక్కు:** విశిష్టమైన శ్రీపాదములయందు **అన్బైయే:** ప్రీతియుండుటగురించియే **ముయల్ గిన్ఱేన్:** ప్రయత్నము చేయుచున్నాను.

## పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యాన వివరణము

**అవతారిక:** ఆళ్వారు తమకు ఉపకరించిన మంచిని అనుసంధానము చేయుటచే తాము ఇంతవరకును ఆళ్వారివిషయమున చేసిన ఆనుకూల్యములు(మంచికార్యములు)అన్నియు, చాల తక్కువైనవిగా తోచుటచే ఆళ్వారు చేసిన ఉపకారమును ఈపాశురమందు చెప్పుచున్నారు. ఆచార్యుడు చేసిన సహాయమునకు ప్రత్యుపకారము లేదా అనినచో,

యో దద్యాత్ భగవద్జ్ఞానం కుర్యాద్వా ధర్మదర్శనం।
కృత్స్నాంవా పృథివీం దద్యాన్న తత్తుల్యం కదాచన।। (వి.ధర్మం. 70-78)

[భగవానునిగురించిన జ్ఞానమును ఎవడు ఇచ్చుచున్నాడో, భగవానుని పొందు ఉపాయమును ఎవడు తెలియచేయునో, భూమిని పూర్తిగా ఆతనికి సమర్పింపవలెను. అది ఆతడిచ్చినదానికి ఒకవంతుగూడ సరితూగదు] అని యాభైకోట్ల వైశాల్యముగల భూమినే ఇచ్చినను, ఆచార్యుడు చేసిన ఉపకారమునకు ప్రత్యుపకారము కాజాలదు అని శాస్త్రము చెప్పెనుగదా! ఆచార్యుడు శిష్యునికి ఉపకరించుట అందరియందున విశేషముగ దివ్యదంపతులయియుందురు. అట్లు మరియొకదివ్యదంపతులజంటయుండి అట్టివారిని శిష్యుడు ఆచార్యునికి సమర్పించినచో అది తగిన ప్రత్యుపకారమగును. అట్లు కానిచో ఆచార్యుని విషయమందు ఎంతగొప్ప ప్రత్యుపకారము చేసినను, ఆయనచేసిన ఉపకారములతో పోల్చిచూసినచో వీడు చేసినది ఏమియును కాదు అనిచెప్పవలసివచ్చును.ఏది ఏమైనను, శిష్యుడు ఆచార్యునికి ఏమి ప్రత్యుప కారమును చేసేడు అనిపించి వాడు తక్కువచేసినవానిగనే కనపడును.

**వ్యాఖ్యానము: పయనన్ఱాగిలుమ్:** దేశములో ఒకడు మరియొకనికి ఉపకరించుట ఒక లాభమును పొందుటకే. ఇది లోకసహజముగదా! ఆవిధముగ ఒకలాభములేకపోయినను, నమ్మాళ్వారు నావంటి అనేకులను తీర్చిదిద్దినారు అని భావము. **పాఙ్గలరాగిలుమ్:** శిష్యుడు ఒక ప్రత్యుపకారము చేయకపోయినను, ఆచార్యుడు చెప్పినది విని ఆప్రకారము నడచుకోతగినవాడైయుండవలెనుగదా! అటుల తిరుగుటకు

తగియుండని శిష్యులు ఉన్నను, అటువంటివారికి ఆళ్వారు మంచినే ఉపదేశించుటకు కారణమేమియనగా, శిష్యులు పడు తాపత్రయములు అనబడు దుఃఖములను జూచి, సహించలేకపోవుటయే అగును. ఈవిధముగ హితమునే ఉపదేశించువారెవరైనా ఉన్నారా అంటే, రావణుని దైన్యావస్థను జూచి

మిత్రమౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా।

వధంచానిచ్ఛతా ఘోరం త్వయాసౌ పురుషర్షభః।। (రా.సుం.కాం.21-19)

[ఓరావణా! నీవు నీవంశము నిలిచియుండవలెననితలంచినచో, ఘోరమైన వధమును కోరకపోయినచో, ఈపురుషశ్రేష్ఠుడగు శ్రీరాముని మిత్రునిగ చేసుకొనుట తగినది] అని సీతాపిరాట్టి రావణునికి హితమును ఉపదేశించెనుగదా! ఒకడు వాకిటి తలుపును, పెరటి తలుపును, గడియపెట్టి, తన ఇంటిలో పండుకొనినపుడు ఆఇంటికి నిప్పంటుకొనిన బైటనుండి చూచువారు ఆనిప్పును ఆర్పునపుడు వారికి ఒకలాభమున్నదనో, లేక ఇంటిలోనివాడు అడిగెనని ఆర్పుట కాదుగదా! ఆళ్వారి హితముగూడ అటువంటిదే అగును. **శెయల్ నన్ఱాగ:** ఆచార్యుడు ప్రత్యేకమైన లాభము లేకపోయినను, శిష్యుడు తగినవాడు కాకపోయినను, శిష్యుని ఎట్లు రక్షించును అనగా, ఆచార్యుడు తనకర్మలచే శిష్యునిలోపములన్నింటిని తగ్గించి వాని మంచితనము వృద్ధియగునట్లు చేసి రక్షించును. కర్మ(చేష్ట) అంటే, ఆచార్యుడు శిష్యునికి ఉపదేశించుట, తీర్చి దిద్దుట, మొదలైనవి ఆచార్యుని చేష్టలుగ చెప్పబడును. అటులగాక చేష్టలను శిష్యుని చేష్టలుగా కూడ తీసుకోవచ్చును. అపుడు, శిష్యుని చేష్టలు మంచివిఅగునట్లు ఆచార్యుడు చేయునని భావము. **తిరుత్తి ప్పణి కొళ్వాన్:** ఎవరిచేతనుగూడ దిద్దుటకువీలు కానివారినికూడ దిద్ది వారిని రక్షించువారు. 'తీర్న్ద అడియవర్ తమ్మై తిరుత్తి పణికొళ్ళవల్ల ఆర్న్ద పుగ అచ్చుదనై - '(తి.వా.మొ.3-5-11) అని ఆళ్వారు సాయించిన విధముగ పొందదగిన ప్రాప్యమును, పొందు మార్గమైన ప్రాపకమును ఎంబెరుమానుడే అని పూర్తిగా నమ్మిన దాసులనే వారియొక్కఆటంకములను ఎంబెరుమానుడు పోగొట్టి దాసులుగ స్వీకరించును. ఆళ్వారుమాత్రము అటులగాక ఎవ్విధమైన అర్హతలేనివారై, ఎంబెరుమానునిచే వదలివేయబడినవారిని గూడ దిద్ది రక్షింతురు. 'పణికొళ్వాన్ కురుగూర్ నమ్బి - కురుకాపురి పూర్ణుడు దాస్యమును స్వీకరించెను' అనికూడ అర్థమును తీసుకొనవచ్చును. **కుయిల్ నిన్ఱార్ పొழిల్ శూழ்'** అని ప్రారంభముచే ఈవిధముగ దిద్ది, వారి దాస్యమును స్వీకరించుటకు ఒక ఉదాహరణమును చూపుచున్నారు. నమ్మాళ్వారు ఎంబెరుమానుని (మానసా)నుభవము లేకయున్నకాలమందు, ఎడబాటు సహించలేక, 'కాణవారాయ్ - కనిపించునట్లు రావయ్యా'(తివా.మొ.8-5-2) అని వాపోయెడి పాశురములు ఉన్నవి. ఆఅనుభవమును పొందునపుడు, 'యావర్ నిగర్ అగల్ వానత్తే - ఎవరు లోకమునందు ప్రకాశింతురో' (తి.వా.మొ.4-5-8) అని ఆనందముతో సాయించు పాశురములును ఉన్నవి. వీరి పాశురములను మరలమరల వినిన కోకిలలుకూడ ఇట్లు విను అలవాటుచే ఆపాశురములనే చెపుతూ ఉండును. అందుచే రెండువిధములైన పాశురములను అలవాటు చేసుకొని వాటినే చెప్పు కోకిలలే ఉదాహరణమయినవి. ఇచ్చట 'కుయిల్ గళ్' అను పదముచేత శిష్యులను చెప్పుచున్నది. **కురుగూర్ నమ్బి:** 'ఊరుమ్ నాడుమ్ ఉలగుమ్ తన్నైప్పోల్ - ఊరును, దేశమును, లోకమును, తనవలెనే' (తి.వా.మొ. 6-7-2) అని ఆళ్వారు సాయంచినవిధముగ వివేకముగల మనుజులు మాత్రమే గాక, తిర్యక్కులైన పక్షులు మొదలైన వాటినిగూడ ఆళ్వారిపాశురములను అలవాటు చేసుకొను విధముగ వీరి గొప్పతనమున్నది. **ముయల్ గిన్ఱేన్ ఉన్దన్ మొయ్ కழ்క్కన్బైయే:** విశేషమైన నీశ్రీపాదముల విషయములో ప్రీతినేకోరితిని. 'మొయ్' అన్న విశేషణం విశిష్టతను చూపుతుంది. ఆళ్వారుకు చేయుచున్న కైంకర్యములోనే సరిపోతుంది అనే భావన కలగకపోవుటచే ఆళ్వారులశ్రీపాదములలో పెరుగుతున్న ప్రీతిచే

ఎక్కువవుతున్న అభినివేశము కావలెను అని ప్రార్థిస్తున్నారు. 'ఎన్నై త్తీమనమ్ కెడుత్తాయ్ ఉనక్కెన్ శెయ్గేన్ ఎన్ శిరీదరనే - నామనసునందలి చెడును పోగొట్టినావు, నీకు ఏమిచేతును, నాకుపకారకుడైన శ్రీధరా!' (తి.వా.మొ.2-7-8) (విషయాన్తరములలో అన్వయించుకొనుటయే ఇచట చెడు) అని ఆళ్వారు ఎంబెరుమానుని విషయమందు ప్రత్యుపకారము కనబడక మనస్సు అల్లకల్లోలమయినట్లుగ, ఆళ్వారివిషయ మందు ప్రత్యుపకారము ఏమియును తోచక మధురకవుల మనసు అల్లకల్లోలం అగుచున్నది.

పదవపాశురమునకు పెరియవాచ్చాన్పిళ్ళైవ్యాఖ్యానవివరణము పూర్తియైనది.

## నఞ్జీయరువారి వ్యాఖ్యాన విశేషములు

**అవతారిక: ఆళ్వారు** తమకు చేసిన ఉపకారమును తలచుకొని తాము వారియెడ చూపించిన ప్రేమ, ప్రీతి, ఏమీ లెక్కకురానిదని తోచి ఆళ్వారును గురించి, 'దేవరా! శ్రీపాదములవద్ద దాసుడు ప్రీతిని (ప్రేమను) చూపించ ప్రారంభమే ఇది' అంటున్నారు మధురకవులు. పంటచేలు మొదట లేతమొక్కలుగయుండి, క్రమముగ ముదిరి, పైరుగా మారుతుంది. అటులనే నాయొక్క భక్తిపంట ఇపుడు లేతగయున్నది, అది పక్వమునకు రావలెననిన, చాలదశలు దాటవలెను అంటున్నారు ఈపాశురంలో.

**వ్యాఖ్యానము: పయనన్ఱాగిలుమ్ పాఙ్గలరాగిలుమ్:** తనను ఆశ్రయించలేనివారగుటచే, కనీస ఆశ్రయణార్హత గాని, అవకాశము గాని, వివేకముగాని లేనివారిని ఎంబెరుమానుడు చేయూతనివ్వకుండ వదలును. ఆయన ఎంబెరుమానుడు గనుక వదలును. అటులగాకుండ ఆళ్వారులు అటువంటివారినిగూడ స్వీకరించి చేయూత నిత్తురు అని భావము. **శెయల్ నన్ఱాగ: ఆళ్వారులు వేంచేసియుండు** స్థానమును చూచినవెంటనే దురాలోచన గలవారు (చెడు నడవడిగలవారు), మంచినడువడిగలవారుగ మారిపోదురుగదా! ఎంబెరుమానుని విషయమందు తమ యోగ్యతను చూచి ప్రవేశించవలెను. అట్లుగాక ఆళ్వారివద్దకు యోగ్యత లేనివారుకూడ ప్రవేశించు అవకాశమునిచ్చునదిగదా ఆళ్వారి సౌశీల్యము. **కుయిల్ నిన్ఱార్ పొళ్ళిల్ శూళ్:** ఈవిధముగ ఆళ్వారిని ఎవరైనను పొందుదురు అనుటకు దృష్టాంతము: సామగానము చేయు నిత్యులు, ముక్తులే ఎంబెరుమానునివద్దకు చేరగలరు. మోక్షము పొందవలెను అను కోరికగల అందరును ఆళ్వారులను చేరవచ్చును. **కురుగూర్ నమ్బి:** ఎంబెరుమానునితో, నిత్యులతో, ముక్తులతో విచక్షణలేకుండ అందరును ఆనందము పొందునట్టిదిగదా ఆళ్వారుల పూర్ణత. 'పణికొళ్వాన్ కురుగూర్ నమ్బి - కురుగూరి పూర్ణుడైన నమ్మాళ్వారు దాస్యమును స్వీకరించెను' అని కూడ అర్థము చెప్పుకొనవలెను. 'పణికొళ్వదఱ్కాగ ముయల్ గిన్ఱేన్ - దాస్యమును స్వీకరించునట్లు ప్రయత్నించితిని' అని అవతారికలో చూపినట్లుగకూడ అర్థము తీసుకొనవలెను.

నఞ్జీయరు వ్యాఖ్యానవిశేషములు పూర్తియైనవి.

## అళ్గియమణవాళప్పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యాన విశేషములు.

**అవతారిక:** వెనుకటి పాశురములలో ఆళ్వారుల ప్రాప్యత్వము, ప్రాపకత్వము, జ్ఞానప్రదత్వము, హేయగుణప్రత్యనీకత మొదలైన విశేషములను అన్నింటినీ కటాక్షించుచు అటువంటి ఆళ్వారులు తమవిషయమందు చేసిన ఉపకారములను వివరించినారు. తమదోషమునకు ఎదిరియైన ఆళ్వారుల గొప్పతనము తమలోపములకు ఎదిరియైన ఆళ్వారుల ఉపకారగుణము మొదలైన వాటిని ఇంతవరకును సాయించినారు. ఈపాశురమందు అట్టి ఉపకారమునకు ప్రత్యుపకారమును వెదకి, కానరాకపోవుటచే, దిగులు పడుచున్నారు. 'వేదత్తిన్ ఉట్పొరుళ్ నిఱ్కప్పాడి ఎన్నెఞ్జుళ్ నిఱుత్తినాన్' 'యో మా దదాతి స ఇదేవమావాః

- ఎవడు నాకు పరమాత్మను ఇచ్చుచున్నాడో వాడే నాకు రక్షకుడు' (తై.భృ.10-6) అని ముముక్షుదశకును ముక్తిపొందువానిస్థితికిని వాసిలేకుండ ఆచార్యుని విషయమందు వాడు చేయు శుభమును(మంచిని) కృతజ్ఞతతో అనుసంధించుటతప్ప ప్రత్యుపకారముచేసి పూర్తిచేయుట కుదరదు. ప్రత్యుపకారమును ఎదురు చూడకయుండుట ఆచార్యలక్షణము. ఏదైన ప్రత్యుపకారము చేయుటకాశపడుట శిష్యలక్షణము. ఇట్టి శిష్యలక్షణము నెఱవేరు మార్గమును వెదకి కానరాకపోవుటచే దిగులు పడుచున్నారు. ఆచార్యుడు చేయు ఉపకారము శిష్యుని ప్రత్యుపకారము చేయవలెనను ఆశలో చేరును. ఆచార్యుడు చేయు ఉపకారపు గొప్పతనము శిష్యుని ప్రత్యుపకారముచేయు స్వభావము గలవానిగ చేయును. 'ఏమి ప్రత్యుపకారమును చేతును అనెడి ఆర్తితో శిష్యుడు కాలమును వెళ్ళబుచ్చు నట్లుండును. భగవద్విషయమందే వానిఆత్మనే వానికి సమర్పించుట ఉండును. ఆచార్యుడు తానే తీర్చిదిద్దిన శిష్యుని ఆత్మను శిష్యుడు ఆచార్యునకు సమర్పింప వీలుగాదు.

**వ్యాఖ్యానము: పయనన్ఱాగిలుమ్, పాఙ్గలరాగిలుమ్:**

ధర్మార్థౌ యత్ర న స్యాతాం శుశ్రూషా వా తథావిధా।
తత్ర విద్యా న వప్తవ్యా శుభం బీజవవోషరే।। (మనుస్మృతి 2-112)

[ధర్మము, అర్థము, ఏశిష్యునివద్దలేవో, అటులనే శుశ్రూషకూడ ఎవని వద్దలేదో, మంచి విత్తనమును ఊషరక్షేత్రమందు నాటుట ఎట్లు కూడదో, అట్లే వానికి విద్యను చెప్పకూడదు.] అనినప్రకారము శిష్యునివద్ద ధర్మము, అర్థములు రెండును ఉన్నచో, ఆచార్యునకు అదియుపయోగపడును. వినుటయందు కోరికయును, అందువలన వృద్ధిచెందు కైంకర్యమును శిష్యునివద్దయున్నచో, అది శిష్యునకు అర్హతనిచ్చును. ఈరెండును నావద్దలేకపోయినను, ఆవారు నాకు ఉపదేశించినారు. అని భావము.

శ్రూయతాం పరమార్థో దైతేయా దనుజాత్మజాః।
నచాన్యథైతన్మంతవ్యం నాత్రవోపాధికారణమ్।। (వి.పు.1-17-55)

[అసురపుత్రులారా! నావద్దనుండి ఈసత్యమైన అర్థమును వినుడు. దీనిని వేరు విధముగ తలచవద్దు. ఇది విషయములందు ఆశమొదలైనవి కారణముగాదు.] అనునట్లుగ ప్రహ్లాదుడు మొదలగు సత్పురుషులు తమకు ఒకప్రయోజనమును కోరక అడిగిన శ్రోతలదుర్గతిని చూచి ఉపదేశించువారు. ఆఴ్వారుకూడ అట్టివారే. ఇచ్చట పయన్ అంటే ఆచార్యునకు దొరకు లాభము. అట్లుగాకుండ శిష్యునకు గలుగు లాభమును గురించినదిగా తలంచవలెను. అనగా ఈశిష్యునికి ఉపదేశించుట ఫలములేనిదైనను, ఆఴ్వారులవంటి కృపామాత్రప్రసన్నాచార్యులు ఉపదేశించక ఉండలేరని భావము. **శెయల్ నన్ఱాగ తిరుత్తి:** జ్ఞానమును ఉపదేశించుటతో ఆగక అనుష్ఠానమువరకు నాకు పెరుగుటకు తెలియునట్లు ఉపదేశించి దిద్దినారు. క్షుద్రబంధువునకు వాని దుర్గతినిచూచి ఒకవైష్ణవుడు గోవిందనామమును ఉపదేశించగ, వానికి అది చాలకాలము తరువాతనే ఫలమునిచ్చెను. వీరు ఊరును,, వాడను, లోకమను తనవలెనే మార్చినవారగుటచే చేసినకార్యమును బాగుగా దిద్దినారు. **శెయల్ నన్ఱాగ తిరుత్తి:** ఆచార్యుడు శిష్యుని దిద్దుబాటు చేయునపుడు మొదట వాడు మంచిఅర్థములను వినునట్లుగ చేయవలెను. ఆతరువాత అట్లు విన్నఅర్థమును అనుసంధానము చేయునట్లు చేయవలెను. ఈవిధముగ శ్రవణమననములు ఉండిన తరువాత శిష్యునకు మహావిశ్వాసమును కలిగించవలెను. ఆతరువాత జ్ఞానమునకుతగిన అనుష్ఠానముండునట్లు చేయవలెను. అట్టి అనుష్ఠానమందును, దోషభూయిష్టమైన అనుష్ఠానము కలవకుండ మంచి అనుష్ఠానమునే స్వీకరించునట్లు చేయవలెను. ఇదే కార్యము బాగుగా దిద్దినట్లగును. **తిరుత్తి:** ఈవిధముగ తిరుగుచున్నపుడు ఎట్టి స్థితియందును, నావద్ద

ఏభారమును విడవకుండ తామే పూర్తిగ భారమును తీసుకొని దిద్దినారు. **పణికొళ్వాన్:** భగవద్భాగవత విషయములలో కైంకర్యముచేయునట్లు నన్ను చేసినారు. భగవత్కైంకర్యమును చేయవలెను, భాగవత కైంకర్యమునుకూడ చేయవలెను. అంతియేకాక ఆచార్య కైంకర్యమునుగూడ చేయవలెను. వైష్ణవకైంకర్యము కూడ చేయవలెను. భగవద్భాగవత కైంకర్యము ఆచార్యునికి ఆనందమును కలిగించును. ఆచార్య కైంకర్యము భగవానునకు, భాగవతులకు ఆనందాన్ని కలిగిస్తుంది. భగవానుడు, భాగవతుడు, ఆచార్యుడు ఈముగ్గురి విషయమందును కైంకర్యము వీనికి అవశ్యమైనది. ఎంబెరుమానునికి అనన్యార్హశేషమైన స్వరూపమును కలిగినవాడగుటచే, భగవత్కైంకర్యము సహజముగనే ఉండును. భగవానుడు సంతోషించినవాడగుటచే భాగవతకైంకర్యము, దానివలనకలుగు భాగవతుల ఆనందము శిష్యునికి ఉండును. ఆచార్యుడు భగవద్భాగవతుల గొప్పదనాన్ని ఉపదేశించుటచే శిష్యునికి కలిగిన కృతజ్ఞతకూడ ఆచార్య కైంకర్యమును పుట్టించును. ఈవిధముగ ఒకదానినుండి ఒకటి ఏర్పడుతూ ఉండేటట్లు ఈమూడు కైంకర్యములును కలవు. ఇందు భగవత్కైంకర్యము సహజముగ చేతనస్వరూపముచే పుట్టును. 'ఆ ఎంబెరుమానునకు దాసులగుటచే మనకుగూడ వారు ఉద్దేశ్యులే అను కారణముచే భాగవతకైంకర్యము పుట్టును. ఆచార్య కైంకర్యము ఆయన చేయు ఉపకారము కారణముగా పుట్టును. ఆచార్యుడు తన ఉపదేశముచే ఆజ్ఞానానికి తగిన అనుష్ఠానమును తను అనుష్ఠించడంద్వారా చూపి, దానిలోకూడ నేర్చుకొనిన అనుష్ఠానము శిష్యునియందు కలిగినతరువాత ఆచార్యుడు శిష్యుని భగవద్భాగవతకైంకర్యముచేయతగినవాడని తీర్మానిస్తాడు.

* **పణికొళ్వాన్ కుయిల్ నిన్ఱార్ పొழిల్ శూழ் కురుగూర్ నమ్బి:** వివేకంలేని పక్షులుకూడా, ఆழ்వారి సంబంధంవల్ల మారిపోయి తిరువాయ్మొழிని పాడడంనేర్చుకుని పాడుతున్నప్పుడు వివేకం ఉన్న మనస్సులు మారడంగురించి వేరే చెప్పాలా! కోకిలలు, చెట్టుకొమ్మలతోసంబంధం కలిగిఉండడంవల్ల సహస్రశాఖలుగల సామవేదసారమైన తిరువాయ్మొழிని పాడేయి. అవి "పాడుమ్ కుయిల్గళ్" [నాచ్చి.తి.10-5] [పాడే కోకిలలు] గనుక తమస్వాములైన అఱైయర్లలా ఆழ்వారి తిరువాయ్మొழிని పాడుతున్నవైనాయి. "శెవ్వాయ్క్కిళి నాన్మఱైపాడు తిల్లై త్తిరుచ్చిత్రకూడమ్" [పెరియ తిరు. 3-2-6] [ఎర్రనినోరుగల చిలకలు నాలుగువేదాలనీపాడుతూండే చిత్రకూటం] అన్నట్లుగా ఒకదివ్యదేశంతోసంబంధం ఉండడంవల్ల చిలక సంస్కృతవేదాన్ని వల్లెవేయగలిగినప్పుడు ఇక్కడున్న కోకిలలు తిరువాయ్మొழிని పాడంలో వింతేంలేదు గదా! తాము మధురకవిగనుక మధురమైన గొంతుగల కోకిలలతో తోటలని శోభాయమానంగా చేస్తున్నారు.

**కురుగూర్ నమ్బి:** పెట్టుబడిని ఎదురుచూడని పూర్ణులు! అని ఆழ்వారిని వర్ణిస్తున్నారు. సర్వేశ్వరుడు అవాప్తసమస్తకాముడు(అన్నికోరికలూ తీరినవాడు) గనుక ఆయనకి కైంకర్యం అవసరంలేదు. అయినా అర్చావతారంలో ఆయన అర్చకపరాధీనుడుగనుక కైంకర్యం చెయ్యవలసిన అవసరం ఉన్నది. ఆచార్యుడు ఈలోకంలో శుభాలని, కర్మలవల్ల కలుగచేస్తాడు; పరమపదంచేర్చే శుభాలని, సర్వేశ్వరుడిద్వారా కల్పించేవాడు. కనుక ఆయనకి కైంకర్యం చెయ్యగల అవకాశం కలగడం చాలా అరుదైనది. అందుచేత, సర్వేశ్వరుడి పూర్తికంటే ఆழ்వారులపూర్తి విశేషమైనది.

**ఉన్దన్ మొయ్కழలుక్కు అన్బైయే ముయల్గిన్దేన్:** నీ అతిమధురమైన శ్రీపాదాలమీద ఉన్నప్రీతివల్ల నీకు ప్రత్యుపకారం చెయ్యాలి అనే నాకోరిక ప్రయత్నంలోనే ఉన్నది. ఈప్రయత్నంతప్ప ఆచార్య విషయంలో ప్రత్యుపకారంచెయ్యడానికి వేరుమార్గమే లేదుగదా! "ఉనక్కెన్ శెయ్గేన్"(తిరువాయ్.

2-7-8)[నీకు ఏమి చెయ్యగలను?] అనిన్నీ, "అప్పనుక్కు ఎదువుమొన్డుమిల్లై శెయ్‌వదిఙ్గుమజ్జే" (తిరువాయ్. 7-9-10)[స్వామికి ఇక్కడా అక్కడాకూడా చేయవలసింది ఏమీలేదు] అనిన్నీ సర్వేశ్వరుడి విషయంలో ప్రత్యుపకారం కనబడక ఆళ్వారు దిగులుచెందినట్లుగానే వీరు ఆళ్వారులవిషయంలో ప్రత్యుపకారం ఏమీ కనబడక దిగులుపడుతున్నారు.

**మొయ్‌కళ్ఱల్:** "మొయ్ కళ్ఱలే ఏత్తముయల్ (పెరియ తిరువం. 87) అని ఆళ్వారు సర్వేశ్వరుడి శ్రీపాదాలని "మొయ్ కళ్ఱల్" అని చెప్పగా విన్నవారవడంవల్ల ఇక్కడకూడా ఆళ్వారులశ్రీపాదాలని "మొయ్ కళ్ఱల్" అని అంటున్నారు. "మేవినేన్ అవన్ పొన్నడి" (2) అన్నప్పుడు సహజంగా ప్రకాశాన్ని ఇచ్చేదై, తనతో సంబంధం ఉన్న మాణిక్యాలనికూడ ప్రకాశవంతమైనవాటిగా చేసే బంగారంలా ఆళ్వార్ల శ్రీపాదాలూ పరిశుద్ధమైనవై, వాటితో సంబంధం ఉన్నవాళ్లనికూడా పరిశుద్ధులుగా చేసేవని ఆళ్వారుల శ్రీపాదాల పావనత్వాన్ని చెప్తున్నారు. ఇక్కడ "మొయ్ కళ్ఱల్" అని వాటిభోగ్యతని (మాధుర్యాన్ని) చెప్తున్నారు. **మొయ్ కళ్ఱఱ్కు న్బైయే:** ఈశ్రీపాదాలు మధురమైన ప్రీతిని ఇస్తున్నాయి. ఆప్రీతి ప్రత్యుపకారం చెయ్యాలనే కోరికగా పరిణమించింది. కాని దానికి అవకాశం కనబడక దిగులుచెందుతున్నానంటున్నారు. ఈదిగులు తెలివిగా ఉన్నంతవరకూ (ఎప్పుడూ) ఉంటూనే ఉంటుందిగదా!

పదవపాశురానికి వ్యాఖ్యానవివరణాలు పూర్తి అయినవి.

**11. అన్బన్ఱన్నైయడైన్దవర్‌గట్కెల్లామ్**
**అన్బన్ తెన్‌కురుగూర్ నగర్‌నమ్బిక్కు**
**అన్బనాయ్ మదురకవి శొన్నశొల్**
**నమ్బువార్ పదివైగున్దమ్ కాణ్మినే.**

ప్రతిపదార్థము: **అన్బన్ తన్నై:** ఆశ్రితపక్షపాతియైన సర్వేశ్వరుడిని, **అడైన్దవర్‌గట్కు ఎల్లామ్:** ఆశ్రయించిన సకలభాగవతులమీదను, **అన్బన్:** భక్తిగలవారైన, **తెన్ కురుగూర్ నగర్‌నమ్బిక్కు:** నమ్మాళ్వారుల విషయంలో **అన్బనాయ్:** భక్తుడైయుండి, **మదురకవి శొన్న శొల్:** మధురకవి సాయించిన ఈదివ్యప్రబంధాన్ని, **నమ్బువార్:** (తమకు శరణ్యముగా) విశ్వసించినవారికి **పది:** వాసస్థానం, **వైగున్దమ్ కాణ్మిన్:** పరమపదమే.

అవ: ఈప్రబంధానికి చివరిదైన ఈపాశురంలో ఈప్రబంధాన్నే శరణంగా తలంచినవారికి వాసస్థానం పరమపదమే అంటున్నారు.

**వ్యాఖ్యానం: అన్బన్:** సర్వేశ్వరుడు దాసుల దోషాలనికూడా గుణాలుగానే స్వీకరించే వాత్సల్య గుణంతో నిరూపించబడేవాడు. ఫలానివాళ్ళకి ప్రీతైనవాడు అని ప్రత్యేకంగా చెప్పలేదుగనుక ఈఅర్థం స్పష్టం అవుతోంది.

*సఖే రాఘవ ధర్మజ్ఞ రిపూణామపి వత్సల। అభ్యనుజ్ఞాతుమిచ్ఛామి గమిష్యామి యథాగతమ్।।*

(రా.యు.50-56)

(సఖుడా, రఘువంశజాతుడా! ధర్మాన్ని తెలిసినవాడా! శత్రువులమీదకూడా వాత్సల్యం గలవాడా! తిరిగివెళ్ళడానికి అనుమతి కోరుతున్నాను. ఎలావచ్చేనో అలాగే వెళ్తాను) అని శ్రీరామాయణంలో గరుత్మంతుడు చెప్పినట్లు అందరిమీదా ప్రేమనిచూపించే వాత్సల్యగుణాన్నికలిగిన సర్వేశ్వరుడిని చూపుతోంది. ఎలా అంటే,

*సర్వేషామేవ లోకానాం పితా మాతాచ మాధవః। గచ్ఛధ్వమేనం శరణం శరణ్యం పురుషర్షభాః।।*
(భా.ఆర.192-56)

(పురుషశ్రేష్ఠులారా! సమస్తలోకాలకీ తల్లీ, తండ్రి కూడా లక్ష్మీనాథుడే. శరణ్యుడైన ఈతడిని శరణం పొందండి.) అన్నట్లుగా ఆయన లోకాలన్నింటికీ తల్లీ తండ్రీ ఐనవాడు.

***దేవానాం దానవానాంచ సామాన్యమధిదైవతం। సర్వదా చరణద్వంద్వం వ్రజామి శరణం తవ।।*** (జితంతే-2)
(భక్తులైన దేవతలకీ, భక్తిలేని రాక్షసులకీ ఎల్లప్పుడూ ఆశ్రయించడానికితగిన సామాన్యమైన దేవతగానున్న నీశ్రీపాదద్వంద్వాన్ని ఉపాయంగా వరిస్తున్నాను) అనిచెప్పినట్లుగా ఇలా అందరినీ సృష్టించేవాడుగా ఉన్న సంబంధం, మంచివాళ్ళనీ, చెడ్డవాళ్ళనీ వ్యత్యాసంలేకుండా అందరికీ సామాన్యుడైఉంటాడు. ఈవిధంగా ఈయన లోకాలన్నింటికీ వాత్సల్యపూర్ణుడవడంచేతనే "అన్బన్"అని సర్వేశ్వరుడిని అందరూ చెప్పు కుంటారు.

**తన్నై అడైన్దవర్గట్కెల్లామ్ అన్బన్ తెన్కురుగూర్ నగర్ నమ్బి:** నమ్మాళ్వారి ప్రేమ అలా అందరికీ సామాన్యమైనటువంటిది గాదు.

**"పరమనై ప్పయిలుమ్ తిరువుడైయార్ యవరేలుమ్ అవర్ కణ్డీర్**
**పయిలుమ్ పిఱప్పిడైదోఱు ఎమ్మైయాళుమ్ పరమరే"** (తిరువాయ్. 3-7-1)
[సర్వేశ్వరుడిని ఆశ్రయించి ఉండడం అనే సంపదగలవారు ఎవరైనా, వారే మమ్ములని జన్మజన్మలకీ పాలించేవారు] అనిచెప్పినట్టు సర్వేశ్వరుడికి దాసులైనవాళ్ళమీదనే ఎప్పుడూ ప్రేమ గలవారు వీరు. తమలాగే **"అడిక్కీళ్ అమర్న్దు పుగున్దేన్"** (తిరువాయ్. 6-10-10) [శ్రీపాదాలవద్ద చక్కగా అమిరియుండి ప్రవేశించేను.] అని సర్వేశ్వరుడినే ప్రాప్యంగానూ, ప్రాపకంగానూ ఆశ్రయించినవారు ఎవరైనాసరే వాళ్ళే తమకి ఎప్పుడూ స్వాములు అని తలంచేవారుగదా ఆళ్వారులు!

**తెన్కురుగూర్నగర్ నమ్బి:** "అడియార్ అడియార్దమ్ అడియారడియార్ తమక్కు అడియార్ అడి యార్దమ్-అడియార్ అడియోజ్గళే" (తిరువాయ్.3-7-10)[దాసులకి సంబంధించినవారికి దాసభూతులం] అన్నట్లు ఏడుతరాల దాసులమీద ప్రీతిగలవారుగనుక, ప్రేమచేత పూర్ణులైనవారు ఆళ్వారే అవుతారు

**నమ్బిక్కన్బనాయ్:** సర్వేశ్వరుడిమీద ప్రేమగలిగి ఉండడం, ఆయనదాసులమీదకూడా ప్రేమనికలిగి ఉండడం, అంతేకాకుండా, ఆచార్యులైన నమ్మాళ్వారి విషయంలోకూడా ప్రీతినికలిగినవారు మధురకవులనే తాము, అనిభావం. తనకి ప్రయోజనాన్ని కోరుకొన్నవారైయుంటే సర్వేశ్వరుడిని ఆశ్రయిస్తే సరిపోయిఉండేది. కాని ఇలాఒకడు తనకి సంతోషంకలిగించే ప్రయోజనాన్ని ఆశించకుండా, సర్వేశ్వరుడిసంతోషమే ప్రయోజనం అని అనుకుంటే సర్వేశ్వరుడిదాసుల(భాగవతుల)నికూడా తాను ప్రాప్యప్రాపకాలుగా అంగీకరించాలి.

**ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** (గీత-7-18) [వీరందరూ ఉదారులే. జ్ఞానిమాత్రం నాకు ఆత్మ (ధారకుడు) అని నా సిద్ధాంతం.]

**ద్విషదన్నం న భోక్తవ్యం ద్విషంతం నైవ భోజయేత్। పాండవాన్ ద్విషసే రాజన్ మమ ప్రాణాహి పాండవాః।।** (భా.ఉ.74-27)
[ద్వేషించేవాడి అన్నం భుజించతగినదిగాదు. ద్వేషించేవాడిని భుజింపజేయడం కూడదు. రాజా! నువ్వు పాండవులని ద్వేషిస్తున్నావు. పాండవులు నాకు ప్రాణాలుగదా!] అన్నట్లుగా తనని ఆశ్రయించినవాళ్ళవంటి జ్ఞానులే తనప్రాణాలు నిలిపేవాళ్ళు అని భావించేవాడుగదా సర్వేశ్వరుడు!] అని తనని ఆశ్రయించిన

పాండవులవంటి జ్ఞానులే తనప్రాణాలని నిలిపేవాళ్ళు అని భావిస్తున్నానని చెప్పినవాడుకదా సర్వేశ్వరుడు! కనుక, భాగవతులనికూడా ప్రయోజనంగా తీసుకుంటేనే సర్వేశ్వరుడి ఆనందం సిద్ధిస్తుంది. సర్వేశ్వరుడు, .శ్రీవైష్ణవులైనవారు, మొదలైనవారందరి ఆనందాన్ని ప్రయోజనంగా స్వీకరించినవాడికి నమ్మాళ్వారులాంటి ఆచార్యలక్షణపూర్తిగలవారే ఆశ్రయించదగినవారు.

**ఆచార్యవాన్ పురుషో వేద** (ఛాం. 6-14-2) [ఆచార్యుడుగల పురుషుడే (సత్తని) తెలుసుకున్నవాడు] అనిచెప్పినట్లుగా అటువంటి ఆచార్యుడిని ఆశ్రయించినవాళ్ళనిగదా శ్రీవైష్ణవులు సంతోషిస్తారు! ఆచార్యుడు అనేవాడు మొదట శిష్యుడికి తెలియనివిషయాలని తెలియజేసి, వాడికి స్వరూపజ్ఞానాన్ని కలిగిస్తాడు. సర్వేశ్వరుడిని ఆశిష్యుడు ఆశ్రయించేటప్పుడు, ఆచార్యుడు పురుషకారంగా ఉంటాడు. తనఅనుష్ఠానంవల్ల తాను ఇక్కడున్నంతవరకూ శిష్యుడిని సన్మార్గంలో నడిపిస్తాడు. పరమపదం చేరినతరువాతకూడా వీడికి కైంకర్యాన్ని పెంపొందింపజేస్తాడు. ఇలా ఎన్నోవిధాలుగా ఆచార్యుడే శిష్యుడికి పరమప్రాప్యుడై ఉంటాడు. "నమ్బిక్కు అన్బన్" అని ఈవిషయాన్ని చెప్తున్నారు.

***మదురకవి శొన్న శొల్:*** "మదురకవిశొల్"-మధురకవుల సూక్తి- అంటేనే సరిపోతూండగా "శొన్న శొల్" - సాయించిన సూక్తి - అనడంవల్ల ఆళ్వారిని గురించి తాము చెప్పిన ఈప్రబంధం తమకు మధురంగా ఉండడాన్ని చూపిస్తున్నారు. అందువల్లే మధురకవి అనే తాము పేరు పొందేనని కొసమెరుపుగా చెప్తున్నారు. **శొన్న శొల్ నమ్బువార్ పది వైగున్దం కాణ్మినే:** మధురంగా ఉన్నప్పటికీ, ఈప్రబంధాన్ని శరణుగా భావించేవారికి పరమపదమే ఆనందంగా కాలం గడపడానికి వాసస్థానం అని ఫలాన్ని సాయిస్తున్నారు.

ఆళ్వారే పరమప్రాప్యులుగనుక (మహాఫలం గనుక) ఆళ్వార్‌తిరునగరిగదా పరమప్రాప్యస్థానం అవాలి! అలాంటప్పుడు వైకుంఠం పరమప్రాప్యం అని చెప్పడం తగునా అంటే, ఆళ్వార్‌తిరునగరిలో అక్కడ వేంచేసి ఉన్న పొలిన్దు నిన్ఱపిరానుదీ, నమ్మాళ్వారిదీ - ఇద్దరి ఆజ్ఞా కలిసి నడుస్తుంది. కాని పరమ పదంలో ఆళ్వారిఆజ్ఞే చెల్లుతుందిగనుక, సుఖంగా ఆనందంగా గడిపే వాసస్థానం పరమపదమే అంటున్నారు. **"అడియార్ నిలాగిన్ఱ వైగున్దమ్"** అని తిరువిరుత్తంలోనూ, **"వానవర్ నాడు"** అని తిరువాయ్‌మొళ్ళిలోనూ పరమపదాన్ని భాగవతులదేశం అనిగదా నమ్మాళ్వారు సాయించేరు! **"నమ్బువార్ పది వైగున్దమ్"** అన్నదానికి "భాగవతులు వేంచేసిఉన్న దేశమే పరమపదం అవుతుంది" అని నమ్బి తిరువళ్ళుది వళనాడుదాసర్ అనే పరమభాగవతులు అర్థంచెప్పేవారని నంజీయర్‌వారూ, నమ్బిళ్ళైగారూ, పెరియ వాచ్చాన్‌బిళ్ళైగారూ సాయించిన మూడువ్యాఖ్యానాలలోనూ మనకి కనబడుతుంది. నమ్మాళ్వారు కూడా **"ఉరైక్కవల్లార్క్కు వైగున్దమాగుమ్ తమ్మూరెల్లామ్"** అని తిరువాయ్‌మొళ్ళిలో సాయించేరుగదా!

ఈదివ్యప్రబంధాన్ని విశ్వసించేవాళ్ళున్న దేశమే పరమపదం అనే నమ్బి తిరువళ్ళుది వళనాడు దాసర్‌వారి సూక్తిని నిరూపించే మరొక ఐతిహ్యాన్ని నంబిళ్ళైగారు సాయించేవారని పెరియవాచ్చాన్ పిళ్ళైగారు సాయించేరు. అదేమిటంటే - కూరత్తాళ్వాన్ కుమారులైన భట్టర్‌వారు అవతరించినతరువాత సంసారానికీ, పరమపదానికి మధ్యని ఉన్న అడ్డుగోడని కూల్చేసి పరమపదానుభవమే ఇక్కడకూడా జరుగుతుండడం ప్రత్యక్షంగా మనం ఇప్పుడు చూస్తున్నాంగదా అని నంజీయరువారిశిష్యులలో ఒకరైన పెత్తి అనే భాగవతులు నమస్కరించేవారని నంబిళ్ళైగారు సాయించేరట..

పదకొండవపాశురానికి పెరియవాచ్చాన్‌బిళ్ళైగారి వ్యాఖ్యాన వివరణం పూర్తి అయినది.

## *నఙ్జీయర్ వ్యాఖ్యాన విశేషాలు.*

వ్యా: **అన్బన్:** సర్వేశ్వరుడికి ప్రధానమైన స్వరూపం (స్వరూపనిరూపకం) ఈశ్వరత్వంకాదు. శత్రువులమీదకూడా వాత్సల్యాన్ని చూపించడం అనే వాత్సల్యగుణమే ప్రధానమైన స్వరూపనిరూపకం. **అన్బన్....అన్బన్:** "తన్దామ్ సత్తైయిలేయన్ఱో ఎల్లోరుమ్ స్నేహిప్పదు" - [తమతమ సత్త(ఉనికి)లోనేగదా అందరూ స్నేహంచేయడం]అన్నది ఇక్కడున్న నంజీయరువారి వ్యాఖ్యానవాక్యం. శత్రువుమీదకూడా ప్రేమనిచూపడం అనే వాత్సల్యం సర్వేశ్వరుడికి స్వరూపనిరూపకం. అటువంటి సర్వేశ్వరుడి దాసులే ధారకులవడంవల్ల వాళ్ళమీదప్రేమగలిగినవారై ఉండడం ఆళ్వారికి స్వరూపనిరూపకం అన్నది ఈవాక్యానికి అర్థం.

**తెన్కురుగూర్ నగర్ నమ్బిక్కు అన్బన్:** నమ్మాళ్వారికే ప్రీతిపాత్రుడై ఉండడం శ్రీమధురకవులకి స్వరూపనిరూపకం. **అన్బనాయ్ మదురకవి శొన్న శొల్:** ఆళ్వారిమీద ఉన్న ప్రేమ ప్రేరేపించడంవల్ల వీరు ఈప్రబంధాన్ని సాయించేరు. " తన్ శొల్లాలే తాన్ తన్నై కీర్త్తిత్తమాయన్ ఎన్ మున్ శొల్లుమ్" (తిరువాయ్ మొ. 7-9-2) [ తన సూక్తిచేత తాను తనని ప్రతిపాదించిన ఆశ్చర్యభూతుడు నాకు ముందర సంత చెప్పిస్తాడు] అని ఆళ్వారు సర్వేశ్వరుడు సంతచెప్పిస్తే తాము తిరువాయ్మొళ్ళిని చెప్పినట్టు చెప్తారు. వీరు ఆళ్వారిదగ్గిర తమకిగలప్రేమ తమచేత సంతచెప్పిస్తే తాము కణ్ణినుణ్ శిఱుత్తామ్బుని రచించినట్లుగా చెప్తున్నారు. "తామ్ కాణవన్ద శోళ్గరోపాది: ప్రీతి కాణుమ్ శొల్లువిత్తదు." - తమని చూడడానికి వచ్చిన చోళులలాగ, ప్రీతి చెప్పిస్తున్నట్టుంది- అని నంజీయరువారి వ్యాఖ్యానం. "కాణవన్ద చోళ్గర్ పోలే" అనే ఈవృత్తాంతం పూర్వాచార్యుల వ్యాఖ్యాల్లో ఎన్నో చోట్ల వస్తుంది. ఆకాలంలో నాటకాలు, కుస్తీపట్లవంటి వీర్యప్రదర్శనలు మొదలైనవి జరిగినప్పుడు దానిని చూసి ఆనందించడానికి రాజులు వచ్చేవారు. అలాగే తమకి నమ్మాళ్వారిమీద ఉన్న ప్రేమ వీరిచేతచెప్పిస్తే చెప్పిన ఈదివ్యప్రబంధాన్ని ఆనందించేవారిలో ఒకరుగా తాము (మధురకవులు) అన్వయించుకున్నారని భావం.

నంజీయరువారి వ్యాఖ్యానవిశేషాలు పూర్తి అయినాయి.

## *అళ్గియ మణవాళ్పెరుమాళ్ నాయనార్ వ్యాఖ్యానవిశేషాలు.*

అవ: ఈప్రబంధంమీద ఆదరం ఉన్నవారికి ఆళ్వార్తిరునగరే ప్రాప్యస్థలమై ఉన్నప్పటికీ, నిత్యసూరులు పరమపదంలో ఒకస్థలం వీరికి లభించేలా చేస్తారు.

వ్యా: **"అన్బన్ తన్నైయడైన్దవర్గట్కెల్లామ్ అన్బన్"** 'అన్బన్' అనే పదానికి మిగతావ్యాఖ్యానాలలో లాగ "సమస్తచేతనులయందును వాత్సల్యంగల సర్వేశ్వరుడు" అనే అర్థాన్నేకాకుండా, సర్వేశ్వరుడిమీద ప్రేమగల ఆళ్వార్ అనే అర్థాన్నికూడా, ఇలా రెండర్థాలు నాయనారులవారిచే తీసుకోబడ్డాయి.

**మద్భక్తజనవాత్సల్యం పూజాయాంచానుమోదనమ్।**
**స్వయమభ్యర్చనంచైవ మదర్థే డమ్భవర్జనం।।**
**మత్కథాశ్రవణే భక్తిః స్వరనేత్రాంగవిక్రియా।**
**మమానుస్మరణం నిత్యం యచ్చ మామ్ నోపజీవతి।।**
**భక్తిరష్టవిధా హ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేపి వర్తతే।**
**స విప్రేన్ద్రో మునిః శ్రీమాన్ స యతిః స చ పణ్డితః।।**
**తస్మై దేయం తతో గ్రాహ్యంస చ పూజ్యో యథాహ్యహమ్।।** (గారుడం- 219- 6..10)

[ (1). నాభక్తులమీద వాత్సల్యం, (2). నన్ను ఆరాధించడాన్ని ఆమోదించడం, (3). తానే నన్ను పూజించడం, (4). నావిషయంలో ఆడంబరం లేకుండా ఉండడం, (5). నాకథలనివినడంలో

ప్రీతికలిగిఉండడం, (6). (నా కథలని వినేటప్పుడు) గాత్రం గద్గదం అవడం, కళ్ళలో నీరు చిప్పిలడం,ఒళ్ళు గగుర్పాటు చెందడం, (7). ఎప్పుడూ నన్నే తలుచుకొంటూండడం, (8). నానుండి వేరు ప్రయోజనం కోరకుండా ఉండడం - అంటే అనన్య ప్రయోజనులై ఉండడం- అనే ఈఎనిమిదివిధాలైన భక్తి ఎటువంటివాడిలోనైనా -మ్లేచ్ఛుడిలోనైనా సరే- ఉంటుందో, అటువంటివాడే బ్రాహ్మణశ్రేష్ఠుడు, వాడే ముని, వాడే శ్రీమంతుడు, వాడే యతి, వాడే పండితుడు, వాడికి జ్ఞానాన్ని ఉపదేశించాలి, ఆతనినుండి జ్ఞానోపదేశమును పొందాలి. అటువంటివాడు నాలాగే పూజింపతగినవాడు.] అన్న ప్రమాణంలో సర్వేశ్వరుడి భక్తులమీద ప్రేమనికలిగిఉండడాన్ని భగవద్భక్తులకి మొదటి లక్షణంగా చెప్పడం మొదటి అర్థంప్రకారం ఆళ్వారికి తగియుండడాన్ని చూపిస్తున్నారు.

**అడైన్దవర్గట్కెల్లామ్ అన్బన్:** ఫలానావిధమైన ప్రేమగలవాడు అని చెప్పకపోవడంవల్ల చేరిన (ఆశ్రయించిన)వారందరికీ అన్నివిధాలుగానూ ఆళ్వారు సహజంగా ప్రేమగలిగి ఉంటారని చూపబడుతోంది.

**అన్బన్:** ఇతరులమీద ప్రేమగలవాడు, ఇతరులప్రేమ వీనిపై ఉంటుంది అని రెండువిధాలుగా అర్థం చెప్పుకోవాలి. అంటే - తాను ప్రేమించేటప్పుడు లోకాన్నంతటినీ ప్రేమిస్తున్నవారు. తననిప్రేమించినవారికి తామొక్కరే లక్ష్యం అయినవారు. సముద్రంలో మాణిక్యాలన్నీ ఎలాదాగి ఉంటాయో అలా ప్రేమ అనే వాత్సల్యగుణంలో ఇతరగుణాలన్నీ దాగి ఉన్నాయి. అందువలనే శ్రీమద్రామానుజులు గద్యలో **ఆశ్రిత వాత్సల్యైకజలధే!** (శ్రీరంగగద్య) [ఆశ్రితుల-దాసుల- విషయంలో వాత్సల్యానికి మహాసముద్రమైనవాడా!] అని సర్వేశ్వరుడిని వాత్సల్యానికి ఒకమహాసముద్రమైనవాడని సాయించేరు. అటువంటి సముద్రంలాంటి వాత్సల్యం ఆళ్వారికి ఉన్నది అని భావం.

తనని ఆశ్రయించి ఇతరప్రయోజనాలని ఆశించినవాళ్ళనికూడా "ఉదారాః" అని చెప్పే సర్వేశ్వరుడిలా ఆళ్వారుకూడా అందరిమీదా ప్రేమగలవారు. **అన్బన్:** ఈప్రబంధప్రారంభంలో "కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్ కట్టుణ్ణప్పణ్ణియ పెరుమాయన్ ఎన్నప్పనిల్" అని ప్రారంభించి, సౌశీల్యం, సౌలభ్యం, స్వామిత్వం అనే మూడు గుణాలూ ఆళ్వారికి ఉన్నాయని చెప్పేరు. ఇక్కడ చివరపాశురంలో "అన్బన్" అని ఆళ్వారి వాత్సల్యగుణాన్ని ఎత్తి చూపిస్తున్నారు. దీనిబట్టి ఆగుణాలన్నీ ఒకఎత్తైతే వాత్సల్యగుణం ఒక్కటీ ఒకఎత్తని చూపిస్తున్నారు. **శీలాదిగుణసంపన్నః సర్వలోకైకవత్సలః** [సౌశీల్యం మొదలైన గుణాలు గలవాడు, సమస్తలోకంమీదా వాత్సల్యంగల అద్వితీయుడైనవాడు] అని ఋషులుకూడా దీన్నే చెప్పేరు.

**అన్బన్:** 'తనిమాత్తెయ్వత్తళిరడిక్కీళ్ పుగుదలన్ఱి అవనడియార్ ననిమాక్కలవియిన్బమే నాళుం వాయ్క్క నజ్గట్కే" (తిరువాయ్. 8-10-7) [అద్వితీయమైన పరదేవతైన శ్రీమన్నారాయణుడి శ్రీపాదాలక్రింద ప్రవేశించకుండా, ఆయనదాసులైన శ్రీవైష్ణవుల సంశ్లేషమనేటటువంటి అమోఘమైన సుఖమే ప్రతిదినం మనకి కలగాలి] అని సర్వేశ్వరుడిని అనుభవించే ప్రేమని వదిలి, ఆయనదాససమూహాలని అనుభవించే ప్రేమలోనే అభినివేశం గలవారైఉన్నవారు ఆళ్వారు అని చూపిస్తున్నారు. **అడైన్దవర్గట్కెల్లాం అన్బన్:** ఆళ్వారిని స్వామిగానో సంబంధీకులుగానో ఉపాయంగానో, ఉపేయంగానో ఆశ్రయించే అందరిమీదా ప్రేమని చూపించేవారని అర్థం. వీరు ఆదరించడానికి ఆళ్వారితో ఏదోఒకసంబంధమే కావాలి.

**తెన్కురుగూర్ నగర్ నమ్బిక్కు అన్బనాయ్:** నీటివసతికి దగ్గరగా ఉండడంవల్ల బాగా పెరిగిన పంటచేలల్లా ఆళ్వార్తిరునగరిలో జన్మించడంవల్లే ఆళ్వారికి ఇటువంటి భగవద్భాగవతవిషయంలో ప్రేమ ఉన్నది. వారిప్రేమ సముద్రంలా ఇంకాఇంకా పెరిగిపోవడానికి కారణం ఆవూరిసంబంధమే. **నగర్:** ఆవూరిలో నివసించడంచేతనే వారు సారాసారవివేకజ్ఞులైనారు.

**అన్బనాయ్:** నమ్మాళ్వారికిగల .సర్వేశ్వరుడినిగురించిన జ్ఞానం, భక్తి మొదలైనమహత్త్వాలనిచూసే, మధురకవియాళ్వారు వారిని ప్రేమించేరు. **అన్బనాయ్ మదురకవి:** "ఆరాదకాదల్ కురుగూర్ చడగోపన్" (తిరువాయ్.2-1-11) [తృప్తితీరనిఆశ(ప్రేమ)గల కురుకాపురినిర్వాహకులైన శఠకోపులు] అని నమ్మాళ్వారికి సర్వేశ్వరుడిమీద ఉన్న సహజమైనప్రేమ స్వరూపనిరూపకం ఐనట్టుగా వీరికిన్నీ 'నమ్బిక్కు అన్బర్" అనిఆళ్వారిమీద ప్రేమగలవారు అన్నది స్వరూపనిరూపకం అయింది. ప్రణవంలో చెప్పబడ్డ భగవద్భక్తి, నమశ్శబ్దంలో చెప్పబడిన భాగవతభక్తి - ఈరెండింటిలోనూ స్థిరంగా కాలూనుకున్నవారు ఆళ్వారు. వీరు మధ్యమపదమైన నమశ్శబ్దంలో విశేషంగా చెప్పబడిన ఆచార్యభక్తిలోనే కాలూనుకొన్నవారు.

**మదురకవి:** నమ్మాళ్వారు సర్వేశ్వరుడిమీద కవిత్వంచెప్పడంవల్ల, "ఎన్నావిల్ ఇన్ కవి" (తిరువాయ్. 3-9-1) [నానాలుకమీద మధురమైన కవిత్వం] అని తమకవిత్వాన్ని పొగుడుతూ చెప్పేరు. వీరుకూడా ఆళ్వారిగురించి కవిత్వాన్ని చెయ్యడంవల్లనే తమకవిత్వాన్ని 'మదురకవి' -మధురమైన కవిత్వం- అని పొగుడుతూ చెప్తున్నారు. **నమ్బిక్కు అన్బనాయ్ మదురకవి శొన్న శొల్:** వీరి మనస్సుకి పని ఆళ్వారిమీద ప్రేమని కలిగిఉండడమే. వీరినాలుకకి పని ఆళ్వార్ల గుణాలని కీర్తించడమే.

శొన్న శొల్ అంటూ ఆచార్యవైభవాన్ని చెప్పిన ఈప్రబంధాన్ని చూసి ఆశ్చర్యంతో చెప్తున్నారు. **నమ్బువార్:** దీనిమీద ఆశపెట్టుకున్నవాళ్ళు. ఈప్రబంధంతాలూకు అర్థాన్ని తెలుసుకోవడమే కాకుండా ఇందులో అభినివేశంగలవాళ్ళై దీనిని ఎప్పుడూ అనుసంధానం చేస్తూండేవాళ్ళు. దీన్లో చెప్పబడిన ఆళ్వార్ల గొప్పదనాలని చూసి ఆశ్చర్యపోవడం, ఈమహత్త్వాలని ఎప్పుడూ ఒకరు చెప్తూంటే వినాలని ఆశపడడం మొదలైనవాటిని చేసేవాళ్ళు 'నమ్బువార్' అని చెప్పబడుతారు

**నమ్బువార్:** సర్వేశ్వరుడి గొప్పదనంకంటే ఆళ్వార్ల గొప్పదనాలనే ఇష్టపడుతున్నవాళ్ళు. **పదివైగున్దమ్ కాణ్మినే:** 'వానవర్ నాడు' (తిరువాయ్. 3-9-9) [నిత్యసూరుల దేశం]అని చెప్పినట్లుగా వైకుంఠం నిత్యసూరులకి వశపడినదేశంగనుకనే వీళ్ళు ఆళ్వార్తిరునగరిని, వారి గొప్పదనాలనే ఇష్టపడినా, నిత్యసూరులు వీళ్ళకి పరమపదంలో స్థానం ఏర్పాటుచేసిఉంచుతారు. ఈఅర్థం అవతారికలో చెప్పబడ్డది. 11.

పదకొండవపాశురానికి అళ్గియమణవాళపెరుమాళ్ నాయనారుల వ్యాఖ్యానవిశేషాలు పూర్తియైనవి.

***

మధురకవిఆవార్ తిరువడిగళే శరణమ్.

జీయర్ తిరువడిగళే శరణమ్

*కణ్ణినుణ్ శిఱుత్తామ్బు వ్యాఖ్యాన వివరణములు సంపూర్ణము.*